సినిమా పేజీలో

www.andhrajyothy.com
విజయవాడ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 4-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 141

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 9.47 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తర పూర్తి; వర్జ్యం: ఉ. 11.17-1.05; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.38; అమృతఘడియలు: రా. 10.06-11.55; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కష్టాలు.. కన్నీళ్లు


నడి సంద్రంలా మారిన పాయకాపురంలో భయంతో చిన్నారుల రోదన


బెజవాడలోని రాజీవ్‌నగర్‌లో మూడు రోజుల తర్వాతా నడుము లోతున నిలిచి ఉన్న నీటిలో కాలినడకన, పడవల్లో బయటపడేందుకు ప్రజల ప్రయత్నం


సింగ్‌నగర్‌లో పసికందును పొదివి పట్టుకొని సురక్షిత ప్రాంతానికి చేరే యత్నం

వరద వచ్చిన మొదటి రోజు పరిస్థితిని అంచనా వేయలేకపోయారంటే అర్థం చేసుకోవచ్చు. రెండో రోజున... వరద పోటు వల్ల లోపలికి పోలేకపోయారంటే సరే అనుకోవచ్చు. కానీ... వరద కొంత తగ్గినా, వరుసగా మూడో రోజున కూడా 'సాయం' జోరందుకోకపోవడానికి కారణమేమిటి?

?

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్లు మూగనోము పట్టాయి. ఏరియాల వారీగా పర్యవేక్షకులను నియమించారని తెలుసుకుని ఫోన్లు చేస్తే స్విచ్ఛాఫ్ వస్తున్నాయి.

సహాయక చర్యల్లో కొందరు బోటు ఆపరేటర్లు కాసుల కక్కుర్తి ప్రదర్శించారు. ఒక్కొక్కరికి రూ.2 వేలు ఇస్తేనే బయటికి తీసుకొస్తామని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు.

సమగ్ర కథనాలు 10, 11, 12లో

హాహాకారాలు.. ఆర్తనాదాలు.. ప్రధాన ప్రాంతాలకే పరిమితమైన సాయం



మారుమూల ముంపు దాకా చేరని ఆహారం
మూడు రోజులుగా ఆకలి దప్పులతో వేదన
ప్రాణాలకు తెగించి వరదనీటిలో నడక
బతుకు జీవుడా అని ఒడ్డుకు చేరుతున్న దైన్యం
ట్యూబులు, థర్మోకోల్ షీట్లే పడవలు
వాటిపైనే పిల్లలు, వృద్ధుల తరలింపు
ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న ఆహారం
దానిని బాధితులకు అందించే దారేదీ?
పెద్దసంఖ్యలో పడవలు వచ్చినా రోడ్లమీదే
సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై వాహనాలు, జనం జాతర
అచ్చెన్న చెప్పినా క్లియర్ చేయని వైనం
జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయ లోపం
సీఎం వస్తే తప్ప అడుగు బయటపెట్టని కలెక్టర్
బుడమేరు బాధితుల్లో తీవ్ర ఆవేదన, ఆక్రోశం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఎక్కడుంది లోపం? ఎవరిది వైఫల్యం? స్వయంగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగినా... మంత్రులంతా నీళ్లలో ఉన్నా బాధితులకు ఉపశమనం ఎందుకు లభించడంలేదు? బెజవాడ వరద బాధితులను మూడో రోజూ ఎందుకు కష్టాలు వీడటంలేదు? ఇవి విస్మయ పరిచే ప్రశ్నలు! వరద బాధిత ప్రాంతాల్లో కనిపిస్తున్న వాస్తవాలు! బుడమేరు వరద బాధితుల సహాయక చర్యలలో లోటుపాట్లు కనిపిస్తున్నాయి. వరద నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడంలో వేగం మందగించింది. శాఖల మధ్య సమన్వయం లోపించడం, ఎవరు పర్యవేక్షిస్తున్నారో తెలియని పరిస్థితుల్లో... మంగళవారం మూడో రోజు కూడా వరద నీటిలో చిక్కుకున్న వారిని రక్షించలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

బతుకు కోసం చావుతో పోరాడి..

విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని 15 డివిజన్లు బుడమేరు వరదలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారి నుంచి బాగా లోపలున్న వారికి మంగళవారం కూడా సాయం అందలేదు. మొదటి అంతస్తు దాటి పైన ఉన్న వారికి ఇళ్లలో

మిగతా 11వ పేజీలో...


మూడో రోజూ వరద ప్రాంతాల్లో తిరుగుతూ బాధితుల గోడు వింటున్న సీఎం చంద్రబాబు

సర్వశక్తులు ఒడ్డుతున్నాం

బాధితుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తాం
అరగంట ఆలస్యమైనా అందరినీ ఆదుకుంటాం
విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదు
చివరికి మంత్రులను కూడా ఉపేక్షించను
కొందరు అధికారుల తీరు ఆక్షేపణీయం
సొమ్ము, సహాయ సామగ్రి ఉన్నా పంచలేరా?
చేతకాకపోతే తప్పుకోండి.. బాబు ఫైర్

సహాయక చర్యలు ముమ్మరం

వీలైనంత త్వరగా సాధారణ స్థితికి
కార్పొరేషన్ల నుంచి 10 వేల మంది సిబ్బంది
వరద తగ్గాక పారిశుధ్యం, ఆరోగ్యంపై దృష్టి: నారాయణ
రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు: మంత్రి పయ్యావుల
అందరినీ ఆదుకుంటాం: మంత్రులు కొలుసు, కొల్లు
ప్రాణనష్టం స్వల్పం.. ఫలించిన సర్కారు వ్యూహం

అత్యంత భయానకం

బుడమేరు చరిత్రలోనే రికార్డు వరద.. దిగువకు 40 వేల క్యూసెక్కులు
బుడమేరు, కొల్లేరు ఆక్రమణలతో విజయవాడపై మహోగ్రరూపం
ముందుకు సాగే క్రమంలో వేగం తగ్గి దిశ మార్చుకున్న వరద ప్రవాహం
వేల ఎకరాల పంటలు మునక.. గన్నవరం ప్రాంతానికి తొలిసారి వరద
కృష్ణా కరకట్ట క్షేమం.. కలిసొచ్చిన సమన్వయం


బుడమేరుకు పడ్డ మూడు భారీ గండ్ల పూడ్చివేత పనులు నడుస్తున్న దృశ్యం

బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్..
9 మంది నక్సల్స్ మృతి

మృతుల్లో ఆరుగురు మహిళలు
అందరూ పీఎల్‌జీ సభ్యులే!
5 తుపాకులు, విప్లవ సాహిత్యం స్వాధీనం
బీజాపూర్‌లో 13 మంది నక్సల్స్ అరెస్టు
3


జిందాల్ కోసం జగనన్న
జెత్వానీ కట్టడికి మాస్టర్ ప్లాన్



జిందాల్, జగన్ పదేపదే కలిసింది ఈ కేసు కోసమేనా?
ఆడదాన్ని ఒక్కదాన్ని చేసి తొక్కేయాలని చూశారు
జగన్ నీకూ ఇద్దరు ఆడపిల్లలున్నారు.. మర్చిపోయావా?
గుడ్లవల్లేరు కెమెరాల వ్యవహారంపై ఫేక్ ప్రచారం: షర్మిల
3

అదంతా దుష్ప్రచారమే!

హాస్టల్ స్నానపు గదుల్లో రహస్య కెమెరాల్లేవు
నలుగురు విద్యార్థుల తీరుతోనే ఇంత వివాదం
తన నగ్న వీడియోలు బయటకు రాకూడదనే.. అందరి వీడియోలూ ఉన్నాయని బెదిరించిన యువతి
బాత్‌రూముల్లో రహస్య కెమెరాలు పెట్టారని వెల్లడి
విద్యార్థినులు ఆరా తీసే క్రమంలో వివాదం వెలుగులోకి
గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ వివాదంలో వాస్తవాలు వెలికి తీస్తున్న ముగ్గురు ఐజీల బృందం
వైఫై రూటర్లను విశ్లేషిస్తున్న సెర్ట్, సీడాక్ నిపుణులు
3



చుక్కల మందుతో చత్వారానికి చెక్

ముంబై కంపెనీ కొత్త ఐ డ్రాప్స్
ఒక్క చుక్క వేస్తే ఆరు గంటలపాటు రీడింగ్ గ్లాసెస్ అవసరమే ఉండదు!
అక్టోబరు నుంచి అందుబాటులోకి
2



రూ.1.45 లక్షల కోట్లతో 'రక్షణ' కొనుగోళ్లు

విమానాలు, యుద్ధట్యాంకులు, రాడార్లు, అత్యాధునిక గస్తీ నౌకలు..
99% దేశీయంగా తయారైనవే
ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదం
2

పశువుల స్మగ్లర్‌గా భావించి..
12వ తరగతి విద్యార్థి కాల్చివేత

కారుతో 30 కి.మీ.లు వెంబడించి కాల్పులు.. ఢిల్లీ-ఆగ్రా రహదారిపై దారుణం
'గో రక్షణ' బృందానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
2

బ్రూనైతో భారత్ సుదృఢ సంబంధాలు

ఆ దిశగా కృషి చేస్తానన్న ప్రధాని మోదీ
ఇరు దేశాల దౌత్య సంబంధాలకు 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్రూనైలో పర్యటన

తక్కువ సమయంలో సమర్థంగా పనిచేస్తున్నాం

బుడమేరుపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం

లాకులు కూడా రిపేరు చేయలేదు.. ఇప్పుడు వారిని తిట్టి ఫలితం లేదు
ప్రజలకు మేం చేయాల్సినంత సాయం చేస్తాం



డేంజర్ జోన్ నుంచి బయటపడ్డాం
ఆందోళన చెందాల్సిన పనిలేదు
ఇది ఓ విపత్తు.. వరదలు దురదృష్టకరం
6.44 లక్షల మందిపై వరద ప్రభావం
42 వేల మందికి పునరావాసం
రెస్క్యూ ఆపరేషన్లకు ఇబ్బంది ఉండకూడదనే పర్యటించలేదు
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి

వరద బాధితుల సాయానికి కోటి విరాళం ఇస్తానని ప్రకటన

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'ఇది ఒక విపత్తు. ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే ఈ విపత్తు రావడం దురదృష్టకరం. విపత్తు తలెత్తగానే ప్రభుత్వం సత్వరమే స్పందించి, ఎఫెక్టివ్‌గా పని చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అందరం సహాయ కార్యక్రమాల్లో పని చేస్తున్నాం. చంద్రబాబు వ్యయప్రయాసలకోర్చి పనిచేస్తున్నారు. 72గంటలుగా నిద్ర కూడా లేకుండా అధికారులంతా పని చేస్తున్నారు" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. వరదలపై కుంచనపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ

మిగతా 2వ పేజీలో...

వరద బాధితులకు భువనేశ్వరి విరాళం 2 కోట్లు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):వరద బాధితుల సహాయార్థం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి హెరిటేజ్ సంస్థ తరఫున ఏపీకి రూ.కోటి, తెలంగాణకు రూ.కోటి చొప్పున మొత్తం రూ.2 కోట్లు విరాళం ప్రకటించారు. అలాగే ఆయుష్ ఆసుపత్రి యాజమాన్యం సీఎం చంద్రబాబును కలసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో రూ.50 లక్షలు విరాళంగా అందజేసింది. ఆయుష్ ఎండీ కోడూరు గోపాలకృష్ణ, కార్డియాలజిస్టు డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ శశి పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులు రూ.కోటి విరాళం



రూ.కోటి చెక్కును చంద్రబాబుకు అందచేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3: వరద బాధితులను ఆదుకునేందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు రూ.కోటి విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజయవాడలో మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విపత్తు నుంచి ప్రజలు త్వరగా కోలుకొని బయటపడాలని ఆకాక్షించారు.

బుద్దా సాయం రూ. 5 లక్షలు

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 3: వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 లక్షలు విరాళంగా అందచేస్తున్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముంపు ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారన్నారు. ఇక, వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు మంగళగిరి నియోజకవర్గానికి చెందిన కళ్లం రాజశేఖరరెడ్డి రూ.10 లక్షలు, కొమ్మారెడ్డి కిరణ్ రూ.10 లక్షలు చొప్పున చెక్కుల రూపంలో తమ విరాళాలను మంత్రి లోకేశ్‌కు అందజేశారు. ఇంకా ఏవీ రమణారెడ్డి రూ.7 లక్షలు, ఒంగోలుకు చెందిన మేదరమెట్ల సుబ్బయ్య రూ.లక్ష, ఆలూరు కొండలరావు రూ.50 వేలు, ఆలూరి ఝాన్సీలక్ష్మి రూ.50వేలు చొప్పున విరాళాలు ఇచ్చారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రమేశ్ రూ.5 లక్షలు, మంగళగిరికి చెందిన పి.లక్ష్మీ వెంకట నారాయణమూర్తి యాదవ్ దంపతులు రూ.1.2 లక్షలు అందజేశారు.

వరద బాధితులకు ఒక రోజు వేతనం విరాళం

» ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఒక రోజు వేతనాన్ని వినియోగించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేశ్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ సంఘాలూ ఇలాగే, ఆమోదం తెలపాలని కోరారు. అలాగే, స్వచ్ఛందంగా అదనపు సాయం చేయాలనుకునే ఉద్యోగులు, అధికారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, బ్యాంక్ ఖాతాను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. కాగా, పశ్చిమగోదావరి జిల్లా నుంచి పెద్దఎత్తున ఆపన్నహస్తం అందింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవతో దాతలు తమదైన శైలిలో ముందడుగు వేసి పెద్దమనసు చూపారు. ఆ జిల్లా నుంచి 1,98,960 ఆహార పొట్లాలు, 70 వేల వాటర్ బాటిళ్లు, ఐదు వేల అరలీటరు నీటి సీసాలు, 1,15,100 బిస్కెట్ ప్యాకెట్లు, 14 వేల రొట్టెలు, 22 వేల రస్కుల ప్యాకెట్లు విజయవాడకు చేరాయి.

వరద బాధితులకు సాయం చేయండిలా...

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. బాధితులకు ఏ రూపంలోనైనా సాయం అందించవచ్చని తెలిపింది. ఆహారం ఇవ్వదలచిన దాతల కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోపల నిర్దేశిత పాయింట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆహారం అందించే దాతలను కోఆర్డినేట్ చేసుకునే బాధ్యతను ఐఏఎస్ అధికారి మనజీర్‌కు అప్పగించింది. ఆహారం ఇవ్వదలచిన దాతలు 7906796105 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించింది. అదేవిధంగా ధన సహాయం చేయదలచిన దాతలు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఖాతాలకు జమ చేయవచ్చని పేర్కొంది.

బ్యాంకు ఖాతాల వివరాలు..

ఎస్‌బీఐ ఖాతా పేరు: CM-RF, ఖాతా నంబరు: 38588079208, బ్రాంచి: ఏపీ సెక్రటేరియట్, వెలగపూడి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: SBIN0018884. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా పేరు:: CM Rel-ief Fund, ఖాతా నంబరు: 110310100029039, బ్రాంచి ఏపీ సెక్రటేరియట్, వెలగపూడి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: : UBIN0830798.

నేడు విజయసాయి అక్రమ నిర్మాణం కూల్చివేత?

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి భీమిలిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ అధికారులు నోటీసు అందజేసినట్టు సమాచారం. 24 గంటల్లో నిర్మాణాలను తొలగించాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామంటూ జీవీఎంసీ అధికారులు మంగళవారం నోటీసులు అతికించినట్టు చెప్పారు.

చుక్కల మందుతో చత్వారానికి చెక్



'ప్రెస్‌వూ' ఐ డ్రాప్స్.. ధర రూ.350.. అక్టోబరు నుంచి అందుబాటులోకి

ఒక్క చుక్క వేస్తే 6 గంటలపాటు రీడింగ్ గ్లాసెస్ అవసరమే ఉండదు!

న్యూఢిల్లీ, ముంబై, సెప్టెంబరు 3: నాలుగు పదుల వయసు దాటగానే కొందరికి చత్వారం (ప్రెస్బియోపియా) వస్తుంది. పుస్తకాలు చదవడానికి కళ్లజోడు అవసరం అవుతుంది. కానీ అలాంటివారికి కళ్లజోడు అవసరం లేకుండా చేసే చుక్కల మందు మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. ముంబైకి చెందిన ఎన్‌టాడ్ ఫార్మా కంపెనీ 'ప్రెస్‌వూ' పేరిట అభివృద్ధి చేసిన ఈ చుక్కల మందుకు ఔషధ నియంత్రణ సంస్థ అనుమతిచ్చింది. అక్టోబరు మొదటివారంలో ఈ మందును మార్కెట్లోకి తెస్తామని ఆ సంస్థ వెల్లడించింది. 40 నుంచి 55 ఏళ్ల వయసువారిలో.. కొద్దిపాటి నుంచి ఒక మోస్తరు చత్వారంతో బాధపడుతున్నవారు ఈ మందును కంట్లో ఒక్క చుక్క వేస్తే 15 నిమిషాల్లోనే పనిచేయడం ప్రారంభిస్తుందని సంస్థ సీఈవో నిఖిల్ తెలిపారు. ఒక్క చుక్క వేస్తే ఆరు గంటల దాకా.. రెండు చుక్కలు వేస్తే మరింత ఎక్కువ సమయం పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ చుక్కల మందు ధర రూ.350. నిజానికి.. అమెరికాలో 'వ్యూటీ' పేరుతో 2022లోనే ఈ తరహా ఐడ్రాప్స్ అందుబాటులోకి వచ్చాయి. 'ప్రెస్‌వూ'.. మనదేశంలో తయారైన మొట్టమొదటి ప్రెస్బియోపియా చుక్కల మందు కావడం విశేషం. ఈ చుక్కల మందు.. మన కన్నీటి పీహెచ్ విలువకు తగినట్టుగా వేగంగా తనను తాను సర్దుబాటు చేసుకుంటుందని, కాబట్టి దీర్ఘకాలం పాటు వాడినా ఈ మందుతో ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవని ఎన్‌టాడ్ సీఈవో నిఖిల్ వెల్లడించారు. "ఈ డ్రాప్స్ తయారీలో 'పైలోకార్పైన్' మాలిక్యూల్‌ను ఉపయోగించాం. అమెరికాలో సెప్సిస్ సమస్యకు దాన్ని చాలాకాలంగా వాడుతున్నారు. వాస్తవానికి దాన్ని రోజూ వాడడం అంత మంచిది కాదు. కాబట్టి మేం దాని గాఢతను బాగా తగ్గించి.. మన కన్నీటి పీహెచ్ విలువకు దాదాపు దగ్గరగా తెచ్చాం" అని నిఖిల్ తెలిపారు. ఈ చుక్కలు వేయగానే.. అందులోని ఔషధం కనుపాపలు కుచించుకుపోయేలా చేస్తుందని, దానివల్ల 'డెప్త్ ఆఫ్ ఫీల్డ్' పెరిగి కంటి చూపు నిశితమవుతుందని ఆయన వివరించారు.



బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం

బట్టబయలైంది

» బుల్డోజర్ నీతిపై సుప్రీం వ్యాఖ్యలను స్వాగతించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం బట్టబయలైందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ అన్నారు. నిందితులైనంత మాత్రాన వాళ్ల ఇళ్లను కూల్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన తన ట్విటర్ పోస్టులో ప్రస్తావించారు. బీజేపీ అన్యాయమైన, రాజ్యాంగ వ్యతిరేకమైన బుల్డోజర్ నీతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని చెప్పారు. బుల్డోజర్ల కింద మానవత్వం, న్యాయాలను తొక్కేసిన బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక రూపం సుప్రీం వ్యాఖ్యలతో బట్టబయలైందన్నారు. అంతులేని అధికారానికి ప్రతీకగా మారిన బుల్డోజర్ మానవ హక్కులను మంట గలుపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ న్యాయం ముసుగులో భయోత్పాతాన్ని సృష్టిస్తూ పేదలు, దళితుల ఇళ్లను బుల్డోజర్ల పద ఘట్టనలో నేలమట్టం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యతిరేకంగా చేపడుతున్న కూల్చివేతలను ఆపేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పశువుల స్మగ్లర్ అనుకొని

12వ తరగతి విద్యార్థి కాల్చివేత

కారుతో 30 కిమీలు వెంబడించి కాల్పులు.. 'గో రక్షణ' మూకకు చెందిన ఐదుగురి అరెస్టు



'గోరక్షణ' సభ్యుల దాడిలో ధ్వంసమైన కారు



ఆర్యన్

ఫరీదాబాద్, సెప్టెంబరు 3 : ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారిలో దారుణం జరిగింది. పశువుల స్మగ్లర్ అనుకొని కారుతో 30 కిలోమీటర్లు వెంబడించి మరీ ఓ యువకుడిని(12వ తరగతి విద్యార్థి) 'గో రక్షణ' మూక తుపాకీతో కాల్చి చంపింది. ఈ హత్యకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. గత నెల 23వ తేదీన జరిగిన ఈ దారుణ హత్య ఆలస్యంగా వెలుగు చూసింది. పశువుల స్మగ్లర్లు రెండు ఎస్‌యూవీ కార్లలో ఫరీదాబాద్‌లో రెక్కీ నిర్వహిస్తున్నారని ఆగస్టు 23వ తేదీ రాత్రి 'గో రక్షణ' మూకకు సమాచారం అందింది. అదే సమయంలో ఆర్యన్ మిశ్రా(19), హర్షిత్, శాంకీ అనే యువకులు తమ స్నేహితులైన మరో ఇద్దరు యువతులతో కలిసి ఎస్‌యూవీ కారులో అటుగా వెళ్లారు. హర్షిత్ కారు నడుపుతుండగా ఆర్యన్ మిశ్రా అతని పక్క సీట్లో కూర్చొని ఉన్నాడు. వాళ్లని పశువుల స్మగ్లర్లుగా భావించిన 'గో రక్షణ' మూక మరో కారుతో ఢిల్లీ- ఆగ్రా జాతీయ రహదారిలో సుమారు 30 కిలోమీటర్లు వాళ్లని వెంబడించింది. తుపాకీలు చూపి కారు ఆపమని ఆ యువకులను పలుమార్లు హెచ్చరించింది. అయితే, ఆ మూకను దోపిడి దొంగలుగా భావించిన యువకులు వారి బెదిరింపులకు భయపడి తమ వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో గదపురి టోల్ ప్లాజా వద్ద పెట్టిన బ్యారికేడ్లను ఢీకొట్టి వెళ్లారు. దీంతో 'గో రక్షణ' మూకకు చెందిన వారు తుపాకీతో కాల్పులు జరపగా.. ఆర్యన్ మిశ్రాకు బుల్లెట్ గాయమైంది. ఆపై, హర్షిత్ వాహనాన్ని నిలిపివేయగా.. దూసుకొచ్చిన 'గో రక్షణ' మూక సభ్యులు ఆర్యన్ గుండెల్లోకి నేరుగా మరోసారి కాల్చారు. దీంతో ఆర్యన్ మిశ్రా అక్కడికక్కడే మరణించాడు. అనంతరం కారులో మరో ఇద్దరు యువతులను చూసిన 'గో రక్షణ ' మూక తాము దాడి చేసింది స్మగ్లర్లపై కాదని గ్రహించి పరారయ్యారు. పరారైన ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కాగా, ఆర్యన్ మిశ్రా అతని స్నేహితులపై కాల్పులు జరిపింది 'గో రక్షణ' మూక అనేందుకు తగిన ఆధారాల్లేవని ఫరీదాబాద్ ఏసీపీ(క్రైమ్) అమన్ యాదవ్ విలేకరులతో అన్నారు. అయితే, గో సంరక్షణకు సంబంధించి నిందితులు మాట్లాడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇక, ఆర్యన్ మిశ్రా అతని స్నేహితులను వెంబడించిన వారిలో తన కుమారుడు ఉన్న మాట నిజమే కానీ అతను నిరపరాధి అని నిందితుల్లో ఒకరైన అనిల్ కౌశిక్ తల్లి విలేకరులతో అన్నారు. మరణించిన యువకుడు ఉన్న కారులో నుంచే మొదటి బుల్లెట్ వచ్చిందని కౌశిక్ తనకు చెప్పాడని తెలిపారు. గో సంరక్షణ చేస్తూ తన కొడుకు సమాజ సేవ చేస్తుంటాడని ఆమె పేర్కొన్నారు.

రోడ్లపై ప్రాణాలు హరీ!

దుర్ఘటనల్లో 43% మరణాలు రోడ్డు ప్రమాదాలతోనే

» మృతుల్లో 86% మంది పురుషులే

» వెల్లడించిన కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: దుర్ఘటనల్లో సంభవించే మరణాలకు రోడ్డు ప్రమాదాలే అతి పెద్ద కారణంగా నిలుస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఒక నివేదిక వెల్లడించింది. దాదాపు 43% మరణాలు యాక్సిడెంట్ల వల్ల సంభవిస్తున్నాయని, అతి వేగమే దీనికి ప్రధాన కారణమని తెలిపింది. అత్యధికులను బలిగొంటున్న దుర్ఘటనల్లో రోడ్డు ప్రమాదాల తర్వాత.. ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగిపోవటం, ఎత్తైన ప్రదేశం నుంచి కింద పడటం, విషప్రభావం, అగ్నిప్రమాదాలు మొదలైనవి ఉన్నాయి. 'దుర్ఘటనల నివారణకు జాతీయ వ్యూహం' పేరుతో కేంద్ర ఆరోగ్యశాఖ రూపొందించిన ఈ నివేదికను ఢిల్లీలో జరుగుతున్న 'దుర్ఘటనల నివారణ, సురక్షిత విధానాలు-14వ అంతర్జాతీయ సదస్సు'లో విడుదల చేశారు. 2022లో దుర్ఘటనల కారణంగా దేశంలో 4,30,504 మరణాలు, ఉద్దేశపూర్వకంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో 1,70,924 మరణాలు సంభవించాయని ఈ నివేదిక వెల్లడించింది. కాగా, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారిలో 86% మంది పురుషులే కావడం గమనార్హం. 75.2% రోడ్డు ప్రమాద మరణాలకు అతివేగం కారణమవుతుండగా, 5.8% మరణాలకు రాంగ్‌రూట్ డ్రైవింగ్, 2.5% మరణాలకు మద్యం, డ్రగ్స్ తీసుకొని వాహనం నడపటం కారణంగా నిలుస్తోంది. దేశంలోని రోడ్లలో కేవలం 2.1% ఉన్న జాతీయ రహదారులు.. అత్యధిక మరణాలకు కారణమవుతున్నాయి.

రూ.1.45 లక్షల కోట్లతో 'రక్షణ' కొనుగోళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: రక్షణ శాఖ రూ.1.44 లక్షల కోట్ల కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నేతృత్వంలోని రక్షణ ఉత్పత్తుల సేకరణ మండలి (డీఏసీ) మంగళవారం అనుమతి ఇచ్చింది. రూ.1,44,716 కోట్ల విలువైన కొనుగోళ్లకు సంబంధించిన 10 ప్రతిపాదనలను ఆమోదించింది. ఇందులో 99% దేశీయంగా తయారైన ఉత్పత్తుల కొనుగోలుకే ఖర్చు చేయనున్నారు. సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కొనుగోళ్లు చేపట్టనున్నారు. యుద్ధ ట్యాంకులు, రేడార్లు, విమానాలను సమకూర్చుకోనున్నారు. సైన్యానికి ఎఫ్ఆర్‌సీవీ (భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే యుద్ధ వాహనాలు)లను కొనుగోలు చేయనున్నారు. ఈ అత్యాధునిక ఆయుధాలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా శత్రువులపై పోరాడడంలో ఉపయుక్తంగా ఉంటాయి. అలాగే తీరప్రాంత రక్షణ దళానికి డార్నియర్-228 విమానాలు, గస్తీ నౌకలను సమకూర్చనున్నారు.

హత్యాచారానికి మరణశిక్ష

» బెంగాల్ అసెంబ్లీలో బిల్లు ఆమోదం

» ప్రధాని ఇలాంటి చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గు పడాల్సిన అంశం: మమత



కోల్‌కతా, సెప్టెంబరు 3: అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించేలా రూపొందించిన బిల్లును పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. అపరాజిత మహిళ, శిశు(పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాల సవరణ) పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా.. ముందుగా హామీ ఇచ్చినట్లు బీజేపీ సభ్యులు ఓటింగ్ కోసం పట్టుబట్టలేదు. కేంద్ర చట్టాలు– భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), చిన్నారులపై అత్యాచారాల నిరోధక చట్టం(పోక్సో)లో తగు సవరణలు చేయాల్సిందిగా ఈ బిల్లు సూచిస్తోంది. ముఖ్యంగా.. హత్యాచారాలు, అత్యాచారాలతో బాధితురాలి మానసిక స్థితి దెబ్బతినేలా చేసే నిందితులకు మరణ శిక్ష విధించాలని అపరాజిత బిల్లు స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కాగా, సభలో బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. "మా ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు తరహాలో.. ప్రధాని మోదీ చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గుపడాల్సిన అంశం. ఈ బిల్లును హుందాగా ఆమోదించాల్సిందిగా గవర్నర్‌ను కోరుతున్నాను. సభలో విపక్ష నేత(బీజేపీ) కూడా గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టకుండా, వీలైనంత త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఘటనలో సీబీఐ న్యాయం చేయాలని ఆమె కోరారు. "ఆర్‌జీ కర్ హత్యాచారం ఘటనపై వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ సభ్యులు, నేతలు.. ఉన్నావ్(ఉత్తరప్రదేశ్) ఉదంతంపై ఎందుకు నోరు మెదపలేదు?" అని ఆమె నిలదీశారు. ఉన్నావ్ కేసులో నిందిత చట్ట సభ్యుడిని పూలమాలలతో సత్కరించడం సిగ్గుపడే విషయమంటూ మండిపడ్డారు.

బెంగాల్ సర్కారు కోర్టు ధిక్కరణ!

» సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం

న్యూఢిల్లీ/కోల్‌కతా, సెప్టెంబరు 3: మమతాబెనర్జీ నేతృత్వంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందంటూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. "ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద కేంద్ర బలగాలకు.. ముఖ్యంగా మహిళా జవాన్లకు బెంగాల్ ప్రభుత్వం రవాణా, వసతి సదుపాయాలు కల్పించడం లేదు. మమత సర్కారు ఉద్దేశపూర్వకంగా సహాయ నిరాకరణ చేస్తోంది. ఈ చర్యలు సుప్రీంకోర్టు ఆదేశాలకు విఘాతం కలిగిస్తున్నాయి" అని ఆ అఫిడవిట్‌లో వెల్లడించింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రి వద్ద కేంద్ర బలగాల భద్రతకు సుప్రీం కోర్టు ఆగస్టు 21న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో అవినీతిపై అరెస్టయిన ఆ దవాఖానా మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్, సహ నిందితులు బిప్లవ్ సింఘా, సుమన్ హజ్రా, అఫ్సర్ అలీ ఖాన్‌ను ఎనిమిది రోజుల పాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోల్‌కతాలోని సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది.

వరదలతో 18 మంది మృతి

» పదుల సంఖ్యలో పశువుల మరణం

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోటెత్తిన వరదలు, వర్షాల కారణంగా 18 మంది మరణించినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మంగళవారం వెల్లడించింది. మరో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారని తెలిపింది. ఎన్టీఆర్ జిల్లాలో 9 మంది, గుంటూరులో 8, పల్నాడు జిల్లాలో ఒకరు మరణించారని పేర్కొంది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో భారీ ప్రాణనష్టం నివారించగలిగామని తెలిపింది. విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం...

- ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో 6,44,536 మంది ప్రభావితులయ్యారు. 193 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. 42,707 మందిని శిబిరాలకు తరలించి ఆహారం, తాగునీరు అందిస్తున్నారు.
- వరద బాధితుల కోసం వైద్య ఆరోగ్యశాఖ 194 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. 26 ఎన్డీఆర్ఎఫ్, 22 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్నాయి. గత మూడు రోజులుగా హెలికాప్టర్ల ద్వారా 5 వేల కిలోల ఆహారాన్ని సరఫరా చేశారు.
- 21 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విజయవాడ పరిధిలో 154 బోట్లును సహాయ చర్యలకు ఉపయోగించగా, బాపట్ల జిల్లాలో 55, కృష్ణా జిల్లాలో 19 బోట్లు ఉపయోగిస్తున్నారు.
- 16 జిల్లాల్లో 4.23 లక్షల ఎకరాల్లోని వ్యవసాయ పంటలు, 44 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు నీట మునిగాయి. 149 పశువులు మృతి చెందగా, 59,848 కోళ్లు మృత్యువాత పడ్డాయి.
- రాష్ట్రవ్యాప్తంగా 2,851 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు, 308 కిలోమీటర్ల పొడవున మున్సిపల్ రోడ్లు, 221 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.
- నగరాలు, పట్టణాల్లో 231 ప్రాంతాలు వరద ముంపునకు గురికాగా 124 ప్రాంతాలను పునరుద్ధరించారు.

తక్కువ సమయంలో సమర్థంగా పనిచేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'విజయవాడ ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. ఒకవైపు వర్షాలు ఎక్కువవ్వడంతో వరదలు పెరిగాయి. తెలంగాణలో అధిక వర్షాలు కురిసి.. వాగుల్లోని నీరు మనవైపు రావడంతో మనకు విపరీతమైన నష్టం జరిగింది. బుడమేరును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. లాకులు కూడా రిపేరు చేయలేదు. ఇప్పుడు వాళ్లను తిట్టడం వల్ల ఉపయోగం లేదు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న మేము మా చేతుల్లో ఉన్నది చేస్తాం. సహాయ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లే పనిలో ఉన్నాం' అని పవన్ అన్నారు. 'అన్నమయ్య డ్యామ్ నిర్వహణను సరిగ్గా చేయకపోవడం వల్ల నష్టపోయాం. భవిష్యత్తులో ఇలాంటివి రాకుండా వరద నివారణ కెనాల్స్ ఏర్పాటు చేయాలన్న దానిపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తాం. రాష్ట్రంలోని ప్రతి నగరంపై వరదల నివారణకు ప్రత్యేక ఎసెస్‌మెంట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం నీళ్లు తగ్గుముఖం పడుతున్నాయి. నీటి విడుదల 5 లక్షల క్యూసెక్కులకు వచ్చినట్లు విపత్తుల నిర్వహణ సంస అధికారులు వివరించారు. 10 నుంచి 12 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుందని ఎవ్వరూ ఊహించలేదు' అని పవన్ వెల్లడించారు.

42,707 మందికి పునరావాసం

రాష్ట్రంలో 6,44,536 మంది వరదల వల్ల ఎఫెక్ట్ అయ్యారని, వారిలో 42,707 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు. 'పంచాయతీరాజ్ శాఖ 262 టీమ్‌లు ఏర్పాటు చేసింది. వరద లేని జిల్లాల్లో సిబ్బందిని.. ప్రభావిత ప్రాంతాలకు పంపించాం. ఇప్పటి వరకు 19 మంది మరణించారు. ఇద్దరి ఆచూకీ దొరకలేదు. 136 పశువులు కనిపించకుండాపోయాయి. 1.72లక్షల హెక్టార్లలో పంటల నష్టం జరిగింది. వరద సాయంలో భాగంలో 188 బోట్లు, 5 హెలికాప్టర్లు ఉన్నాయి. 3 లక్షల ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేశాం. ప్రభుత్వం తరఫున 1070, 112, 1800-4250101 కాల్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. 194 మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైద్య సదుపాయం కల్పించాం. ప్రతి రోజూ తమ కాల్ సెంటర్‌కు 700 వందల కాల్స్ వస్తున్నాయి. వారి ఇబ్బందులు వెంటనే పరిష్కరిస్తున్నాం.. తక్కువ సమయంలో ఎఫెక్టివ్‌గా పని చేస్తున్నాం. భవిష్యత్తులో ఇలాంటి జరగకుండా పని చేస్తాం. డేంజర్ జోన్ నుంచి బయటపడ్డాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సహాయక చర్యల్లో సీఎం నేరుగా పాల్గొంటున్నారు. రాష్ట్ర, జాతీయ విపత్తుల సంస్థల అధికారులు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పాల్గొంటున్నారు' అని పవన్ వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 1080 కిలోమీటర్ల రోడ్లు పాడయ్యాయని, 26 జిల్లాలకు రూ.80 కోట్లు కేటాయించామని తెలిపారు. అధికారులంతా రేయింబవళ్లు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారని, చిన్న ప్రాంతాలకు కూడా ఐఏఎస్ అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థ స్పెషల్ సీఎస్ సిసోడియా 72గంటలుగా నిద్రలేకుండా పని చేస్తున్నారని వివరించారు. అందరినీ అప్రమత్తం చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో తప్పెవరిది అన్నది కాకుండా ఎంత వరకూ సహాయ కార్యక్రమాలు చేశామన్నది ముఖ్యమని పవన్ వ్యాఖ్యానించారు. ప్రయివేటువ్యక్తులు కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పవన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కూడా సాయమందించాలని కోరుతున్నామన్నారు.



వరద పరిస్థితిని డిప్యూటీ సీఎం పవన్, హోం మంత్రి అనితకు వివరిస్తున్న సిసోడియా

తన వల్ల ఇబ్బందులొస్తాయనే జనంలోకి రాలేదు..

ఈ విపత్కర సమయంలో వరద సహాయక కార్యక్రమాలకు తన వంతుగా ప్రభుత్వానికి రూ.కోటి సాయం ఇస్తానని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కోటి చెక్‌ను బుధవారం సీఎం చంద్రబాబును కలిసి అందిస్తానని ప్రకటించారు. ప్రధానంగా వరద ప్రాంతాలకు తాను వస్తే ప్రజలకు సహాయ చర్యలకు ఇబ్బందులు వస్తాయని, తాను అడ్డమైపోతానని అధికారులు చెప్పారని, అందుకే తాను వారి సూచనల మేరకు ఆగిపోయానని డిప్యూటీ సీఎం పవన్ వెల్లడించారు. వాళ్లు నిర్ణయం తీసుకున్నా తర్వాత వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్తానన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సహాయపడాలే తప్ప.. ఇబ్బందులు సృష్టించకూడదన్నదే తన అభిమతమని చెప్పారు. తాను వ్యక్తిగతంగా కనిపించకపోయినా పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి పని చేస్తున్నానన్నారు. 'నేను ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాను. ప్రజలకు ధైర్యం చెప్పడానికి ఒకసారి రోడ్డు మీదకు వెళ్తే పరిస్థితి వేరేలా ఉంటుంది. రెస్క్యూ ఆపరేషన్లకు ఇబ్బందులు రాకుడదనే నేను ఆగిపోయాను. కొందరు అనాలికాబట్టి అంటున్నారు' అని పవన్ వ్యాఖ్యానించారు. కాగా, చెరువులు, నాలాల్లో నిర్మాణాలు చేపట్టినప్పుడే అడ్డుకోవాలని, ఇది ప్రతి ప్రభుత్వం తీసుకోవాల్సిన బాధ్యత అని తెలిపారు. మొదటి నుంచీ ప్రభుత్వాలు పని చేస్తే పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. 20 ఏళ్లల్లో హైదరాబాద్‌లో అనేక నిర్మాణాలు చేపట్టారని, జలవనరల శాఖ కట్టడి చేసినా, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అనుమతులు ఇచ్చారన్నారు. ఇది సామాజిక సమస్య అని, దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన తీసుకురావాలని, ఇప్పుడే ఇలాంటి పరిస్థితికి అడ్డుపడుతుందని పవన్ సూచించారు.

బ్రూనై పర్యటనకు మోదీ

బందర్ సేరి బెగ్వాన్, సెప్టెంబరు 3: భారత్-బ్రూనైల మధ్య సుదృఢ సంబంధాలు నెలకొనేందుకు కృషి చేస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అధికారిక పర్యటన నిమిత్తం ఆయన మంగళవారం బ్రూనై దేశ రాజధాని బందర్ సేరి బెగ్వాన్ చేరుకున్నారు. బ్రూనైలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని ఆయనే కావడం విశేషం. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమయి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్రూనై సుల్తాన్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టారు. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్', ఇండో-పసిఫిక్ విజన్ విధానాల్లో బ్రూనై భాగస్వామ్యం చాలా కీలకమని గుర్తించారు. అందులో భాగంగానే మూడు రోజుల పాటు బ్రూనైతో పాటు సింగపూర్‌లలో పర్యటించి పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. యువరాజు హాజీ అల్ ముతాదీ బిల్లా స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీకి ఘన స్వాగతం పలకడం విశేషం. బస చేసే హోటల్ వద్దకు బ్రూనైలో నివసించే భారతీయులు చేరుకొని ప్రధానిని సాదరంగా ఆహ్వానించారు. మోదీ రేఖా చిత్రాన్ని ఓ బాలిక ఆయనకు బహూకరించింది. ప్రస్తుత సుల్తాన్ తండ్రి నిర్మించిన ఒమర్ అలీ సైఫుద్దీన్ మసీదును మోదీ సందర్శించారు.

నేటి నుంచి రైళ్ల రాకపోకలు?

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భారీ వర్షాలు, వరదల ధాటికి మహబూబాబాద్ జిల్లాలో ఆరు చోట్ల ధ్వంసమైన రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఒక్కో ప్రాంతంలో 100 మంది చొప్పున సుమారు 600 మంది కూలీలు పనులు చేస్తున్నారు. సుమారు 200 మంది రైల్వే అధికారులు, సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి సికింద్రాబాద్-విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు. ఆదివారం వరద ఉధృతికి ఇంటికన్నె-కేసముద్రం సెక్షన్‌లో 418 మైలురాయికి సమీపంలో రెండు చోట్ల 70 మీటర్ల చొప్పున ట్రాక్ కొట్టుకుపోయింది. మూడు రోజులుగా వివిధ మార్గాల నుంచి విజయవాడ వైపు వెళ్లే సుమారు 600 రైళ్లు రద్దు కావడంతో దక్షిణ మధ్య రైల్వేకు భారీగా నష్టం వాటిల్లింది.

బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్.. 9 మంది నక్సల్స్ మృతి

- మృతుల్లో ఆరుగురు మహిళలు
- అంతా పీఎల్‌జీ సభ్యులుగా గుర్తింపు
- ఐదు తుపాకులు, విప్లవ సాహిత్యం స్వాధీనం
- బీజాపూర్‌లో 13 మంది నక్సల్స్ అరెస్టు

చర్ల/చింతూరు, సెప్టెంబరు 3: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవులు మరోమారు కాల్పుల మోతతో దద్దరిల్లాయి. బీజాపూర్-దంతేవాడ సరిహద్దుల్లోని లోహగావ్, పురంగెల్ కొండపై మంగళవారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 9 మంది నక్సల్స్ మృతిచెందారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. దంతేవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి లోహగావ్-పురంగెల్ కొండల మధ్య మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు ఉప్పందుకున్న దంతేవాడ, బీజాపూర్ జిల్లాల డీఆర్‌జీ పోలీసులు, బీఎస్‌ఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. మంగళవారం ఉదయం బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య 7-8 దశల్లో.. సుమారు నాలుగు గంటల పాటు కాల్పులు కొనసాగాయి. "మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయిన కాసేపటికి బలగాలు ముందుకు చొచ్చుకెళ్లాయి. ఘటనాస్థలంలో తొమ్మిది మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం. వారిలో ఆరుగురు మహిళా నక్సలైట్లు. వీరంతా పీఎల్‌జీ-2 గెరిల్లా బెటాలియన్, దర్భా కమిటీకి చెందిన మావోయిస్టులు అని నిర్ధారించాం. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉంది. మృతదేహాల వద్ద ఒక ఎస్‌ఎల్‌ఆర్, 303, 315 రైఫిళ్లు, ఒక డ్రెయిన్ గన్, మరొక 12-బోర్ గన్, ఒక బీజీఎల్, మందుపాతరలు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది" అని గౌరవ్‌రాయ్ వెల్లడించారు. మరోవైపు బీజాపూర్ అడవులపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉంది. వాగులు పొంగిపొర్లుతున్నాయి. తుపానులోనూ బలగాలు 'ఆపరేషన్ జలశక్తి' పేరుతో కూంబింగ్‌ను కొనసాగిస్తున్నాయి.

పీఎల్‌జీఏకు వరుస దెబ్బలు

మావోయిస్టు పార్టీలో పీపుల్స్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)ది కీలక పాత్ర. పార్టీని కాపాడడం, బలగాలపై గెరిల్లా దాడులు చేయడం పీఎల్‌జీ ముఖ్య విధి. అయితే.. వేసవిలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో పీఎల్‌జీకి భారీ దెబ్బ తగిలింది. గెరిల్లా యుద్ధంలో వ్యూహాలు రచించడంలో దిట్టగా పేరున్న హిడ్మా నేతృత్వంలోని పీఎల్‌జీ మొదటి బెటాలియన్ సభ్యులు కూడా పెద్దఎత్తున పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. తాజా ఎన్‌కౌంటర్‌లోనూ మృతుల్లో సింహభాగం పీఎల్‌జీ-2 బెటాలియన్‌కు చెందినవారని పోలీసులు అనుమానిస్తున్నారు.

13 మంది మావోయిస్టుల అరెస్టు

బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెర్రాం అడవుల్లో పోలీసులు సోమవారం 13 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. వారి నుంచి మందుగుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఐఈడీ మందుపాతర పేల్చిన ఘటనలో ఈ 13 మంది నిందితులని బీజాపూర్ పోలీసులు వెల్లడించారు.

పోలవరం ఎడమ కాలువ పనులకు టెండర్లు
4 ప్యాకేజీలు.. రూ.960 కోట్లు

- జల వనరుల శాఖ ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి గోదావరి జలాలను తరలించే ప్రక్రియకు మార్గం సుగమమవుతోంది. రాష్ట్ర జల వనరుల శాఖ పోలవరం ఎడమ ప్రధాన కాలువలో రూ.960.34 కోట్లతో చేపట్టిన ప్యాకేజీ 1, 3, 5, 5ఎ, 6ఏ పనులు ప్రీక్లోజర్ చేసి టెండర్లు పిలవనుంది. ఈ మేరకు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనులు పూర్తి చేస్తే.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా ఎడమ కాలువ ద్వారా విశాఖకు గోదావరి జలాలను తీసుకెళ్లవచ్చు.

కొత్తగా 2,774 రేషన్ షాపులు

రాష్ట్రంలో కొత్తగా 2,774 రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ షాపులకు కేటాయించిన కార్డులు హేతుబద్ధీకరించనుంది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రేషన్ షాపునకు 400 నుంచి 450 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 500 నుంచి 550 కార్డులు, కార్పొరేషన్ల(నగరపాలక సంస్థల) పరిధిలో 600 నుంచి 650 కార్డులు చొప్పున కేటాయించనున్నారు.కొత్తగా ఏర్పాటు చేయనున్న రేషన్ షాపుల వల్ల ఏటా రూ.1.21 కోట్ల అదనపు భారం ప్రభుత్వంపై పడనుంది.

ముందస్తు బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసు..

మంగళగిరి పరిధిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి వ్యవహారంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టు నేడు తీర్పు వెల్లడించనుంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్, పార్టీ నేత దేవినేని అవినాశ్, కార్యకర్తలు జి.రమేశ్, షేక్ రబ్బాని బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్, మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసి.. సెప్టెంబరు 3న నిర్ణయం ప్రకటిస్తామని తెలిపింది. ఈ వ్యాజ్యాలు మంగళవారం కోర్టు విచారణ జబితాలో చేరలేదు. కోర్టు ప్రారంభమైన వెంటనే వైసీపీ నాయకుల తరఫు న్యాయవాదులు ఈ విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో బుధవారం తీర్పు వెల్లడిస్తామని జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు. మరోవైపు చంద్రబాబు నివాసంపై మూకదాడి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన అనుచరులు వేసిన పిటిషన్లపై కూడా బుధవారం నిర్ణయం ప్రకటిస్తామని న్యాయమూర్తి తెలిపారు.

సుప్రీంలో జగన్ అక్రమాస్తుల కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తుల కేసులో ప్రమేయం ఉన్న భారతి సిమెంట్ కార్పొరేషన్, జగతి పబ్లికేషన్స్, విజయసాయిరెడ్డిలకు వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. సీబీఐ కేసుల్లో తీర్పు తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా సీబీఐ కేసుల్లో తీర్పులు వచ్చేవరకూ మనీలాండరింగ్ కేసుల్లో తీర్పులు వెలువరించకుండా వేచి చూడాలని తన తీర్పులో స్పష్టం చేసింది. 2022లో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ గతేడాది మే 8న ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈడీ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి దాఖలైన అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారించాలని విజయసాయిరెడ్డి తరఫు న్యాయవాదులు కోరారు. దీనిపై ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అభిప్రాయాన్ని కోరగా.. ఈడీ అధికారులతో చర్చించి చెబుతామని తెలిపారు.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో ఇకపై శ్రీకాకుళం జిల్లా పలాస జీడిపప్పును వినియోగించనున్నారు. 45ఏళ్లకు ముందు పలాస జీడిపప్పును లడ్డూ ప్రసాదంలో వినియోగించారని చెబుతున్నారు. ఆ స్థాయిలో సరఫరా చేయకపోవడంతో కేరళ, కర్ణాటక, తమిళనాడు పోటీ పడి టెండర్లు దక్కించుకున్నాయి.

అదంతా దుష్ప్రచారమే..!

హాస్టల్ స్నానపు గదుల్లో రహస్య కెమెరాల్లేవు.. నలుగురు విద్యార్థుల తీరుతోనే ఇంత వివాదం

- తన నగ్న వీడియోలు బయటకు రాకూడదని అందరి వీడియోలూ ఉన్నాయని బెదిరించిన యువతి
- బాత్ రూముల్లో రహస్య కెమెరాలు పెట్టారని వెల్లడి
- విద్యార్థినులు ఆరా తీసే క్రమంలో వివాదం బయటకు
- గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ వివాదంలో.. వాస్తవాలు వెలికి తీస్తున్న ముగ్గురు ఐజీల బృందం
- వైఫై రూటర్లను విశ్లేషిస్తున్న సెర్ట్, సీడాక్ నిపుణులు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలను వలలో వేసుకుని వారితో న్యూడ్ కాల్స్ రికార్డు చేసే ఇంజనీరింగ్ విద్యార్థి ఒకడు... ప్రియుడితో హోటల్ గదులకు వెళ్లే ప్రియురాలు మరొకరు.. ఆమె వన్‌సైడ్ ప్రేమికుడు ఇంకొకరు... చెల్లిని మోసం చేసిన స్నేహితుడి అంతు చూడాలనుకున్న విద్యార్థి మరొకరు... ఇలా ఈ నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులే కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రి రావు ఇంజనీరింగ్ కాలేజీలో వివాదానికి కారణమని నిపుణులు, పోలీసులు దాదాపు ఒక నిర్ధారణకు వచ్చారు..! ఒక అమ్మాయి హిడెన్ కెమెరాలతో హాస్టల్ విద్యార్థినుల నగ్న వీడియోలు రికార్డు చేసి హాస్టల్‌లోని అబ్బాయిలకు విక్రయిస్తున్నట్లు పుట్టించిన వార్తల్లో నిజాలు నిగ్గుతేల్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ముగ్గురు ఐజీలు జీవీజీ అశోక్‌కుమార్ , వీహెచ్‌డీ రామకృష్ణ, ఎం. రవిప్రకాశ్‌తో కూడిన బృందాన్ని రంగంలోకి దించింది.

అణువణువూ క్షుణ్ణంగా పరిశీలన

స్థానిక ఐజీ అశోక్‌కుమార్‌కు సీఐడీ, ఏసీబీలో పనిచేసిన అనుభవం ఉంది. ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ చదివిన పీహెచ్‌డీ రామకృష్ణ.. టెక్నాలజీలో దిట్ట. మరో ఐజీ రవిప్రకాశ్‌తో కూడిన బృందం అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేసి నిజానిజాలు నిగ్గు తేలుస్తోంది. దేశంలోనే ప్రతిష్ఠాత్మక టెక్నికల్ సంస్థ సెర్ట్ (కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్) డైరెక్టర్ సంజయ్ బాహ్లీ నేరుగా రంగంలోకి దిగారు. పుణెలోని సీ-డాక్ నుంచి నిపుణుల బృందం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీకి చేరుకుని విద్యార్థి సంఘాల నేతలు, కళాశాల సిబ్బంది సమక్షంలో హాస్టల్ స్నానాల గదుల్లోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పరికరాలన్నీ ఎలక్ట్రానిక్ డిటెక్టర్లతో పరిశీలించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు విద్యార్థుల సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతోపాటు మరో ఇద్దరు అబ్బాయిల వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటితోపాటు హాస్టల్‌లోని వై-ఫై రూటర్లను సెర్ట్ విశ్లేషణ చేస్తోంది. ఎక్కడ రహస్య కెమెరా పెట్టినా వై-ఫై ద్వారా నెట్‌వాడి వాటిని బయటికి ట్రాన్స్‌మిట్ చేయాలి. ఒకవేళ మొబైల్ ఫోన్ల హాట్‌స్పాట్ తీసుకున్నా ఎవరెవరు హాట్‌స్పాట్ ఎవరికి ఇచ్చారనేది కూడా తేల్చేపనిలో సెర్ట్, సీ-డాక్ బృందం నిమగ్నమైంది. కాగా, ఇప్పటి వరకూ జరిగిన ప్రచారంలో నిజాల్లేవని నిపుణులు, పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. కేవలం నలుగురు విద్యార్థుల వివాదమే ఇంతటి వివాదానికి కారణంగా పోలీసు ఉన్నతాధికారులు పసిగట్టినట్లు సమాచారం.

ఆ విషయం బయటకు రాకూడదనే..

ప్రేమ పేరుతో అమ్మాయిలను వలలో వేసుకునే విజయ్ అనే విద్యార్థికి అదే కళాశాలలో మరో విద్యార్థినితో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. న్యూడ్ వీడియో కాల్స్ చేసుకోవడం వారికి రోజూ అలవాటే. అయితే ప్రియురాలికి తెలీకుండా విజయ్ వాటిని రికార్డు చేస్తుండేవాడు. విజయ్ స్నేహితుడు ఒకరోజు ఫోన్ చూస్తుండగా అందులో అమ్మాయిల నగ్న వీడియోలు కనిపించాయి. వెంటనే విజయ్ ప్రేమికురాలి మరో స్నేహితుడికి ఈ విషయాన్ని చేరవేశాడు. ఆమెను ఏకపక్షంగా ప్రేమిస్తున్న ఆ విద్యార్థి ఇదేమిటని ప్రశ్నించడంతో ఆమె విజయ్‌ని నిలదీసింది. తన స్నేహితుడే దీనికి కారణమని తెలుసుకున్న విజయ్ ఏరేయ్.. నీ ఇంటికి వచ్చినప్పుడు నీ చెల్లిని లైన్లో పెట్టా.. ఆమె వీడియోలు కూడా ఉన్నాయి. కాలేజీలో అందరికీ పంపుతా అని బెదిరించాడు. దీంతో విజయ్ స్నేహితుడు వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రిన్సిపాల్ పిలిచి విచారించగా ఏడెనిమిది ఫొటోలు బయటికి వచ్చాయి. అందరినీ హెచ్చరించి వివాదాన్ని మూసేశారు. ఇటీవల అదే యువతితో విజయ్ ఉన్న మరో వీడియో వెలుగులోకి రావడంతో ఆమె స్నేహితురాళ్లు ఇదేమిటని అడిగారు. అసలు విషయం చెప్పడం ఇష్టం లేని విజయ్ ప్రియురాలు.. ఎనావే కాదు.. మీవి కూడా ఉన్నాయ్.. మీ వాష్ రూమ్‌ల్లో నేనే స్పై కెమెరాలు పెట్టి రికార్డు చేశా' అని బదులిచ్చింది. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ హాస్టల్ విద్యార్థినిలు ఒకరికొకరు ఆరా తీసే క్రమంలో విషయం కళాశాల బయటికి వచ్చింది. దీనిపై దర్యాప్తు మొదలుపెట్టిన ఐజీలు.. ఎవ్వరిని అడిగినా వీడియోల్లేవని చెప్పారు. రహస్య కెమెరాల ప్రచారం ఎలా వ్యాప్తి చెందిందని ఆరా తీయగా.. విజయ్ ప్రియురాలే చెప్పిందని బదులిచ్చారు. ఆమెను ప్రశ్నించగా 'విజయ్‌తో కలిసి ఉన్న నా వీడియో గురించి అందరూ అడగడంతో మీవి కూడా ఉన్నాయని బెదిరిస్తే.. వారు ఎక్కడా బయటకు చెప్పరనే ఉద్దేశంతోనే అలా చెప్పాను' అని బదులిచ్చింది. మొత్తం విచారణ తర్వాత కళాశాలలోని వై-ఫై రూటర్లన్నీ సెర్ట్, సీ-డాక్ నిపుణుల బృందంతో విశ్లేషణ చేయిస్తున్నారు. అందులోనూ ఎలాంటి ఆధారాలు లభించలేదని సమాచారం. పోలీసు శాఖ మరో రెండు మూడు రోజుల్లో మొత్తం నివేదిక ప్రభుత్వానికి అందించే అవకాశం ఉంది.

ఓబుళాపురంలో తవ్వకాలకు.. గత ప్రభుత్వ అనుమతులపై అధ్యయనం చేయాలి

- సుప్రీంకోర్టుకు ఏపీ సర్కారు వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురంలో తవ్వకాలకు సంబంధించి గత ప్రభుత్వం ఇచ్చిన మైనింగ్ అనుమతులపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టుకు ఆంధ్ర ప్రభుత్వం నివేదించింది. మైనింగ్‌కు అనుకూలంగా అమికస్ క్యూరీ ఇచ్చిన నివేదిక, గత ప్రభుత్వ అఫిడవిట్లపైనా సమీక్షించాల్సి ఉందని తెలిపింది. ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ)తోపాటు మరికొన్ని కంపెనీలు అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు జరుపుతున్నాయని ఆరోపిస్తూ.. కర్ణాటక, ఏపీ సరిహద్దులు తేల్చాలంటూ ఏపీ ప్రభుత్వం 2010లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం విచారించింది. సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీకి మైనింగ్‌కు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్లు దాఖలు చేసిందని మైనింగ్ కంపెనీల తరఫు న్యాయవాదులు గుర్తు చేశారు. దీనిపై ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం తెలిపారు. అమికస్ క్యూరీ, గత ప్రభుత్వ అఫిడవిట్లపై సమీక్షించాల్సిన అవసరం ఉందని.. అధ్యయనం తర్వాత మళ్లీ సమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేస్తామని.. దీనికి కొంత సమయం కావాలని కోరారు. తమకూ కొంత సమయం కావాలని కేంద్రం తరఫు న్యాయవాదులు కోరారు. అన్ని పక్షాల వాదనల తర్వాత కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది. అమికస్ క్యూరీ నివేదికపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాగా, సిద్దాపురం, ఓబుళాపురాల్లోని బళ్లారి రిజర్వు ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ 2010లో ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. 2022లో మైనింగ్ పునరుద్ధరణకు జగన్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. అయితే ఈ నిర్ణయాన్ని ప్రస్తుత చంద్రబాబు సర్కారు వ్యతిరేకించింది. అందుకే.. ఆ నివేదికను సమీక్షించాలని భావిస్తున్నామని సుప్రీంకోర్టుకు తెలిపింది.

పాడేరు మెడికల్ కాలేజీ అడ్మిషన్లకు గ్రీన్‌సిగ్నల్

- 50 సీట్లతో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు
- సీఎం చంద్రబాబు చొరవతో ఎన్ఎంసీ అనుమతి

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని మెడికల్ కళాశాలలో ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ ప్రవేశాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాస్తవానికి రాష్ట్రంలో పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెలోని మెడికల్ కళాశాలలు పూర్తిస్థాయిలో సిద్ధం కాకపోవడంతో.. ఈ ఏడాది (2024-25) తరగతుల నిర్వహణకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో పాడేరు మెడికల్ కాలేజీలో ఈ ఏడాది అడ్మిషన్లకు ఎన్ఎంసీ అనుమతించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి మెయిల్ ద్వారా (ఎల్‌ఓపీ) అనుమతి లేఖను పంపింది.

గిరిజన ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధతో..

గిరిజన ప్రాంతమైన పాడేరులో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా స్థానిక మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత ఈ ప్రాంతంలో వైద్యపరంగా గిరిజనుల అవసరాలు, సమస్యలు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. దీన్ని సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఎన్ఎంసీకి సమర్పించారు. తరగతుల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పాడేరు మెడికల్ కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్లతో ఈ ఏడాదే తరగతులను ప్రారంభించేందుకు ఎన్ఎంసీ అనుమతి ఇచ్చింది.

జిందాల్ కోసం జగనన్న

జెత్వానీ కట్టడికి మాస్టర్ ప్లాన్: షర్మిల



కడప కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 3: సినీనటి కాదంబరి జెత్వానీని కట్టడి చేసేందుకు ఐపీఎస్ అధికారులను రంగంలోకి దించడం దారుణమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌ను సజ్జన్ జిందాల్ పదేపదే కలుసుకోవడం చూసి స్టీల్ ఫ్యాక్టరీ పనులు వేగవంతం చేస్తున్నారని అనుకున్నామని, కానీ కేవలం కాదంబరి అనే మహిళను కట్టడి చేసేందుకు స్కీమ్‌లు వేశారని పేర్కొన్నారు. ఇది మామూలు మాస్టర్ ప్లాన్ కాదన్నారు. ఆడదాన్ని ఒక్కదాన్ని చేసి తొక్కాలని చూశారని, జే అండ్ జే ఇద్దరూ బుర్రలు పెట్టారని, జే స్క్వేర్‌లు కలసి కార్యాచరణ రూపొందించారని ఆరోపించారు. మీ బుర్రలు జెత్వానీపై కాకుండా స్టీల్‌ప్లాంట్‌పై పెట్టి ఉంటే అది ఏనాడో కార్యరూపం దాల్చేదని తెలిపారు. జిందాల్ కోసం జగన్ ఇంత దిగజారడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని, తనకు కూడా ఇద్దరు కుమార్తెలు ఉన్నారనే విషయాన్ని ఆయన మరిచారా అని షర్మిల ప్రశ్నించారు. ఆమెకు అండగా ఉండి పోరాడటానికి తాను సిద్ధమని ప్రకటించారు. కాగా, కడప స్టీల్ ప్లాంట్‌ను టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగా మార్చారని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. వైఎస్సార్ తలపెట్టిన ఫ్యాక్టరీగా భావించి మోకాలడ్డిందని ఆరోపించారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా నాలుగేళ్ల పాలన తర్వాత చివరి ఆరు నెలల ముందు కడప స్టీల్ ఫ్యాక్టరీకి చంద్రబాబు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ఎన్నికలకు 6నెలల ముందు టెంకాయ కొడితే ఒట్టి బూటకమని, అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లకే టెంకాయ కొడితే చిత్తశుద్ధి అని పెద్దపెద్ద మాటలు మాట్లాడారని, ఇదే ఫ్యాక్టరీకి జగన్ మూడోసారి శంకుస్థాపన చేయడం విచిత్రంగా ఉందన్నారు. ఎన్నికలకు ఏడాది ముందు నాలుగోసారి 2023లో కూడా శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. జగన్ నాలుగోసారి వేసిన శిలాఫలకం దిష్టిబొమ్మలా ఉందని, దీనిని టెంకాయలు కొట్టే ప్రాజెక్టుగా మార్చారని షర్మిల ఎద్దేవా చేశారు. కాగా, గుడ్లవల్లేరు కళాశాలలో హిడెన్ కెమెరాల వ్యవహారమంతా ఫేక్ ప్రచారం అని, 300 వీడియోలు ఉంటే ఒక్కటి కూడా బయట పడలేదని తెలిపారు. అంతకుముందు ఆమె కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్ నిర్వాహకుల అరెస్ట్

నూజివీడు, సెప్టెంబరు 3: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్ నిర్వాహకులను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి మంగళవారం మాట్లాడుతూ కొద్ది రోజులుగా ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల అస్వస్థతకు ఫైన్ క్యాటర్స్, అనూష క్యాటర్స్‌కు చెందిన మెస్‌ల్లో నిల్వ ఉన్న, నాసిరకపు ఆహార పదార్థాలను అందించడం, పారిశుధ్య లేమి ప్రధాన కారణాలుగా గుర్తించామని తెలిపారు. అనూష క్యాటర్స్ నిర్వాహకులు పి.వెంకటనారాయణ, ఫైన్ క్యాటర్స్ నిర్వాహకులు ఎ.ఎ.ఘోష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్



తిరుమల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ. శ్రీనివాస్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలోకి వెళ్లిన ఆయన అర్చన, అష్టదళపాదపద్మారధన సేవల్లో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

అదనపు సీట్లున్న కాలేజీల్లోనే 'ఈడబ్ల్యూఎస్'

- హైకోర్టుకు ఎన్టీఆర్ వర్సిటీ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నుంచి అదనపు సీట్లు పొందిన కాలేజీలలో మాత్రమే ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు నిర్దేశించిన రిజర్వేషన్ల(ఈడబ్ల్యూఎస్)ను అమలు చేస్తామని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు వర్సిటీ అధికారులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. అదనపు సీట్లు పొందిన కాలేజీల్లోనే కోటా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... జీవో 94ను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. తద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపింది. తదుపరి విచారణను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మూడు వారాలకు వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ మణిపూర్ హింస

మణిపూర్‌లో హింస పూర్తిగా తగ్గిపోయిందనీ, ఆర్నెల్లలో రాష్ట్రం ప్రశాంతతని చవిచూడబోతున్నదని ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇందుకు పూర్తిభిన్నంగా మొన్న ఆది, సోమవారాల్లో వరుసగా రెండురోజులపాటు డ్రోన్‌లద్వారా గ్రామాలపై బాంబులు కురిసి, పలువురు మరణించిన ఘటన ఆ రాష్ట్రంలో తెగలమధ్య వైరం ఏమాత్రం చల్లారలేదని, నివురుగప్పిన నిప్పులాగా ఉందని నిరూపించింది. అన్ని నెలల తీవ్రహింసాగ్నిలో కూడా మణిపూర్ ఎన్నడూ ఆకాశంనుంచి బాంబులు పడటం ఎరగదు. ఇప్పుడు కుకీ మిలిటెంట్లు ముందు డ్రోన్ల ద్వారా మీతీ గ్రామాలమీద బాంబులు వేశారు, ఆ తరువాత కొందరు రైఫిళ్ళతో చొరబడి కాల్పులు జరిపారు. మర్నాడు కూడా ఇదే రకమైన రీతిలో దాడి జరిగింది. మూడునెలలుగా ఘర్షణలు కాస్తంత తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ ఘటనలు రాష్ట్రంలో తిరిగి నిప్పురాజేయవచ్చునని భావిస్తున్నారు.

కుకీమిలిటెంట్లు మీతీ గ్రామాలమీద దాడిచేసిన ఈ ఘటనకు ముందు, శనివారం రోజున అక్కడ కుకీ–జో తెగకు చెందిన వందలాది మంది ర్యాలీ నిర్వహించారు. తమకు వేరుగా ప్రత్యేకపాలనావ్యవస్థ ఉండాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ కార్యక్రమం జరిగింది. ఈ తెగవారు ఎప్పటినుంచో ఈ డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఈ ర్యాలీకి ప్రధానకారణం బీరేన్‌సింగ్ చేసినట్టుగా ప్రచారంలో ఉన్న కొన్ని వ్యాఖ్యలు. మీతీతెగకు చెందిన ఆయన స్వజాతి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనీ, మీతీలకు కూడా ఎస్టీ రిజర్వేషన్ ఇప్పించడానికి ఆయన కుట్రపన్నారని, తమ ఉద్యోగాలు, భూములను మీతీలు వశం చేసుకోవడం, తమను కొండలనుంచి తరిమికొట్టడం వారి ఎజెండాలో ఉన్నదని మిగతా ఆదివాసులు అనుమానించిన విషయం తెలిసిందే. అప్పటికే బీరేన్‌సింగ్ తీసుకున్న కొన్ని కుకీ–జో వ్యతిరేక చర్యలకు తోడుగా, మీతీలకు రిజర్వేషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో గత ఏడాది మేనెలలో మీతీ–కుకీల మధ్య తీవ్రమైన హింస రేగి నెలలబాటు రాష్ట్రం అగ్నిగుండమైంది. ఈ పరిణామాలన్నింటికీ సంబంధించి, ముఖ్యంగా తెగలమధ్య వైరాన్ని, హింసను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రోత్సహించడంలోనూ బీరేన్‌సింగ్ ప్రమేయం ఉన్నట్టుగా ఇటీవల లీకైన కొన్ని ఆడియో టేపుల్లో బయటపడింది. ఇందులో స్వయంగా బీరేన్ చేశారంటున్నట్టుగా చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇవి నకిలీటేపులనీ, కొందరు ద్రోహుల, కుట్రదారుల సృష్టి అనీ ప్రభుత్వమూ అధికారపక్షమూ స్పష్టంచేస్తున్నప్పటికీ కుకీ–జో తెగలు మాత్రం తాము ఇంతకాలంగా నమ్ముతున్నదీ, అంటున్నదే ఈ టేపుల్లో ఉన్నదని, అవే నిజాలని వాదిస్తున్నాయి.

ఈ టేపుల ఉదంతంతో బీరేన్‌సింగ్‌ను తప్పించాలన్న డిమాండ్‌కు మళ్ళీ ఊపువచ్చింది. 'నిజం వెలుగుచూసింది, బీరేన్‌ను ప్రాసిక్యూట్ చేయండి' అంటూ కుకీ–జో తెగలకు చెందిన అన్ని సంఘాలూ సంయుక్తంగా శనివారం పెద్ద ర్యాలీ నిర్వహించాయి. బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కుకీ–జోలకు వ్యతిరేకంగా జాతిహననానికి పాల్పడుతున్న నగ్నసత్యం బయటపడిందని నినదాలు చేస్తూ, స్వయంపాలన, బీరేన్ రాజీనామా వీరు ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలను భగ్నంచేసేందుకూ, బలహీనపరచేందుకు ప్రభుత్వం తనవంతు ప్రయత్నాలు చేసింది. మరోపక్క మీతీ సంఘాలు కూడా తమకు ఎస్టీ హోదా ఇవ్వాలనీ, కుకీ–జోలకు దానిని తొలగించాలని డిమాండ్ చేస్తూ అదే రోజున ప్రదర్శనలు నిర్వహించాయి.

నకిలీ టేపులనీ, ఒడ్డునపడుతున్న రాష్ట్రంలో తిరిగి మంటలు రేపేందుకు కొందరు కుట్రచేశారనీ బీరేన్‌సింగ్ ప్రభుత్వం గట్టిగా వాదిస్తూ, మరోపక్క విచారణకు ఆదేశించడంతో నివేదికలో ఏమివుంటుందో చాలా మందికి అర్థమైపోతోంది. ఇక, ఆర్నెల్లలో రాష్ట్రంలో ప్రశాంతత నెలకొంటుందన్న బీరేన్‌వ్యాఖ్యలు కూడా, ఆయన తమకు వ్యతిరేకంగా మళ్ళీ ఏదో చేయబోతున్నారని కుకీజో తెగల్లో అనుమానాలు పెంచిందట. మీతీల అధిపత్యం, వారి ప్రాబల్యం ఉన్న ప్రాంతాలు మినహా మిగతా ఆదివాసీ తెగలున్న ప్రాంతాలకు స్వయంపాలన కావాలన్న డిమాండ్ నెరవేరనంత వరకూ మణిపూర్‌లో శాంతి ఏర్పడదని కుకీజోల వాదన. అనేకనెలలుగా సాగిన హింస కారణంగా ఇప్పటికే వారంతా ఇంఫాల్ లోయనుంచి వెళ్ళిపోయి మీతీలకు దూరంగా బతుకుతున్నారు. స్వయంపాలన హామీ నెరవేరనంతకాలం రాష్ట్రంలో శాంతి ఏర్పడదనీ, హింస రేగుతూనే ఉంటుందని మీతీ గ్రామాల్లో కాల్పులు, వరుస డ్రోన్‌దాడులు హెచ్చరిస్తున్నాయి.

బీసీసీఐలో అనేక విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన జయ్‌షా ప్రతిష్ఠాత్మక ఐసీసీ చైర్మన్ పదవిని చేపడుతున్న అతిపిన్న వయస్కుడు. అహ్మదాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘం నుంచి మొదలైన జయ్‌షా ప్రస్థానం అనతి కాలంలో దుబాయిలోని అంతర్జాతీయ క్రికెట్ మండలి వరకు జయప్రదంగా సాగింది. పదిహేను సంవత్సరాల వ్యవధిలో క్రికెట్ పాలనా రంగంలో అత్యున్నత శిఖరానికి చేరుకోవడం సాధారణ విషయమేమీ కాదు.

జయ్‌షా జయకేతనం

రాజకీయవేత్తల ప్రమేయం లేని జీవన రంగం ఏదైనా ఉన్నదా? ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా భారత దేశంలో క్రీడారంగం క్రమేణా రాజకీయమయమవుతోంది. చదరంగం మొదలు క్రికెట్ వరకు ప్రతి క్రీడా సంఘంలో రాజకీయ పార్టీల నాయకులు లేదా వారి అస్మదీయులు చొరబడుతుండగా అసలైన క్రీడాకారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు.

భారతవనిలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దండిగా నిధులు, ఎనలేని కీర్తిప్రతిష్ఠలు సమకూర్చే క్రికెట్ జగత్తును నియంత్రించే క్రికెట్ సంఘాలలో పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా రాజకీయ నాయకులు దొడ్డిదారిన చొరబడుతున్నారు. అందులో వారిలో అతికొందరు మాత్రమే రాణిస్తున్నారు.

భారత క్రికెట్ రంగాన్ని ప్రభావితం చేసే దిశగా, బీజేపీ అగ్ర నాయకుడు అమిత్ షా వారసుడుగా, ఆటల రాజకీయంలో అరంగ్రేటం చేసిన జయ్‌షా నిస్సందేహంగా అజేయుడు. అవును మరి ఆయన అమిత్ షా తనయుడు. రాజకీయ ఉద్దండులు శరద్ పవార్, ఫారూఖ్ అబ్దుల్లా, లాలూప్రసాద్ యాదవ్, నరేంద్ర మోదీ ఒక దశలో క్రికెట్ సంఘాలను ఏలారు. మోదీ అనంతరం గుజరాత్ క్రికెట్ సంఘం వ్యవహారాలలోకి అమిత్ షా ప్రవేశించారు. ఆయన స్వయంగా క్రికెటర్. గొప్ప ఆటగాడు కాకపోవచ్చు గానీ ఆ ఆటలో మంచి అభినివేశం ఉన్నవాడు. ఇటువంటి వ్యక్తి ఒక రాష్ట్రస్థాయి క్రికెట్ సంఘంలో ప్రాబల్యం పొందడం ఏ మాత్రం తప్పు కాదు. కుటుంబ బరువు బాధ్యతలు లేని నరేంద్ర మోదీ మినహా ముగ్గురు రాజకీయ నేతలు –పవార్, అబ్దుల్లా, యాదవ్– తమ రాజకీయ వారసత్వాన్ని స్వీయ సంతానానికి అప్పగించారు. అమిత్ షా మాత్రం రాజకీయంగా ఉన్నతి సాధిస్తూ తాను ఏలిన గుజరాత్ క్రికెట్ సంఘాన్ని స్వీయ, ఏకైక పుత్రరత్నం జయ్‌షాకు అప్పగించారు.

గల్ఫ్ లేఖ

అహ్మదాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘం నుంచి మొదలైన జయ్‌షా ప్రస్థానం అనతి కాలంలో దుబాయిలోని అంతర్జాతీయ క్రికెట్ మండలి వరకు నిర్విరామంగా జయకేతనం ఎగురవేస్తూ కొనసాగుతోంది. పదిహేను సంవత్సరాల వ్యవధిలో క్రికెట్ పాలనా రంగంలో అత్యున్నత శిఖరానికి చేరుకోవడం సాధారణ విషయమా? కాదు కదా. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం జయ్‌షా కూడ గుజరాత్ నుంచి ఏకంగా జాతీయ స్థాయి క్రికెట్ రంగాన్ని నియంత్రించే బీసీసీఐకు చేరుకోవడం యాదృచ్ఛికం కానేకాదు. బీసీసీఐలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత జయ్‌షాదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రత్యేకించి మహిళా క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఆయన చేసిన కృషికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందాయి. అదే విధంగా, ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను కూడా చేర్చే దిశగా జయ్‌షా చేస్తోన్న కృషికి సైతం అంతర్జాతీయంగా అభినందనలు దక్కుతున్నాయి.



ఈ సందర్భంగా జయ్‌షా పెద్దరికం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించవలసివుంది. 2022లో దుబాయిలో జరిగిన ఆసియా కప్ పోటీలలో భారత్, పాకిస్తాన్ జట్లు పోటీపడ్డాయి. దుబాయిలోని క్రికెట్ అభిమాని ఒకరు భారతీయ త్రివర్ణ పతాకాన్ని జయ్‌షాకు అందించగా దాన్ని స్వీకరించేందుకు ఆయన నిరాకరించారు. దీనిపై దుమారం చెలరేగింది. అయితే ఆసియా ఖండంలో క్రికెట్ ఆటకు పెద్ద దిక్కుగా ఉన్న జయ్‌షా ఏ దేశం వైపూ మొగ్గు చూపకుండా విజ్ఞతతో వ్యవహరించారు. సంకుచిత అభిమానాలకు పోకుండా నిష్పాక్షికంగా ప్రవర్తించడం ఆయన గౌరవాన్ని మరింత ఇనుమడింపచేసింది.

పారిశ్రామికవేత్త జగ్‌మోహన్ దాల్మియా, తలపండిన రాజకీయ యోధుడు శరద్ పవార్ గతంలో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (అంతర్జాతీయ క్రికెట్ మండలి– ఐసీసీ)ను ఏలారు. పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండవపర్యాయం పదవీ ప్రమాణం చేసిన సమయంలో జన్మించిన జయ్‌షా పిన్న వయస్సులో ఐసీసీ పగ్గాలు చేపట్టనున్నారు. ఐసిసి పాలకమండలిలో కీలక సభ్య దేశమైన పాకిస్థాన్ లాంఛనంగా భారత అభ్యర్థిత్వాన్ని సమర్థించలేదు కానీ లోపాయికారీగా తన అంగీకారాన్ని తెలిపింది.

సుమారు 20 వేల కోట్ల రూపాయల వార్షిక ఆదాయం ఉన్న బీసీసీఐలో జయ్‌షాది తిరుగులేని ఏకచక్రాధిపత్యం. దీంతో పోల్చితే 16 సభ్య దేశాల పాలకవర్గం కలిగిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లో పేరు ప్రతిష్ఠలు మినహా ఇతర క్రియాశీలక కార్యకలాపాలు అంతగా ఉండవు. దౌత్య నియమాలు, దేశాల మధ్య ద్వైపాక్షిక రాజకీయ సంబంధాలు, ఉద్రిక్తతల మధ్య ఐసీసీ నడుచుకోవల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ క్రీడను ప్రోత్సహిస్తూ పోటీలను నిర్వహించడం, సభ్య దేశాల మధ్య సమన్వయం చేయడం ఐసీసీ విధి.

ప్రపంచానికి క్రికెట్‌ను పరిచయం చేసిన ఇంగ్లాండ్‌లో ఉన్న ఐసీసీ కార్యాలయం పన్నుల మోత కారణాన ఆ దేశం నుంచి నిష్క్రమించింది. స్విట్జర్లాండ్, సింగపూర్, దుబాయిలు ఆ కార్యాలయాన్ని తరలించుకు వెళ్లేందుకు ప్రయత్నించాయి. అయితే భారత్, పాకిస్తాన్‌లు అభ్యంతరం తెలిపాయి. భారత ఉపఖండ సామీప్యత, పన్నుల బెడద లేకపోవడం వల్ల అంతర్జాతీయ క్రికెట్ మండలి 2005లో దుబాయికి తరలింది. అప్పట్లో తన రాజకీయ, అధికారిక కార్యక్రమాలలో తలమునకలుగా ఉన్న శరద్ పవార్ తాను తీరికగా వచ్చి వెళ్ళడానికి దుబాయి వైపు మొగ్గారని చెబుతారు. బంగారు బాతు అయిన బీసీసీఐ కార్యవర్గం కొనసాగింపు వ్యవధిపై ఆంక్షలు ఉన్నందువల్ల జయ్‌షా కొంతకాలం దుబాయిలోని ఐసీసీలో సేద తీరుతారని క్రికెట్ ప్రపంచం భావిస్తోంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కుల వాస్తవికతపై 'సంఘ్' కర్తవ్యబోధ



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించడంలో తమకు అభ్యంతరం లేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కేరళలోని పాలక్కాడ్‌లో జరిగిన జాతీయ సదస్సులో ప్రకటించడంతో ఈ అంశంపై భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ దృక్పథాలకు మధ్య వైరుధ్యం ఉన్నదా? లేక బీజేపీకి ఆ సంస్థ కర్తవ్యబోధ చేస్తున్నదా? అన్న ప్రశ్నలకు దారితీస్తోంది. మూడురోజుల పాటు జరిగిన ఈ సమావేశానికి 32 సంఘ్ అనుబంధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో వీహెచ్‌పీ, బీఎంఎస్ నేతలతో పాటు బీజేపీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా కూడా ఉన్నారు. ఇలాంటి ఆర్ఎస్ఎస్ విస్తృత సమావేశాలు జరిగినప్పుడు కాని మనకు సంఘ్ పరివార్‌లో బీజేపీ స్థానం అర్థం కాదు.

కులజనగణనపై ఆర్ఎస్ఎస్ వైఖరి స్పష్టం కావడంతో భారతీయ జనతా పార్టీ ఏ వైఖరి అవలంబిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. బహుశా గత మూడేళ్లుగా మోదీ ప్రభుత్వం వాయిదా వేస్తున్న జన గణన ఇక ఇప్పటినుంచైనా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ చరిత్రలో జనాభా లెక్కల సేకరణ జరగకుండా నిరవధికంగా వాయిదా వేయడం ఇప్పటి వరకూ ఎన్నడూ జరగలేదు. 2011 తర్వాత ఈ దేశంలో జనాభా ఎంత పెరిగిందీ ఎవరికీ తెలియదు. గత ఏడాదే మనం చైనా జనాభాను అధిగమించామని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది కాని అందుకు నిర్దిష్టమైన ఆధారాలు లేవు. దేశంలో జనాభా లెక్కలు తెలిస్తే కాని అందుకు అవసరమైన ఆర్థిక సూచికలను మనం అంచనా వేయలేము. ఇప్పటి వరకూ మన దేశంలో నిరుద్యోగుల సంఖ్య ఎంత ఉన్నదో కూడా మనకు తెలియదు. నిరుద్యోగుల సంఖ్య కేవలం 3.1 శాతం ఉన్నదని, రోజురోజుకూ వారి సంఖ్య పడిపోతోందని ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటిస్తే, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ లెక్కల ప్రకారం దేశంలో నిరుద్యోగం 9.2 శాతం ఉన్నదని తేలింది. జనాభా లెక్కలను పూర్తిగా సేకరిస్తే గాని నిరుద్యోగ భీకర స్వరూపం మనకు అర్థం కాదు.

అంతేకాదు, జనాభా లెక్కల సేకరణ జరిగితే దేశంలో పేదరికం, ద్రవ్యోల్బణం ప్రభుత్వ కార్యక్రమాలు, నిరక్షరాస్యత, ప్రజల ఆర్థిక అసమానతలు, స్త్రీ పురుషులు తదితరుల వారీగా జనాభా తీరుతెన్నులు, వలస కార్మికులు, అసమానతలు మొదలైన అనేక అంశాల స్థితిగతులు మనకు తెలుస్తాయి. దేశంలో 81.35 కోట్ల మందికి ఆహార ధాన్యాలను ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద ఉచితంగా పంపిణీ చేయవలసిన స్థితిలో ఉన్నట్లు ప్రభుత్వమే గుర్తించింది. జనాభా లెక్కల సేకరణ పూర్తయితే ఇంకా ఎంతమందికి ఉచిత ఆహార ధాన్యాలు పంపిణీ చేయాలో తెలుస్తుంది. నిజానికి ఈ దేశంలో మరో పది కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలను పంపిణీ చేయాల్సిన అవసరం ఉన్నదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. జనాభా లెక్కలు సరిగా లేనందువల్ల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఉపాధి కల్పించాల్సిన వారి సంఖ్యను, కేటాయించాల్సిన నిధుల మొత్తాన్ని కేంద్రం అంచనా వేయలేకపోతోంది. ఉపాధి కల్పన విషయంలోనే కాక, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేయాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, వృద్ధాప్య పింఛను తదితర పథకాల లబ్ధిదారుల సంఖ్యను కూడా అంచనా వేసి నిధులు కేటాయించేందుకు వీలు కలుగుతుంది. జనాభా లెక్కల సేకరణ పూర్తయితే పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల పెంపుపై కూడా ఒక నిర్దిష్టమైన స్పష్టత ఏర్పడుతుంది. మతాలవారిగా జనాభా పెరిగిందో లేదో కూడా ఈ లెక్కల ద్వారా తేలి అనేక వ్యాఖ్యానాలకు తెరపడుతుంది.

ఈ క్రమంలో కులాల వారీగా కూడా జనగణన చేస్తే ఏ కులాలు నిర్దిష్టంగా వెనుకబడి ఉన్నాయో తెల్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. బిహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం గత ఏడాది నిర్వహించిన కులజనగణన ప్రకారం బిహార్‌లో 34.13 శాతం ప్రజలు నెలకు రూ. 6000 కన్నా తక్కువ మొత్తంపై ఆధారపడి జీవిస్తున్నారని తేలింది. రాష్ట్ర జనాభాలో కేవలం 1.5 శాతం మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని, దాదాపు 95.49 శాతం మందికి ఎలాంటి వాహనాలు లేవని ఈ లెక్కలు తెలిపాయి. బిహార్‌లో దాదాపు 82 శాతం హిందువులేనని, వారిలో దళితుల సంఖ్య అత్యధికమని తేలింది. 36 శాతం పైగా అత్యంత వెనుకబడిన వర్గాలు బిహార్‌లో ఉన్నారని ఈ లెక్కలు తేల్చాయి. దేశవ్యాప్తంగా కులాలవారీగా జనగణన చేస్తే కులాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు ఎంతమేరకు ఉన్నాయో తేలుతుంది. దీన్నిబట్టి సంక్షేమపథకాలను నిర్దిష్టంగా రూపొందించడం సాధ్యమవుతుంది.

కాని భారతీయ జనతా పార్టీ గత పదేళ్లుగా కులాలవారీగా జనగణనను తీవ్రంగా వ్యతిరేకించింది. సమాజాన్ని కులాలవారీగా చీల్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల ప్రసంగాల్లో ఆరోపించారు. కుల జనగణనను ఆయన ఏనాడూ సమర్థించలేదు. ప్రజలను మతాలవారీగా మాత్రమే కాని కులాల వారీగా చూడదలుచుకోవడం బీజేపీకి ఇష్టం లేదని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో బీజేపీని అగ్రవర్ణాల పార్టీగా చిత్రించేందుకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రయత్నించారు. ప్రభుత్వ అధికారుల్లో అగ్రవర్ణాలవారు ఎక్కువ మంది ఉన్నారని ఎత్తిచూపారు. ఆఖరుకు బడ్జెట్ రూపొందించిన అధికారులు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఫోటో దిగినప్పుడు అందులో వెనుకబడినవారు లేరని ఎద్దేవా చేశారు. రాహుల్ విమర్శల వల్లే సివిల్ సర్వీస్ నుంచి కాకుండా బయటి నుంచి అనేకమందిని నియమించాలన్న నిర్ణయాన్ని మోదీ సర్కార్ వెనక్కు తీసుకుంది. కులజనగణన గురించి మాట్లాడినందుకు పార్లమెంట్‌లో రాహుల్, ఇతర నేతలపై అనురాగ్ ఠాకూర్ వంటి నేతలు దాడి చేశారు. 'అసలు నీ కులమేమిటి?' అని ప్రశ్నించారు. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించేందుకు నాటి ప్రధాని విపి సింగ్ మండల్ కమిషన్ నివేదికను తెరమీదకు తీసుకువచ్చినప్పుడు దాన్ని ఎదుర్కొనేందుకు అద్వానీ రథయాత్ర ప్రారంభించారు. అయితే బీజేపీ ఆ నివేదికను నేరుగా విమర్శించలేదు. 'వెనుకబడిన వర్గాలవారికి కానీ, షెడ్యూల్డు కులాల జాతులకు కానీ రిజర్వేషన్ కల్పించడానికి నేను ఎన్నడూ వ్యతిరేకం కాదు. నిజాయితీ లేకుండా సంకుచిత భావంతో స్వల్పకాల రాజకీయ ప్రయోజనాలకోసమే విపి సింగ్ మండల్ కమిషన్ నివేదికను ఎవరితో చర్చించకుండా తెరమీదికి తీసుకువచ్చారు' అని అద్వానీ తన ఆత్మకథలో రాశారు.



కొన్ని కులాల ప్రజలు తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆర్ఎస్ఎస్ గుర్తించడం సాధారణ విషయం కాదు. సామాజిక సంక్షేమ పథకాలపై డేటా సేకరణకు తమకు అభ్యంతరం లేదు కాని జనగణనను రాజకీయ ఉపకరణంగా వాడుకోకూడదని తాము భావిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి సునీల్ అంబేకర్ తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రభుత్వం వెనుకబడిన అణగారిన వర్గాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కులాలవారీగా లెక్కలు అవసరమని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడింది.

నాడు అద్వానీ వెలిబుచ్చిన అభిప్రాయాన్నే ఇప్పుడు ఆర్ఎస్ఎస్ కూడా వ్యక్తపరిచిందా లేక మారిన పరిస్థితులను గుర్తించిందా? కొన్ని కులాల ప్రజలు తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆర్ఎస్ఎస్ గుర్తించడం సాధారణ విషయం కాదు. సామాజిక సంక్షేమ పథకాలపై డేటా సేకరణకు తమకు అభ్యంతరం లేదు కాని జనగణనను రాజకీయ ఉపకరణంగా వాడుకోకూడదని ఆర్ఎస్ఎస్ భావిస్తున్నట్లు ఆ సంస్థ పబ్లిసిటీ ఇన్‌ఛార్జి సునీల్ అంబేకర్ తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం వెనుకబడిన అణగారిన వర్గాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కులాలవారీగా లెక్కలు అవసరమని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడింది.


ఆర్ఎస్ఎస్ ఇచ్చిన ఈ స్పష్టీకరణ తర్వాత కులజనగణనపై చర్చ చల్లారేందుకు అవకాశం ఏర్పడింది. ఒక రకంగా ఈ సంస్థ బీజేపీని ఇబ్బందుల్లోంచి బయటపడేసేందుకే ఈ ప్రకటన చేసిందేమో అన్న అభిప్రాయం కూడా కలుగుతోంది. కులాల వారిగా ప్రజలను చూడడం ఆ సంస్థకు అంతరాంతరాల్లో ఇష్టం లేదు. అలా చూస్తే హిందూమతం సమైక్యంగా ఉండదేమో అన్న అనుమానాలు కూడా రావడం సహజమే. కాని ఇవాళ దేశంలో కుల జనగణన అంశం తీవ్రంగా తెరమీదకు వచ్చింది. వివిధ రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కులాల వారీగా ప్రజలను సంతృప్తిపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో అస్తిత్వ ఉద్యమాలు కూడా జరుగుతున్నాయి. దేశంలో కులం ఒక వాస్తవమైనప్పుడు దాన్ని చూడడానికి నిరాకరించడం ఒక అమాయకత్వమే. ఏఏ కులాలవారు ఏమి మాట్లాడుతున్నారో, ఎవరి మాటల వెనుక ఏ కులతత్వం దాగి ఉన్నదో ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారు. అసలు ప్రతి అంశాన్నీ కులం ప్రాతిపదికగా అంచనా వేసే మనస్తత్వం కూడా ప్రబలంగా కనిపిస్తోంది. అందువల్ల భారతీయ జనతా పార్టీ ఎంత మత ప్రాతిపదికగా ప్రజలను సమైక్యపరచాలన్నా దానికి కులం ఒక అవరోధంగా మారింది. మత ప్రాతిపదికగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడం సాధ్యం కాదన్న విషయం కూడా అనేక సందర్భాల్లో తేలింది. గత ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని మరింత స్పష్టం చేశాయి. రామమందిరం నిర్మించిన అయోధ్యలోనే ప్రజలు బీజేపీని ఓడించడం, వారణాసిలో కూడా మోదీకి నూటికి నూరు శాతం హిందువులు ఓట్లు వేయకపోవడం గమనార్హం. రోజురోజుకూ ప్రతిపక్షాలు కులజనగణనను ఒక ప్రధానాంశంగా ప్రజల్లోకి ఉధృతంగా తీసుకుపోవడం, మిత్రపక్షాలు కూడా కులజనగణన కావాలని డిమాండ్ చేయడం బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. దీనితో ఆర్ఎస్ఎస్ కర్తవ్యబోధ చేయాల్సి వచ్చింది.

ఈ నేపథ్యంలో కులం అనే వాస్తవికతను ఆర్ఎస్ఎస్ గుర్తించడం సంఘ్ పరివార్ చరిత్రలో ఒక ముఖ్యమైన పరిణామంగా భావించాలి. 'కులం, కుల సంబంధాలు చాలా సున్నితమైనవి. దేశ సమైక్యతకూ, సమగ్రతకూ కులం ఒక ముఖ్యమైన అంశం. ఎన్నికల రాజకీయాలు, పార్టీలకు అతీతంగా దాన్ని తీవ్రంగా పరిగణించాలి' అని సునీల్ అంబేకర్ చాలా కీలకమైన వ్యాఖ్యలు చేశారు. కులాల వారీగా జనాభా లెక్కలను రాజకీయం చేయకూడదని ఆయన హెచ్చరించారు కాని ఇన్నాళ్లూ మతాన్ని రాజకీయం చేస్తూ మనుగడ సాధించిన వారిని ఏమీ అనలేదేం?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆపద్బాంధవుడు చంద్రన్న

ప్రజలు కష్టాల్లో ఉన్నారు అనగానే, మహాకవి పోతన అన్నట్టు సిరికిం చెప్పడు, చేదోయి సంధింపడు... అంటూ ప్రజలను ఆదుకోవడానికి చంద్రబాబు పరుగులు తీస్తారు. మానవ సేవే మాధవ సేవ అనే గొప్ప మాటలు చెప్పకపోయినా, పదేళ్ల క్రితం విశాఖపట్నంను ధ్వంసం చేసిన హుద్ హుద్ తుఫాను సమయంలోనూ, ఇప్పుడు విజయవాడను అతలాకుతలం చేసిన వరదల విపత్కర పరిస్థితులలో బాధితులను ఆదుకోవడానికి ఆయన చేసిన, చేస్తున్న కృషి మానవతా పరిమళాలను వెదజల్లింది.



ప్రజలకు కష్టం, అంటే చంద్రబాబు అక్కడ ఉంటాడు. ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలు కష్టాల్లో వున్నారు అంటే, అక్కడ చంద్రబాబు ఉంటారు. ఆ ప్రజలు మనవాళ్ళే కాకపోవచ్చు, మన రాష్ట్రంలో కాకపోవచ్చు కూడా. మరీ ముఖ్యంగా తెలుగువారు కష్టాల్లో ఉన్నారు అంటే, చంద్రబాబు అక్కడ ప్రత్యక్షమవడం తప్పనిసరి.

ప్రకృతి వైపరీత్యాలు, రాష్ట్రానికి, దేశానికి కొత్త కాదు. తీర ప్రాంతం ఎక్కువగా వున్న ఆంధ్ర రాష్ట్రానికి వరదలు, భారీ వర్షాలు చాలానే వచ్చాయి. అప్పట్లో కూడా ముఖ్యమంత్రులు వారి పార్టీలు వున్నాయి. ఎన్నో ప్రభుత్వాల్లో, హెలీకాప్టర్లలో ఆహార పొట్లాలు జారవేయడం కూడా కొత్తేమీ కాదు. అధికారులకు పురమాయించేవారు. వారు చేసేవారు. అప్పటి ప్రభుత్వాలకు, తెలుగుదేశం ప్రభుత్వానికి, ఒక్కటే తేడా... అదే మానవత్వపు పరిమళం. అధికారంలో ఉన్నా లేకపోయినా, పార్టీ నాయకుడే, తానే స్వయంగా రంగంలోకి దిగి సహాయ పునరావాస కార్యక్రమాలని సంపూర్ణంగా పర్యవేక్షించి అర్హులకు ఆపన్న హస్తం అందించే నాయకుడు ఉండడం. దేశంలో ఎక్కడా ఈ విధమైనటువంటి నాయకుడు కనపడకపోవడం యాదృచ్ఛికం కూడా కాదేమో.

ఇదేదో చంద్రబాబును పొగడాలి అని చెప్తున్నది కాదు. ఎందుకంటే, గొప్పదనం ఒక రోజులోనో, ఒక చర్యతోనో రాదు. మన గురించి పలువురు వ్యక్తులు, పలు సందర్భాల్లో చెప్పుకొంటున్నారు అంటే, దీర్ఘకాలంలో ఆ వ్యక్తి చేసిన కృషే కారణం. మరీ ముఖ్యంగా ప్రజలతో పనిచేసేటప్పుడు ఇది ఇంకా నిజం.

గత మూడు రోజులుగా విజయవాడను అతలాకుతలం చేసిన వరదలను, వాటి వలన వచ్చిన కష్టాలను ఛేదిస్తూ, అందులో చిక్కుకున్న ప్రజలను రక్షిస్తూ, ప్రభుత్వ యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తూ, కేంద్రంతో మాట్లాడుతూ, హర్యానా, లాంటి సుదూర ప్రాంతాల నుంచి ఆర్మీ హెలీకాప్టర్లను రప్పిస్తూ, స్పీడ్ బోట్లను తెప్పిస్తూ, అదే సమయంలో రాష్ట్ర పాలనా యంత్రాంగాన్ని ఆయత్తపరుస్తూ, పార్టీ మంత్రులూ, ఎమ్మెల్యేలను నడిపిస్తూ, పార్టీ కార్యకర్తలను పునరావాస కార్యక్రమాల్లో పాలుపంచుకొమ్మని సన్నద్ధపరుస్తూ, విజయవాడ కలెక్టరేట్‌లో కమాండ్ సెంటర్‌ని ఏర్పరిచి తాను మూడు రోజులుగా అక్కడే ఉంటూ, ఒక మల్టీ టాస్కర్‌గా ఒక ముఖ్యమంత్రి ఎలా పని చేయవచ్చో చంద్రబాబు చూపించారు.

ఇదేదో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నాడు కాబట్టి, అన్నీ చేయగలిగాడు లే అని అనుకొంటే పొరపాటు. 2013లో ఆయన కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రతిపక్ష నాయకుడు మాత్రమే. 2013లో జూన్‌లో చార్‌ధామ్ యాత్రలకెళ్లి వరదల్లో చిక్కుకుని తిండి, నీళ్లు లేక తెలుగు యాత్రికులు అలమటించారు. నాడు చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నా, తన చేతిలో అధికారం లేదు కదా అని ప్రభుత్వాన్ని విమర్శించి కూర్చోలేదు.

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ బాధితుల క్యాంపుకు వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పారు. అప్పటికి తెలుగుదేశం పార్టీ తొమ్మిది ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉంది. పార్టీ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. అయినా చంద్రన్న ప్రత్యేక విమానాల ఖర్చు భరించి 186 మంది తెలుగు యాత్రికులని డెహ్రాడూన్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి తరలించారు. నారా లోకేష్ విమానాశ్రయానికి చేరుకున్న బాధితులకు స్వాగతం పలికి, ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి వారిని గమ్యస్థానాలకు చేర్చారు.

2022 మార్చిలో యుద్ధం వలన ఉక్రెయిన్‌లో 1481 మంది తెలుగు విద్యార్థులు చిక్కుకునిపోయారు. చంద్రన్న ప్రతిపక్షనేతగా జగన్ ప్రభుత్వంపై విమర్శలకు పరిమితంకాలేదు. టీడీపీ NRI విభాగం ద్వారా ఉక్రెయిన్‌లో చిక్కుబడిపోయిన 1481 మంది విద్యార్థుల వివరాలను సేకరించి విదేశాంగమంత్రి జైశంకర్‌కు పంపారు. తెలుగు విద్యార్థులు రాష్ట్రాలకు చేరేవరకు కృషి చేశారు.

2022 జూలైలో గోదావరి వరదల్లో వందకు పైగా లంక గ్రామాలు జలదిగ్బంధానికి గురయ్యాయి. ప్రజలకు తిండిలేదు. తల దాచుకోవడానికి చోటులేదు. మూడు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది ప్రజలు అంధకారంలో బిక్కుబిక్కున బ్రతికారు. అధికారుల జాడలేదు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఏరియల్ సర్వే పేరుతో ఆకాశంలో తిరిగి వెళ్లిపోయారు.

వరద బాధితులకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం రూ. 10 వేలు ఇస్తే జగన్ ఇచ్చింది కేవలం, రూ. 2 వేలు మాత్రమే. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు బాధిత ప్రజల వద్దకెళ్లి ధైర్యం చెప్పారు. చంద్రబాబు పిలుపు మేరకు టీడీపీ నేతలు, కార్యకర్తలు వరద బాధితులకు లక్షల రూపాయల విలువ చేసే ఆహారం, కూరగాయలు, వస్త్రాలు, త్రాగునీరు అందించారు. జగన్ వాలంటీర్లు ఉన్నా గోదావరి వరద బాధితులకు సహాయం అందించలేదు.

2009లో తుంగభద్ర వరదలకు కర్నూలు దెబ్బతిన్నది. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఒక్క రోజులోనే ముప్పైవేల మంది బాధితులకు సాయం అందించారు. నాటి ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయలేదు. నిర్మాణాత్మక సూచనలు చేశారు.

ఇవన్నీ చంద్రబాబు అధికారంలో లేనప్పుడు తీసుకొన్న చర్యలే. ప్రజలు కష్టాల్లో వున్నప్పుడు వాళ్లకు ధైర్యం చెప్పి, వాళ్లకు తోడుగా వుండి, కష్టాల్లో నుంచి బయటకు తీసుకురావడం రాజకీయ నాయకుడిగా తన బాధ్యత అని చంద్రబాబు త్రికరణశుద్ధిగా భావించడమే, ఈ సేవాతత్పరతకు కారణం.

2019 సెప్టెంబర్‌లో గోదావరిలో 5 లక్షల క్యూసెక్కుల వరదపారే సమయంలో వైకాపా నేతల ప్రోద్బలంతో బోటుయాత్రకు జగన్ ప్రభుత్వ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతించారు. వరద ఉధృతికి కచ్చులూరి వద్ద బోటు బోల్తాపడి 39 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయ చర్యలు వారాల తరబడి జాప్యం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ గాల్లో ఏరియల్ సర్వే చేసి వెళ్ళిపోయారు. ఈయన నేడు విజయవాడ వరదలపై చంద్రబాబుపై విషం కక్కుతున్నారు.

2018 అక్టోబర్‌లో తిత్లీ తుఫాను ప్రభావానికి శ్రీకాకుళం జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. చంద్రన్న నిద్రాహారాలు మాని తుఫాను బాధితులకు సహాయమందించేందుకు పనిచేశారు. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగాన్ని కదిలించి బాధితుల్ని శరవేగంగా ఆదుకున్నారు.

2014 అక్టోబర్‌లో సంభవించిన హుద్ హుద్ దెబ్బకు విశాఖ నగరం పూర్తిగా ధ్వంసమైంది. 200 కి.మీ వేగంతో పెనుగాలులు వీచాయి. కరెంట్ లేదు. ఫోన్లు పనిచేయలేదు. ప్రజలు ఇళ్లల్లోనే బందీలయ్యారు. 1904వ సంవత్సరం నుంచి విశాఖ కేంద్రంగా తుఫానులు రాగా, వాటన్నింటిలోకి భయంకరమైనది హుద్ హుద్ తుఫాను. ఈ విపత్తుని జయించటానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు 9 రోజుల పాటు విశాఖలోనే మకాం వేసి సాధారణ పరిస్థితులను పునరుద్ధరించారు. విశాఖను పునర్నిర్మించారు.

2001లో గుజరాత్, మహారాష్ట్ర భూకంప బాధితులకు చంద్రబాబు ఇతోధిక సాయం అందించారు. 1996 తుఫానులో, ఒరిస్సా తుఫాను బాధితుల్ని చీకట్లో నుంచి వెలుగులోకి తేవడానికి చంద్రబాబు ప్రభుత్వం మన విద్యుత్ ఉద్యోగుల్ని పంపి అక్కడి విద్యుత్ వ్యవస్థని పునరుద్ధరించింది.

చంద్రబాబు, జగన్ ఇద్దరూ విజయవాడలోనే ఉన్నారు. వరదల కోర్ ప్రదేశమైన సింగ్ నగర్‌కు ఇద్దరూ కూతవేటు దూరంలో వున్నారు. వరద విషయం తెలియగానే చంద్రబాబు వెంటనే ఆ రాత్రే అక్కడ పర్యటించారు. జగన్ మాత్రం మూడో రోజున అరగంట టూర్ చేసేసి లండన్ వెళ్ళిపోయారు. మీదు మిక్కిలి లక్షల కోట్ల ఆస్తి కలిగిన ప్రతిపక్ష నేత ఒక్క పైసా విదల్చలేదు కూడా. బాధితులకు సహాయం చెయ్యకపోగా కంటి మీద కునుకు లేకుండా బాధితులని ఆదుకొంటున్న చంద్రబాబును విమర్శిస్తూ ఆయన్ను, ఆయన నివాసాన్ని చూపిస్తూ అమరావతిపై జగన్ విషం కక్కుతున్నారు. ఆపన్నులకు ఆచరణాత్మక సహాయం చేయకపోగా విషప్రచారాలు, శవ రాజకీయాల, కుట్రలు చేసే జగన్ తన పద్ధతి మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి మరింత గురికాకతప్పదని గుర్తుంచుకోవాలి.

చంద్రబాబు ఆపద్బాంధవుడు. బాధితుల్ని ఆదుకునేందుకు ఆయనకు వయస్సు అడ్డంకి కాదు. నిద్రాహారాలు లెక్కచేయరు. బాధితుల్ని ఆదుకోవడానికి ఉదారంగా సహాయం చేస్తారు. ప్రభుత్వాధినేతగా ప్రభుత్వనిధులు ఖర్చు చేయడంతో సరిపుచ్చుకోరు. ప్రతిపక్షంలోఉన్నా అదే తీరుతో ఆదుకుంటారు. ఆయనే కాదు ఆయన శ్రీమతి భువనేశ్వరి అధ్వర్యంలో నడుస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్, పలు ప్రకృతి వైపరీత్యాల్లో, గోదావరి వరదల సమయంలోను బాధితులకు సేవలందించింది. మానవ సేవే మాధవ సేవ అనే గొప్ప మాటలు చెప్పకపోయినా, ప్రజలు కష్టాల్లో ఉన్నారు అనగానే, మహాకవి పోతన అన్నట్టు సిరికిం చెప్పడు, చేదోయి సంధింపడు... అంటూ ప్రజలను ఆదుకోవడానికి పరుగెత్తే చంద్రబాబు ఆపద్బాంధవుడే..!

■ గురజాల మాల్యాద్రి
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

కాస్త తెరిపి ఇవ్వు..!

మహా ప్రళయం ముంచుకొచ్చింది
వాగులు వంతలు చెరువులు కుంటలు
జల ఖడ్గాన్ని జనం మెడలపైకి విసిరాయి
బ్రతుకులన్ని జల దిగ్బంధం
కళ్ళు కాయలు కాసినా
ఇల్లు వాకిళ్ళు మిగల్లేదు

గ్రీష్మతాపంలో స్వేదం చిమ్మాక
కొన్ని చిరుజల్లులు కురిస్తే
హరివిల్లులు విరిస్తే...
మది మధురగీతాలు పాడుతుంది
మనసంతా సేద తీరుతుంది.. కానీ
ప్రకృతి ఋతుచక్రం
గిర్రున తిరిగి గిరికీలు కొట్టేస్తే
బ్రతుకంతా చిందర వందర

చినుకు పలకరింతలకు
మనమే కాదు పశుపక్ష్యాదులు పులకరిస్తాయి
వానా వానా వల్లప్పా... అంటూ
చిందులు వేసి సందడి చేస్తయి.. కానీ

మనిషి మనుగడలో
అతివృష్టి అనావృష్టి
ఏదీ సహించదు జనజీవం ఇది నిజం

ఆకస్మిక వరదల హోరు/ మృత్యుగీతాల తీరు
అన్నీ అపశ్రుతులే/ అన్నీ అశ్రు పాదముద్రలే
మట్టి గోడలు కూలుతున్నాయ్
వట్టి మాటలు పేలుతున్నాయి
చేయూత హస్తాలు
ఊపిర్లు ఊదాలి ఉచ్ఛ్వాస నిశ్వాలి

ముంచెత్తుతున్న వరదలు
భీకర బీభత్స విపత్తుల
విచ్చుకత్తుల్ని దించుతోంది
కుండపోత బాధల వలపోత
ఉగ్రరూపం దాల్చిన వరుణుడు
గుండెల్ని చెరువులు చేస్తున్నాడు
కూలిన మేడలు దుఃఖపు వాడలు
అంతా అతలాకుతలం
చినుకు చినుకుగా రాలి ఛిద్రమైతివి
ప్రమాదపు హెచ్చరికవైతివి
పదిలమవ్వుట ఏలనమ్మా

మాకు మేమే బరువవుతున్నం
మాకు మేమే భారమవుతున్నం
తడిసి ముద్దవుతున్న
తనువెల్లా నిలువెల్లా వీడ్కోలు
వినయంగా వేడ్కోలు/ కాస్త తెరిపి ఇవ్వు
తేరుకుంటాం.. తేలిక పడిపోతాం..

– కటుకోఝ్వల రమేష్





వైఎస్సార్ కాలనీలో స్వల్పంగా తగ్గిన ముంపు





ప్రకాశ్‌నగర్ వద్ద వరద ముంపు నుంచి గుంపులుగా బయటకు వస్తున్న బాధితులు (ఇన్‌సెట్‌లో) రాజీవ్‌నగర్ నుంచి పునరావాసం వైపు వస్తున్న బాధితులు

వరదలా కదిలి..

ప్రాణాలకు తెగించి ముంపు నుంచి బయటికొస్తున్న బుడమేరు బాధితులు

- ప్రధాన సెంటర్లలో బాధితులను సహాయ శిబిరాలకు తరలిస్తున్న ప్రభుత్వం
- శివారు ప్రాంతాల నుంచి బాధితులే సాహసించి బయటకు...
- ఇంకా 80 శాతం ప్రాంతంలో వరద
- ఇప్పటి వరకు బయటికొచ్చింది లక్ష ఇరవై వేల మంది బాధితులు
- ఇంకా లక్షన్నర మంది ముంపులోనే
- అంబాపురం, కండ్రిక, ఆంధ్రప్రభ కాలనీలకు మూడో రోజూ ఆహారం అందని దుస్థితి
- కొనసాగుతున్న సహాయ చర్యలు

తినడానికి తిండి లేదు. తాగడానికి నీరు లేదు. ఉండటానికి వసతి లేదు. కదలడానికి వీల్లేదు. ఏం చేయాలో తోచలేదు. ఎలా బతకాలో తెలియలేదు. చేసేదేమీలేక ఇంట్లో ఉన్న బియ్యాన్ని ఉడకబెట్టుకుని నీళ్లు కలుపుకుని దాన్నే ఆహారంగా కడుపు నింపుకుంటూ కొందరు.. ప్రభుత్వం అందించే ఆహార పొట్లాలను అందుకుని ఆకలి తీర్చుకుంటూ మరికొందరు ప్రాణాలు కాపాడుకుంటున్నారు. మూడు రోజులుగా బుడమేరు వరద బాధిత ప్రాంతాలైన వన్‌టౌన్, చిట్టినగర్, సింగ్‌నగర్, భవానీపురం, పాయకాపురం, అంబాపురం, యనమలకుదురు, రామలింగేశ్వరనగర్‌లలోని కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. వారికోసం రెండ్రోజులుగా ప్రభుత్వం భారీస్థాయిలో ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేసింది. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి వరద ప్రాంతాల్లో ఆహారం అందించాయి. అయితే అధికారులు వైఫల్యం మూలంగా బాధితులందరికీ ఆహారం అందలేదు. బాధితులను సహాయక శిబిరాలకు చేర్చడంలోనూ అధికారుల నుంచి ఇదే నిర్లక్ష్యం కనిపించింది. ఇప్పటి వరకు లక్ష ఇరవై వేల మంది బాధితులు ముంపు నుంచి బయటికొచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు సురక్షిత ప్రాంతాలకు చేర్చినా ఇంకా లక్షన్నర మంది బాధితులు ముంపులోనే ఉన్నారు. మరోపక్క, కృష్ణాజిల్లాలో వరద వల్ల 35,313 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. అక్విడెక్ట్ వద్ద వరద కొంత తగ్గడంతో దిగువ ప్రాంతాలు ఊపిరి పీల్చుకున్నాయి. ఇంకోపక్క, అధికారులు మంగళవారం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /వన్‌టౌన్) : బుడమేరు వరద బాధితులు ఇళ్ల నుంచి కదిలారు. సర్వం వదిలి కట్టుబట్టలతో బయటకొచ్చేస్తున్నారు. మూడోరోజు బాధితులు తెగించి వెల్లువలా బయటకొచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకూ వస్తూనే ఉన్నారు. సింగనగర్ ఫ్లై ఓవర్ నుంచి అయోధ్యనగర్ వరకు మూడు కిలోమీటర్ల మేర బుడమేరు బాధితులు వరుసకట్టి ఇళ్ల నుంచి సహాయక శిబిరాలకూ, బంధువుల ఇళ్లకూ పయనమయ్యారు.

- లోపల ప్రాంతాల్లో ఉన్నవారు మూడు రోజులుగా ఆహారం మంచినీరు లేకుండా నీరసించి పోయారు. ఇక లోపల ఉంటే ప్రాణాలకే ప్రమాదమని భావించి ప్రాణాలకు తెగించి సాహసం చేశారు. జిల్లా యంత్రాంగం చేస్తున్న సహాయక చర్యలతో కొంతమంది బయటకు వస్తుండగా.. మరికొందరు వారంతట వారే బయటకు కదిలి వచ్చారు.
- కండ్రిక ప్రాంతంవారు నాలుగు కిలోమీటర్ల మేర వరదలో ఎదురేగుతూ వచ్చారు. రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్‌నగర్ నుంచి 3 కిలోమీటర్లు వరదను ఈదుతూ వచ్చారు.
- అంబాపురం, ఆంధ్రప్రభ కాలనీ వంటి ప్రాంతాల్లో నివశించే వేలాది మంది ఇంకా బయటకు రాలేని స్థాయిలో వరద మట్టం ఉంది. వారికి ఇప్పటికీ ఆహారం, మంచినీళ్లు అందలేదు.
- పడవల మీద వచ్చే వారి సంఖ్య ఐదు శాతం కూడా లేదు. ఇంట్లో సీలింగ్‌కు ఉన్న థర్మాకోల్ షీట్లను పీకి వాటిని కట్టకట్టి పిల్లల్ని వాటి మీద కూర్చోపెట్టి నీటిలో తోసుకుంటూ వచ్చారు. తమ ఇంట్లో లేవలేని వాళ్లను తీసుకు రావటం కోసం ఇంట్లో ఫ్రిజ్ డోర్లను పగులగొట్టి వాటిపై కూర్చోపెట్టి వరదనీటిలో బయటకు తీసుకొచ్చారు.
- వరద నుంచి బయటకు వచ్చిన బాధితులు ఆహారం, మంచినీటి ప్యాకెట్ల కోసం అక్కడ ఉన్న వాహనాల దగ్గర ఎగబడ్డారు. ఆహార వాహనాల దగ్గర తోపులాటలు జరిగాయి. పిల్లలకు పాలు కోసం, మూడు రోజులుగా నీళ్లు లేని వారు మంచినీటి ప్యాకెట్ల కోసం ఎగబడ్డారు.
- సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీద నుంచి రామకృష్ణాపురం బుడమేరు బ్రిడ్జి దాటి అయోధ్యనగర్ కాలనీ వరకు రోడ్ల మీద 3 కిలోమీటర్ల మేర వరద బాధితులు కిక్కిరిసిపోయారు.



భరోసాగా నేనున్నా అంటూ సీఎం అభివాదం



చిట్టినగర్‌లో ట్యూబులపై పిల్లలను తరలిస్తూ..



హెలికాప్టర్ నుంచి వాటర్ బాటిల్స్ విసురుతూ..





డాబాకొట్లు సెంటర్‌లో డ్రోన్‌లతో ఆహారం అందిస్తూ..

బోట్లకు డబ్బులు ఇవ్వాలట

వరద నీరులో ఇబ్బందులు పడుతున్నవారిని సురక్షిత ప్రాంతానికి తరలించటానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోట్ల నిర్వాహకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం అధికారులు, ప్రజప్రతినిధులు వరద ప్రాంతాల్లో పర్యటించడంలేదు. ఒక్కో మనిషిని బోటులో తీసుకువెళ్లటానికి రూ.2 వేలు చొప్పున బోటు నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.

\- బృంద

భోజనం ప్యాకెట్లను అందించలేదు

వరద బాధితులకు కనీసం మూడు రోజుల నుంచి భోజనం ప్యాకెట్లు, మంచినీరు ప్యాకెట్లు అధికారులు అందించలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వరద ప్రాంతాల్లో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయి. మా దగ్గరకు ఏ ప్రజా ప్రతినిధి కూడా రాలేదు.

\- రాజేంద్ర ప్రసాద్, పీఅండ్‌టీ కాలనీ



సింగ్‌నగర్‌లో ఆహార పొట్లాల పంపిణీ



కబేలా రోడ్డులో పడవల్లో బాధితుల తరలింపు



ప్రకాశ్‌నగర్‌లో పడవలో వృద్ధుల తరలింపు



మిల్క్‌ప్రాజెక్టు వద్ద పాల ప్యాకెట్లు తీసుకెళుతున్న బాధితులు



భవానీపురంలో ఇంకా తగ్గని వరద



రామకృష్ణానగర్‌లో ఆహార బాక్సులు తీసుకెళుతూ..



వాంబేకాలనీలో వృద్ధురాలిని వరద నుంచి తరలిస్తూ..



పాయకాపురంలో ఇంకా తొలగని వరద

శాంతించిన బుడమేరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్): మూడురోజులుగా మహోగ్రరూపం దాల్చిన బుడమేరు ఎట్టకేలకు శాంతించింది. వెలగలేరు హెడ్‌రెగ్యులేటరీ దగ్గర గేట్లు అన్నీ దించివేశారు. వరద ప్రభావిత ప్రాంతంలో ఉన్న వరద నీరు మాత్రమే ప్రస్తుతం ఉంది. బుధవారం సాయంత్రానికి వరద ప్రభావిత ప్రాంతంలో వరద నీరు గణనీయంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. సింగ్‌నగర్, ఎల్‌బిఎస్ నగర్, ప్రకాష్ నగర్, ఇందిరానాయక్ నగర్, పటేల్ నగర్, పాతరాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేట, మిల్క్‌ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో సాయంత్రానికి వరద మట్టం గణీయంగా తగ్గుతోంది. బుడమేరు ప్రవాహిత ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా వరద నీరు అడుగు, రెండు అడుగుల చొప్పున నీరు నిలిచి ఉండే అవకాశం ఉంది.

వరద వ్యథ!

- ఇంకా ముంపులోనే వేల ఎకరాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు
- వరదకు కొట్టుకుపోయిన కాచవరం డ్యామ్
- మునేటి తాకిడికి పలుచోట్ల గండ్లు

8లో..

శాంతించిన కృష్ణమ్మ

క్రమేపీ తగ్గుతున్న వరద | **కోడూరు, నాగాయలంకల వద్ద కరకట్టకు మరమ్మతు పనులు**

- కృష్ణా జిల్లాలో 35,313 హెక్టార్లలో పంట నష్టం
- మరో రెండు రోజుల్లో లంకగ్రామాల్లో సాధారణ పరిస్థితులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణమ్మ ఎట్టకేలకు శాంతించింది. మంగళవారం నాటికి ప్రకాశం బ్యారేజీ నుంచి 7.60 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదికి వరదముప్పు తగ్గడంతో రైతులు, జిల్లా ప్రజలు కొంతమేర ఊపిరిపీల్చుకున్నారు.

- మంగళవారం మధ్యాహ్నం నాటికి అక్విడెక్టు వద్ద నీటిమట్టం 21 అడుగులకు చేరింది. అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ, ఎడ్లంక, నాగాయలంక మండలం పల్లెపాలెం తదితర గ్రామాల్లో వరదనీరు ఇంకా వీడలేదు.
- పశువులకు ఆహారంగా ఉపయోగించే గడ్డి వరదప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో పశువులు ఆహారం లేక అల్లాడిపోతున్నాయి.
- కోడూరు మండలం ఉల్లిపాలెం వద్ద కరకట్ట బలహీనంగా ఉండటంతో సరుగుడుబాదులు, తడికలు ఏర్పాటుచేసి కరకట్ట కోతకు గురికాకుండా నీటిపారుదలశాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. మండలంలోని నాలుగువేల ఎకరాల్లో వరిపొలాలు నీటిలోనే మునిగి ఉన్నాయి.
- మోపిదేవి మండలం బొబ్బర్లంక, కే-కొత్తపాలెం గ్రామాలు కరకట్ట పక్కనే ఉండటంతో వీటిలో ఇంకా వరదనీరు తగ్గలేదు.
- చల్లపల్లి మండలంలోని నడకుదురు, రాముడుపాలెం, వెలివోలు, నాదెళ్లవారిపాలెం, నిమ్మగడ్డ గ్రామాల్లో కరకట్టకు, కృష్ణానదికి మధ్య ఉన్న పొలాలు, లంకభూముల్లో సాగుచేసిన చెరకు, పసుపు, కంద, పూలతోటలు నీటిలోనే ఉన్నాయి.
- తోట్లవల్లూరు మండలంలోని 9 లంక గ్రామాలు వరద ప్రభావం నుంచి ఇంకా బయటపడలేదు. వీరికి ప్రభుత్వం ఆహార పొట్లాలను అందజేసింది.
- పెనమలూరు మండలంలో పెదపులిపాక, యనమలకుదురు తదితర ప్రాంతాల్లో గృహాల్లోకి చేరిన నీరు ఇంకా పోలేదు. కూరగాయలు, పసుపు జామ, మామిడితోటలు ఇంకా నీటిలోనే ఉండిపోయాయి.
- గుడివాడ నియోజకవర్గం పరిధిలో బుడమేరు ముంపు గ్రామాలుగా ఉన్న జొన్నపాడు, రామాపురం, అరిపిరాల, చేదుర్తిపాడు, పెదలింగాల, పుట్టగుంట గ్రామాల్లో బాధితులకు టీడీపీ నేతలు ఆహార ప్యాకెట్లను అందజేశారు.

35,313 హెక్టార్లలో పంటలకు నష్టం

వరదలు, భారీవర్షాల కారణంగా జిల్లాలో 33,829 హెక్టార్లలో దుబ్బుచేసే దశలో ఉన్న వరిపైరు, ఏపుగా ఎదిగే దశలో ఉన్న పత్తి 186 హెక్టార్లలో, 799 హెక్టార్లలో వేరుశెనగ, 303 హెక్టార్లలో మినుము, 196 హెక్టార్లలో చెరకుపైరు, మొత్తంగా 35,313 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి మంగళవారం పంపారు.





జలదిగ్బంధంలో రామలింగేశ్వరస్వామి ఆలయం




బాధితులకు భోజనం అందిస్తున్న శ్యాంపన్, అధికారులు

దిక్సూచి
DIKSUCHI

విపత్తు నిర్వహణ చట్టం(2005)
సవరణ బిల్లు 2024

(సోమవారం దిక్సూచి తరువాయి)



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లుపై విమర్శలు

● **రాజ్యాంగ బద్ధత కొరవడింది; రాష్ట్రాల శాసనాధికార పరిధి అతిక్రమించబడింది:** విపత్తు నిర్వహణ అనే పదం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో ఎక్కడా లేదు. పైగా వ్యవసాయరంగంలో ఎదురయ్యే చీడపీడల వంటి రాష్ట్ర జాబితాలోని అంశాలు సైతం విపత్తుల జాబితాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఉమ్మడి జాబితాలోని 23వ అంశమైన 'సామాజిక భద్రత, సామాజిక బీమా, ఉపాధి, నిరుద్యోగం' అనే విషయాలకు సంబంధించిన ఎంట్రీ ఆధారంగా విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఇది నిర్బంధంగా రాష్ట్రాల శాసనాధికారాల్లోకి చొచ్చుకుని రావడమే. రాజ్యాంగ అతిక్రమణే అని విపక్షాలు వాదిస్తున్నాయి. అదేవిధంగా సామాజిక భద్రత కిందకు అన్ని విపత్తు అంశాలనూ చేర్చలేం. కాబట్టి ఈ బిల్లు అసంపూర్ణమని కూడా విపక్షాలు వాదిస్తున్నాయి.

● **అధికారాల మధ్య వ్యాప్తి, గందరగోళం:** ఈ బిల్లు అనేక అధికారాలను వివిధ స్థాయుల్లోని సంస్థలకు దత్తం చేసింది. ఇది అధికారుల విధి నిర్వహణలో గందరగోళం సృష్టించి విపత్తు సహాయక చర్యలకు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

● **విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రానికి విస్తృత అధికారాలు:** ఈ బిల్లు అనేక అంశాల దృష్ట్యా విపత్తు నిర్వహణలో కేంద్రానికి విస్తృత అధికారాలు దత్తం చేసింది. అనేక నియమాలు రూపొందించే అధికారం కేంద్రానికి కల్పించింది. ఇది రాష్ట్రాల విపత్తు నిర్వహణ చర్యలకు, ప్రణాళికలకు ప్రతిబంధకం. రాష్ట్రాల వారీగా వాటి ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా విపత్తు నిర్వహణ విధానాల, కార్యక్రమాల రూపకల్పన జరగాలి.

అయితే ఈ విమర్శలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం 2013 నాటి టాస్క్‌ఫోర్స్ నివేదికను, రెండో పరిపాలన సంస్కరణల సంఘం అభిప్రాయాన్ని ముందుకు తెస్తోంది. టాస్క్‌ఫోర్స్ నివేదికలో 1999 నాటి జె.సి.పంత్ అధ్యక్షతన నియమించిన హైపవర్ కమిటీ సూచన ఉటంకించింది. దీని ప్రకారం రాష్ట్రాల జాబితాలో కేవలం రెండు అంశాలు మాత్రమే ఎంట్రీ నంబరు 14(వ్యవసాయం, చీడపీడల నుంచి రక్షణ), ఎంట్రీ నంబరు 17(నీరు, నీటి సరఫరా, నీటిపారుదల, ఎంబార్క్‌మెంట్స్) విపత్తు నిర్వహణ కిందకు వస్తాయి. కాబట్టి దేశ వ్యాప్తంగా ఒక సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక తీసుకురావడానికి భారత రాజ్యాంగ షెడ్యూల్ 7లో ఒక ఎంట్రీగా విపత్తు నిర్వహణను చేర్చాల్సి ఉందని అభిప్రాయపడింది.

అదేవిధంగా రెండో పరిపాలన సంస్కరణల సంఘం 3వ రిపోర్టు అయిన 'క్రైసిస్ మేనేజ్‌మెంట్: ఫ్రం డెస్పైర్ టు హోప్' అనే 2006 నాటి నివేదికలో కూడా విపత్తు నిర్వహణ అంశంపై చట్ట అధికారం కేంద్రానిదే అని సూచించింది. ఈ నివేదికలో, రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో గల మూడు జాబితాల్లో ఏ ఒక్క జాబితాలో కూడా 'విపత్తు నిర్వహణ' అనే అంశం పేర్కొనని కారణంగా, అది అవశిష్ట అధికారం కిందకు వస్తుంది. అవశిష్ట అధికారం మేరకు ఏ జాబితాలోనూ పేర్కొనని అంశాలపై చట్టాలు చేసే అధికారం కేవలం కేంద్రప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని ఇతిమిద్ధంగా తెలియజేసింది. కాబట్టి ఈ బిల్లు రాజ్యాంగబద్ధమే, రాష్ట్రాల శాసన అధికారాల అతిక్రమణ కాదని కేంద్రప్రభుత్వ వివరణ.

అయితే విపత్తు నిర్వహణకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా, భవిష్యత్తులో అధికార పరిధులపై వివాదాలు తలెత్తకుండా ఉండే నిమిత్తం 'విపత్తు నిర్వహణ' అంశాన్ని రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో చేర్చేందుకు సైతం రాజ్యాంగ సవరణ ఆవశ్యకత ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2ds6iZXలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్క్రీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం








ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది



బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనుకడుగే లేదు



చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా ఆయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు... డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశారని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. మున్ముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పౌలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తుపాకులతో పోలీసు బందీ

కొత్తగా..



సన్నీ అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.


రామన్నగూడెంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి


పుట్టగుంటలో ఎంపీ బాలశౌరి పర్యటన


కృష్ణలంకలోమంత్రి పార్థసారథి, గోపాలపురం ఎమ్మెల్యే ఎం.వెంకటరాజు తదితరులు


పశ్చిమలో అచ్చెన్నాయుడు, సుజనా చౌదరి, పత్తిపాటి


విద్యాధరపురంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అండగా ఉంటాం..ఆదుకుంటాం..

విజయవాడ, వన్‌టౌన్ సెప్టెంబరు 3 : మీకు అండగా ఉంటా... ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లు కట్టించి ఇస్తానంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాధరపురం వరద ముంపు బాధితులకు ధైర్యం చెప్పారు. గట్టువెనుక విద్యాధరపురం వరద ముంపు ప్రాంతాలను మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించారు. సీఎం అక్కడి నుంచి చనుమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ మీదుగా వైఎస్ఆర్ కాలనీకి వెళ్లి బాధితులను పరామర్శించారు. సీఎం నున్న బైపాస్ రోడ్డు నుంచి ముస్తాబాద్ వైపు వెళ్లారు. **హనుమాన్ జంక్షన్‌రూరల్ :** వరద ముంపు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు, రైతులకు బందరు ఎంపీ బాలశౌరి తెలిపారు. బాపులపాడు మండలంలోని రామన్నగూడెం, ఆరుగొలను, ఓగిరాల, తదితర ప్రాంతాల్లో ముంపుకు గురైన ప్రాంతాలను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆరుగొలను హైస్కూల్, రామన్నగూడెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని బాధితులను పరామర్శించి భోజన సదుపాయం, వసతి సౌకర్యం తదితర విషయాలపై ఆరా తీశారు. తహసీల్దార్ నాగభూషణం, రెవెన్యూ సిబ్బంది, రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, గన్నవరం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, వడ్డి నాగేశ్వరరావు, భూక్యా సమీర్, వేగిరెడ్డి పాపారావు, ఆన్నే చైతన్య చలసాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. **నందివాడ (పుట్టగుంట) :** గత మూడు రోజులుగా బుడమేరు ముంపునకు గురై పునరావాస కేంద్రాలకు తరలించిన వరద బాధితులను మంగళవారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పుట్టగుంట, చేదుర్తిపాడు, పెదలింగాల గ్రా మాల ప్రజలను పరామర్శించి మీకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం ఎస్సై శ్రీనివాస్‌తో సహాయక చర్యలను సమీక్షించారు.

మంత్రి పార్థసారథి పరామర్శ

రామలింగేశ్వరనగర్ : రామలింగేశ్వరనగర్ వరద బాధితులను మంత్రులు కొలుసు పార్థసారది, నిమ్మల రామానాయుడులతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరామర్శించారు. ఇస్కాన్ టెంపుల్ ఆవరణలోని బాధితులను పరామర్శించారు. గద్దె క్రాంతి కుమార్ 15,16,17 డివిజన్లలో వరద బాధితులను పరామర్శించారు. **కృష్ణలంక :** పాత పోలీసు స్టేషన్ రోడ్డు చివరన వున్న కోదండరామా ఘాట్‌ను మంగళవారం మంత్రి పార్థసారథి, గోపాలపురం ఎమ్మెల్యే ఎం.వెంకటరాజుతో కలిసి సందర్శించారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, కేశనం భావన్నారాయణ, పోదూరి పవన్‌కుమార్, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సుజనా చౌదరి పర్యటన

చిట్టినగర్ : పశ్చిమ నియోజక వర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం మంత్రులు అచ్చెన్నాయుడు, ప్రత్తిపాటి పుల్లారావులతో కలిసి ఎమ్మెల్యే సుజనా చౌదరి పర్యటించారు. చిట్టినగర్, కె.ఎల్.రావునగర్ ప్రాంతాల్లో ట్రాక్టర్లలో వెళ్లి వరద ప్రాంతాలను పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కోమటి జయరాం, టీడీపీ నాయకులు కె.నాగుల్‌మీరా, గుర్రం కొండ పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేదవ్యాస్ పర్యటన

మచిలీపట్నం టౌన్ : గూడూరు మండలంలో ముంపునకు గురైన పంట పొలాలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ సందర్శించారు. డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లో సత్వర చర్యలు తీసుకోవాలని వేదవ్యాస్ పేర్కొన్నారు.



ఎమ్మెల్యే కాగిత పరామర్శ

పెడన రూరల్ : పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం మండలంలోని ఉరివి, చెన్నూరు, పెనుమల్లి, ముచ్చిలిగుంట, నందిగం, నడుపూరు, బల్లిపర్రు తదితర గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. చేలలో నీరు తొలగించకపోతే పంట నష్టపోతామని రైతులు తెలిపారు. మురుగు బోదెలలో అడ్డంకులను తక్షణం తొలగించి చేలలో నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పంచకర్ల సురేష్, ఊచా వెంకయ్య కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేల్పూరులో ఎమ్మెల్యే బోడె పర్యటన

కంకిపాడు : వేల్పూరు, ఉప్పలూరు, మంతెన గ్రామాల్లో మంగళవారం పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పర్యటించారు. వేల్పూరు గ్రామంలో బుడమేరు కట్టకు గండి పడి వరద నీరు గ్రామంలోకి చేరుతుండటంతో స్థానిక ప్రజలు అప్రమత్తమయ్యారు. గ్రామంలోకి వరద నీరు చేరకుండా



గడ్డి, ఇసుక మూటలు వేసి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వేల్పూరులో దెగ్గరుండి సహాయక చర్యలను ఆయన పర్యవేక్షించారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఏడు పదుల వయస్సులో సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న తెగువ మరువలేనిదన్నారు. మండలలోని యనమలకుదురు, పెద్ద పులపాక గ్రామాల్లో గత మూడు రోజులుగా సహాయక చర్యల్లో పాల్గొన్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణ మూర్తి, పడవల మధుసూదనరావు, కొణతం సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎంపీ కొనకళ్ల పర్యటన

మోపిదేవి : వరద ఉధృతి కారణంగా ముంపుకు గురై దెబ్బతిన్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పు వద్ద పర్యటించి బాధితులను పరామర్శించారు. . **చల్లపల్లి :** లంక గ్రామాల్లో వరద ముప్పు తొలగే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు విజ్ఞప్తి చేశారు. యువనేత మండలి వెంకట్రామ్‌తో కలిసి చల్లపల్లి జడ్పీహైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో ఆముదార్లంక వరద బాధితులను, చల్లపల్లిలోని పల్లపు ప్రాంతాల నుంచీ వచ్చిన బాధితులను పరామర్శించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, షేక్ నబీషోరి, రావి చిట్టి, మోర్ల శివ, యాసం చిట్టిబాబు, గుడివాక శివరావు, పరిశె మౌళి, గొరిపర్తి సుబ్బారావు, మేడికొండ విజయ్, బాదర్ల లోలాక్షుడు, ఈవో మాధవేంద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు. ఆముదార్లంకలో యువనేత మండలి వెంకట్రామ్ పర్యటించారు. నిమ్మగడ్డ నుంచీ ప్రత్యేక లాంచీల్లో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలతో కలిసి ఆముదార్లంక వెళ్లి గ్రామంలో పరిస్థితులను తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీఐ ఈశ్వరరావు, కూటమి నేతలు మత్తి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న తదితరులు ఉన్నారు



న్యాయాధికారి శ్రీహరి సందర్శన

తోట్లవల్లూరు : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మంగళవారం రాత్రి తోట్లవల్లూరులో వరద బాధితులతో కలిసి నిద్రించి వారికి మనోధైర్యం నింపారు. బుధవారం ఉయ్యూరు కోర్టు జడ్జి కె.శ్రీహరి తోట్లవల్లూరు పునరావాస కేంద్రానికి వచ్చి వరద బాధితులను పరామర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	117, 126, 137
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.05

కేసరపల్లి వద్ద ఏలూరు కాల్వకు గండి



గన్నవరం : కేసరపల్లి జగనన్న లేఅవుట్ దగ్గరలో ఏలూరు కాల్వకు గండిపడింది. గండి పడిందా, లేక ఎవరైన పెట్టారా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. దీనిపై విచారణ చేపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గూడవల్లి- జక్కులనెక్కలం గ్రామాలకు గత నాలుగు రోజులుగా రాకపోకలు స్తంభించాయి. ముస్తాబాద శివారులో వరద ఇంకా అలానే ఉంది. పంట పొలాలు నీటిలోనే ఉన్నాయి.

బుడమేరు కాల్వకు గండి



మధురానగర్ : గవర్నమెంట్ ప్రెస్ నుంచి మదురానగర్‌కు వచ్చేదారిలో రైలు వంతెన వద్ద మధ్య కట్టకు గండి పడటంతో బుడమేరు కాల్వలోని నీరు మొత్తం రైవస్‌కాల్వలోకి చేరింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సందర్శించారు. మసిముక్కు శ్రీనివాస్‌యాదవ్, అంగిరేకుల రాంబాబు యాదవ్, బర్మాశ్రీను, సింగం వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లింగాల కాజ్‌వే ధ్వంసం

వత్సవాయి : మునేరుకు వచ్చిన వరద ఉధృతికి లింగాల కాజ్‌వే ధ్వంసం అయ్యింది. మునేటిలో వేసిన విద్యుత్ స్తంభా లు కొట్టుకుపోయాయి. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ధ్వంసం అయిన కాజ్‌వేను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.

మంత్రుల పర్యటన

వన్‌టౌన్ : ముంపు ప్రాంతాలైన భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కొన్ని ప్రాంతాల్లో ట్రాక్టర్ల పైన, మరికొన్ని ప్రాంతాల్లో కాలినడకన పర్యటించారు. హోం మినిస్టర్ వంగలపూడి అనిత, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, నరసారావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, తదితరులు భవానీపురం, విద్యాధరపురం ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి భోజనం, మంచినీటి ప్యాకెట్లు అందజేశారు.

హైదరాబాద్‌కు యథావిధిగా బస్సులు

విజయవాడ, వన్‌టౌన్ : విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బస్సులు యథావిధిగా నడుపుతున్నారు. వరద ముంపు కారణంగా కృష్ణాజిల్లా ఐతవరం వద్ద గండిపడటంతో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. ఉన్నతాధికారులు ఐతవరం వద్ద పడిన గండికి మరమ్మత్తు పనులు చేపట్టి పూర్తిచేశారు. మంగళవారం ఆర్టీసీ అధికారులు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 151 బస్సులు నడిపారు.

37 రైళ్లు రద్దు...

వరద ముంపు తగ్గుముఖం పట్టటంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం సుమారు 37 రైళ్లను మాత్రమే రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు కొంతవరకు ఊపిరి పీల్చుకున్నారు.

గోడ కూలి మహిళకు తీవ్రగాయాలు

చల్లపల్లి : పల్లెపాలెంకు చెందిన వక్కలగడ్డ నాగమణి గోడమీదుగా మంచాన్ని బయటకు దించుతున్న సమయంలో గోడ కూలిపోవటంతో గాయపడింది. వెంటనే లాంచీలో కరకట్టమీదకు తీసుకువచ్చి అంబులెన్స్‌లో బందనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీటీ కృష్ణమోహన్ పర్యవేక్షించారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఉంగుటూరు : పెదఅవుటపల్లిలో పేకాట ఆడుతున్న 14 మందిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2.25 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపారు.

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు : అంబాపురంలో వరద సహాయ చర్యల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మంత్రి బాలవీరాంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే నడుములోతు నీటిలో వెళ్లి బాధితులకు ఆహారం, తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. భగత్‌సింగ్ కాలనీ వాసులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని బాధితులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి మోతిలాల్ చేతుల మీదుగా దుస్తులు అందించారు.

వీఆర్‌ఏ రమాదేవి మృతి

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు వీఆర్‌ఏ సుంకర రమాదేవి (33) సోమవారం రాత్రి మృతి చెందారు.. మృతదేహానికి మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీపీ వై.నగేష్ శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, దయాల విజయనాయుడు, అట్లూరి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, స్థానిక ప్రముఖులు, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది.వీర్వోలు, వీఆర్‌ఏలు పంచాయతీ సిబ్బంది ఆమె భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


బందరు నుంచి మానవత ఆధ్వర్యంలో..


పారిశ్రామికవేత్త విక్కుర్తి ఆధ్వర్యంలో.


మోపిదేవి దేవస్థానం ఆధ్వర్యంలో..


జ్యోతి కన్వెన్షన్‌లో ఆహార సిద్ధం చేస్తున్న వాకర్స్ కమిటీ సభ్యులు

వరద బాధితుల సేవలో...

మచిలీపట్నం టౌన్ : ప్రకృతి వైపరీత్యాలకు దిక్కుతోచని స్థితిలో ఉన్న వరద బాధితులను ఆదుకునేందుకు మానవతావాదులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ పిలుపునిచ్చారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, స్టార్ హెల్పింగ్ హబ్ సంయుక్తంగా రూ. 2 లక్షల విలువగల ఆహార పదార్థాలను విజయవాడ వరద బాధితులకు పంపారు. పి. శ్రీరామ్ ఆధ్వర్యంలో వ్యాన్‌కు గొర్రెపాటి గోపీచంద్ జెండా ఊపి ప్రారంభించారు. **గుడివాడ :** వరద ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సహాయార్థం స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో 50వేల బిర్యానీ, పులిహోర ప్యాకెట్లతో కూడిన వాహనాలను మంగళవారం స్థానిక ప్రజావేదిక వద్ద టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు జెండా ఊపి ప్రారంభించారు. **అవనిగడ్డ :** పాత ఎడ్లంక గ్రామంలో పారిశ్రామిక వేత్త పర్యటించి ఆహార ప్యాకెట్లు అందజేశారు. విక్కుర్తి రాంబాబు, మునిపల్లి బాలస్వామి, మునిపల్లి సుబ్బారావు, నలిగిల బాలస్వామి, బాబురావు, చంద్ర, పున్నయ్య చౌదరి, బస్వారావు, బర్మా శ్రీను తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** విజయవాడ, మోపిదేవి మండలంలోని ప్రభావిత వరద ప్రభావిత గ్రామాల్లో మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యం లో పులిహోర, వాటర ప్యాకెట్లు పంపిణీ చేశారు. అల్పాహార ప్యాకెట్ల పంపిణీ వాహనాన్ని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు మోపిదేవి దేవస్థానం వద్ద ప్రారంభించారు. **పామర్రు :** ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపు మేరకు వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, దేవరపల్లి గ్రామాల్లోని బాధితులకు కురుమద్దాలి గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో పులిహోర, పెరుగన్న పంపిణీ చేశారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థులను అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రానికి తరలించారు. బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ హైదరాబాద్ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు సౌజన్యంతో 240 మంది పిల్లలకు బిస్కెట్లు ఎనర్జీ డ్రింక్, ఓఆర్ఎస్ టెట్రా ప్యాకెట్లు అందజేశారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులకు టీడీపీ నాయకులతో కలిసి యార్లగడ్డ సతీష్ భరోసా కల్పిస్తున్నారు. వారికి భోజన, వసతి సదుపాయాలు పరిశీలించి భోజనాల్ని వడ్డించారు. చలసాని శ్రీనివాస్, అన్నే చైతన్య దుట్టా శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో 300 మంది వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను ప్రిన్సిపాల్ మధుసూదనరావు పంపిణీ చేశారు. **మోపిదేవి :** పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు బుర్రే శ్యాంసన్ - ప్రభుకుమారి దంపతులు వరద ప్రభావిత గ్రామాలైన కె.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. **విస్సన్నపేట :** విస్సన్నపేట వాసవిక్లబ్, తెలుగు మహిళా నాయకురాలు నాదెళ్ల నాగమణి పులిహోరా, పచ్చళ్లను వితరణగా అందించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణికి రూ.30 వేలు విలువ గల ఆహార, పులిహోర పొట్లాలు, రూ.18 విలువ చేసే పచ్చళ్ల ప్యాకెట్లను ఆమె తహసీల్దార్‌కు అందించారు. దాతలు కుక్కడపు శ్రీనివాసరావు, నాగుబండి రమేష్, పి.చక్రవర్తి, కుక్కడపు సతీష్‌కుమార్, జి.మధుబాబు, నీలిమా, కూటమి నేతలు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విజయవాడకు చెందిన ది కృష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ స్టోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు 10 వేల ఆహార పొట్లాలను మంగళవారం లారీలో తరలించారు. ఎన్టీఆర్ కలెక్టర్ కార్యాలయం, రెడ్‌క్రాస్ కార్యాలయానికి అందజేసినట్లు ది కృష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రావి శరత్‌బాబు, స్టోర్స్ చైర్మన్ కోనేరు వెంకటరమేష్, ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



'టీకేఆర్' ఆపన్నహస్తం

విజయవాడ : పాయకాపురం, ప్రకాశ్‌నగర్, రాధానగర్, ప్రశాంతి నగర్, కండ్రిక, ఇన్నర్ రింగ్ రోడ్డు సహా అన్ని ప్రాంతాల వరద బాధితులకు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని టీకేఆర్ టవర్స్ ఆపన్న హస్తం అందించాయి. బిల్డర్ భీమవరపు వెంకట అప్పారెడ్డి, టీకేఆర్ టవర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీర్ల చిన్ని, సభ్యులు వెంకటేశ్వరరావు, యాదా రాజ్యలక్ష్మి, యద్దనపూడి రాజు, మోహన్, వెంకట్, హరికృష్ణ, బాలు చొరవ తీసుకుని మూడు రోజుల పాటు 30 వేల మందికి పైగా బాధితులకు నిరంతరం ఆహారం, మంచి నీరు అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను అక్కడికక్కడే తయారు చేసి బాధితుల క్షుద్బాధ తీర్చారు. 20వేల లీటర్ల తాగునీటిని బాధితులకు సరఫరా చేశారు.వరద కారణంగా పాయకాపురంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నీటమునిగింది. దీంతో వార్డెన్ సుజాత ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూసినా.. శివారు ప్రాంతం కావడంతో సాయం అందడం సమస్యగా మారింది. దీంతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అభ్యర్థన మేరకు 'టీకేఆర్ టవర్స్' బిల్డర్ అప్పారెడ్డి, కమిటీ సభ్యులు విద్యార్థినులకు బస ఏర్పాటు చేశారు. వారికి భోజనం, తాగునీరు, అల్పాహారం కూడా అందించారు. ఎస్‌డీఆర్ ఎఫ్ సిబ్బంది సైతం టీకేఆర్ టవర్స్‌లోనే భోజనం చేయడం విశేషం. **సత్యనారాయణ పురం :** మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఎంఈఐఎల్) యాజమాన్యం స్పందించి ప్రతి రోజూ లక్ష మందికి తగ్గకుండా అల్పాహారం, భోజనం, మంచినీటి బాటిళ్లను మంగళవారం హరే కృష్ణా మూవ్‌మెంట్ సహకారంతో చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ కార్యాలయ ఇన్‌చార్జి కొమ్మారెడ్డి బాపిరెడ్డి అందచేశారు. ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుములరావు పిలుపు మేరకు ఆర్ఎం దానం ఆదేశాలతో మధువన్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత కాకోల్లు నాగేశ్వరరావు పర్యవేక్షణలో గత మూడు రోజులుగా వరద బాధితులకు ఆహార పొట్లాలను అందజేశారు. **ఆటోనగర్ :** విజయవాడలో అకాల వర్షాలకు వరద నీటి ముంపుకు గురయిన ఏపీఐఐసీ కాలనీ, గమేశా రోడ్డుల్లోని వరద బాధితులకు లయన్స్‌క్లబ్, ఐలా సర్వీస్ సొసైటీ తరపున ఆహార పంపిణీ నిర్వహించారు. డాక్టర్ అబ్దుల్ కలాం, కత్తిక శివనాగేశ్వరరావు, ఉపేంద్ర, సుభాష్, సుంకాని వెంకటత్రినాథ్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్(ఏటీఏ) ఆధ్వర్యంలో సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల వరద బాధితులకు మంగళవారం మంచినీళ్లు, రొట్టెలు, పాలు పంపారు.

టీడీపీ నేతల ఆధ్వర్యంలో..

జి.కొండూరు / రెడ్డిగూడెం / మైలవరం : హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో బుడమేరు వరదతో నిరాశ్రయులైన బాధితులకు ఆరు ట్యాంకర్ల మంచినీటితో పాటు వందల మందికి టీడీపీ నేత ఈమని మురళీకృష్ణ భోజన ఏర్పాట్లు చేశారు. అంకెం సురేష్, మెండెం మునీంద్రరావు పాల్గొన్నారు. రెడ్డిగూడెంలో టీడీపీ యువ నేత బొమ్మిన కోటేశ్వరరావు వితరణతో వరద బాధితులకు భోజనం ఏర్పాటు చేశారు. చాట్ల చందా, చేపలమడుగు చంద్రం, మల్లాది పోతురాజు పాల్గొన్నారు. మైలవరంలో వరద బాధితులకు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంక లితీష్ సేవా చేశారు. బాధితులను ట్రాక్టర్‌పై పునరావస కేంద్రాలకు తరలించారు.

బాధితులకు అండగా ఉంటాం : నెట్టెం

కంచికచర్ల రూరల్ : వరద తగ్గుముఖం పట్టిన తర్వాత నష్ట నివారణకు ఒక అంచనా వేసి అన్ని విధాలా బాధితులను ఆదుకుంటామని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. స్థానిక ఓసీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు.

ఒకరికొకరు సాయపడదాం : వసంత

ఇబ్రహీంపట్నం : మునుపెన్నడూ చూడని జలప్రళయం ఇది.. విమర్శలు చేసుకునే సమయం కాదు.. ఒకరికొకరం సాయపడదామని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో వరద బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు. మునేరు, కట్లేరు, బుడమేరు ఒకేసారి పోటెత్తి కృష్ణానదికి వచ్చాయని, బ్యారేజికి రికార్డుస్థాయి వరద రావటంతో నియోజకవర్గంపై ముప్పేట దాడి చేశాయన్నారు. అందరినీ రక్షించే వరకు మీతోనే ఉంటాని ఆయన హామీ ఇచ్చారు.

ఐదేళ్లు గాలికొదిలేసి కబుర్లా జగన్ : దేవినేని ఉమా

జి.కొండూరు : ఐదేళ్ల పాలనలో బుడమేరును గాలికొదిలేసిన జగన్ ప్రభుత్వంపై బురద చల్లేందుకు వచ్చాడని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. మంగళవారం ఆయన కొండపల్లి మున్సిపాలిటీలో వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. బుడమేను నీరు డైవర్ట్ చేశారని చెప్పడం జగన్ తెలివితక్కువ తనానికి నిదర్శమన్నారు. వరద బాధితులకు దగ్గరుండి భోజనం వడ్డించారు.

అధైర్యం వద్దు.. ఆదుకుంటాం : తాతయ్య

జగ్గయ్యపేట రూరల్ : పాలేటి నది ముంపునకు గురై నష్టపోయిన ప్రతిఒక్కరిని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధైర్యపడొద్దని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. కెఅగ్రహారం, బూదవాడ గ్రామాలలో మంగళవారం ఆయన పర్యటించారు. యుద్ధప్రాతిపదికన అంచనాలు తయారు చేసి మరమ్మతులు చేపడతామన్నారు.

బాధితులకు అండగా ఉంటాం.. : కొలికపూడి

తిరువూరు : అంబాపురంలో వరద సహాయక చర్యల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే వరదనీటిలో ఉన్న వారిని వడ్డుకు చేర్చడంతో పాటుగా వారికి అవసరమైన ఆహారం, తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు భరోసా కల్పించారు.

35,313 హెక్టార్లలో వరి, 3,528 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

భారీవర్షాలు, కృష్ణానదికి వరదల కారణంగా కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లోని 359గ్రామాల్లో 35,313 హెక్టార్లలో వరిపంటకు, 14మండలాల్లోని 198గ్రామాలలో 3,528 హెక్టార్లలో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపారు. 50పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిలోకి 10,738 మందిని తరలించారు. కృష్ణా జిల్లా మొత్తంగా రహదారులు, విద్యుత్, తదితర విభాగాలకు రూ. 28.98కోట్ల మేర నష్టం జరిగినట్టుగా కలెక్టర్ బాలాజీ ప్రభుత్వానికి నివేదికను పంపారు.



మునేరు వరదకు తుడిచిపెట్టుకుపోయిన మాగాణి చేలు



రాళ్ల దిబ్బలుగా మారిన పంట భూములు



హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు వరద ఉధృతికి దెబ్బతిన్న లో లెవల్ చప్టాలు



బుడమేరు ముంపులో ఉన్న వేల ఎకరాలు

వరద వ్యధ!



- ఇంకా ముంపులోనే వేల ఎకరాలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- వరదకు కొట్టుకుపోయిన కాచవరం డ్యామ్
- మునేటి తాకిడికి పలుచోట్ల గండ్లు
- వరదలకు కొట్టుకుపోయిన వాహనాలు

జి.కొండూరు, సెప్టెంబరు 3 : బుడమేరు, కృష్ణా వరద మైలవరం నియోజకవర్గాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. బుడమేరు, పులివాగుతో పాటు వాగులు వంకలు పొంగి ప్రవహించడంతో మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లోని పలు చెరువులకు గండ్లు పడ్డాయి. పలుచోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి. అనేక గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో బుడమేరు వరదలో ఇద్దరు గల్లంతై మృతి చెందగా, ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం గ్రామంలో విధుల్లో ఉన్న లైన్‌మేన్ కృష్ణానది వరదలకు గల్లంతై మృతి చెందాడు. బుడమేరు వరదకు హెచ్.ముత్యాలంపాడు గ్రామం వద్ద బుడమేరుపై ఉన్న పాత వంతెన పూర్తిగా ధ్వంసం అయ్యింది. లో లెవల్ చప్టా అప్రోచ్ రోడ్డు ధ్వంసం అయ్యింది.

వేల ఎకరాల్లో పంటలు నీటిలోనే..

జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల రైతాంగాన్ని బుడమేరుకు వచ్చిన వరద కోలుకోలేని విధంగా దెబ్బతీయగా, కృష్ణానదికి వచ్చిన వరద ఇబ్రహీంపట్నం మండల రైతులను నిండా ముంచేసింది. జి.కొండూరు, మైలవరం మండలంలో బుడమేరు పరీవాహక ప్రాంతాలైన కోడూరు, చిన్ననందిగామ, వెల్లటూరు, వెలగలేరు, కందులపాడు, కవులూరు, పినపాక గ్రామాలతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని ఈలప్రోలుతో పాటు విజయవాడ రూరల్ మండలంలోని పైడూరుపాడు, రాయనపాడు, గొల్లపూడి, తాడేపల్లి, జక్కంపూడి, షాబాద గ్రామాల్లో వేల ఎకరాల్లోని మాగాణి పంటలు పూర్తిగా నిళ్లలోనే నానుతున్నాయి. ఇబ్రహీపట్నం మండలంలోని ఏటి పట్టు గ్రామాలలో పాటు ఎస్.హెచ్ పక్కనే ఉన్న గ్రామాల్లోను ఆహార, వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పత్తి పంట పూర్తిగా నాశనం అయ్యింది. ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

వరద నీటిలో జగనన్న కాలనీ..

విజయవాడ వీఎంసీలో ఉన్న లబ్ధిదారులకు బుడమేరు వరద పట్టే ప్రాంతాలో ఎందుకూ పనికి రాని పొలాలు కొని గత ప్రభుత్వ హయాంలో హెచ్.ముత్యాలంపాడు వద్ద నిర్మించిన పేదల సెంటు పట్టా కాలనీని బుడమేరు వరద ముంచెత్తింది. కాలనీ లోకి వెళ్లేందుకు ఇంకా వారం పది రోజులు పడుతుందని చెబుతున్నారు. ముడుపులకు కక్కుర్తి పడి అధికారులు నివేశన స్థలాలు కేటాయించారని ఆవేదన చెందుతున్నారు.

మునేరు కడగండ్లు..

కంచికచర్ల : మునేరు వరద రైతులకు కడగండ్లు మిగిల్చింది. పలు గ్రామాలకు భారీ నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాల భూములు కోతకు గురికాగా, పెద్దఎత్తున ఇసుక మేట వేసింది. వేలాది ఎకరాల పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. ఇంతకు ముందెన్నడూ లేనంతగా నష్టం జరగటంతో రైతులు రోదిస్తున్నారు.

వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆనకట్ట వల్ల వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లో దాదాపుగా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఆయకట్టులో వరి నాట్లు వేసి 15 నుంచి 45 రోజులైంది. కుండపోత వర్షంతో గతంలో ఎన్నడూ లేనంతగా మునేరు ఉగ్రరూపం దాల్చింది. ఆళ్లూరుపాడు, గంగవెల్లి-పోచవరం, పెనుగంచిప్రోలు వంతెన దిగువ భాగంలో మామిడితోటల వద్ద గండ్లు పడటంతో పంట భూములపై విరుచుకుపడింది. వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, పాత వేమవరం, పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు, అనిగండ్లపాడు, ముచ్చింతాల, వెల్లుర్తిపాడు, నందిగామ మండలం మాగల్లు తదితర గ్రామాల్లో రెండువేల ఎకరాల్లో వరి చేలు ముంపునకు గురయ్యాయి. పైరు పూర్తిగా దెబ్బతిన్నది. పత్తి, మిర్చి పైర్లు దెబ్బతిన్నాయి. మిర్చి మొక్కలు కొట్టుకుపోగా, పత్తి వడబడిపోతున్నది. దీనికితోడు వందల ఎకరాల్లో ఇసుక రెండు నుంచి నాలుగు అడుగుల ఎత్తున మేట వేయగా, కొన్ని చోట్ల భూములు కోతకు గురయ్యాయి. ఇసుక మేటలు ఇప్పట్లో తొలగించటం చాలా కష్టమని, గండ్లు కూడా పూడ్చలేమని రైతులు చెపుతున్నారు. మోటార్లు, బోర్లు దెబ్బతిన్నాయి. వందల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారాలు నేలకొరిగాయి. పలు చోట్ల గండ్లు పడి బీటీ రోడ్లు ధ్వంసమయ్యాయి. తాగునీరు అందించే ప్రధాన పైపులైన్లు కొట్టుకుపోయాయి. మునేరు వరద మిగిల్చిన నష్టం అంతా ఇంతా కాదు. నామరూపాలు లేకుండ దెబ్బతిన్న పైర్లు, భూములను చూసి రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. ఇప్పట్లో కోలుకోలేనంతగా దెబ్బతిన్న రైతులకు నోటమాట రావటం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులను ఆదుకోవాల్సిందిగా రైతు సంఘం నాయకుడు కొమ్మినేని సత్యనారాయణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వరదకు కొట్టుకుపోయిన కాచవరం డ్యామ్

జగ్గయ్యపేట రూరల్ : మండలంలోని పలు గ్రామాలకు సాగు నీటిని అందించే వర ప్రదాయినిగా ఉన్న కాచవరం డ్యాం వరదకు కొట్టుకుపోయిన



ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలేటికి కనివినీ ఎరుగని రీతిలో నాలుగు రోజులుగా వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో రైతులు కాచవరం సప్లై ఛానల్ పరిశీలించేందుకు వెళ్లగా డ్యాం ఆనవాళ్లు కూడా కనిపించకపోవటంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. బ్రిటీష్ హయాంలో సాగునీటిని అందించేందుకు పాలేటిపై వంద మీటర్ల పొడవు, మీటరు వెడల్పుతో నదిలో పై నుంచి వచ్చే నీటిని మళ్లించే విధంగా చెక్‌డ్యాం నిర్మించారు. దానికి అనుసంధానంగా కాల్వలోకి వెళ్లేందుకు రెండు గేట్‌లు నీరు అధికంగా వస్తే దానిని తిరిగి పంపేందుకు రెండు ఎస్కేప్ గేట్లు ఏర్పాటు చేశారు. దశాబ్దాల కాలంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరు సరఫరా అవుతుంది. ప్రస్తుత వరదల కారణంగా కాచవరం కట్టువా కొట్టుకుపోవటంతో ఏంచేయాలో అర్థం కాక రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. చెక్‌డ్యాం స్థానంలో తాత్కాలికంగా అడ్డుకట్ట ఏర్పాటు చేస్తేనే పంటలు పండుతాయని లేకుంటే సాగు చేసిన పొలాలను వదిలేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి కట్టువాకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



బురదలో కూరుకుపోయిన కారును తీస్తున్న క్రేన్



కారును బయటకు లాగుతున్న ఎద్దుల బండి

నందిగామలో వరద బీభత్సం

నందిగామ : వరద సృష్టించిన బీభత్సంతో పంట పొలాలు, రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయ. రెండు రోజల పాటు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేసిన వరదలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. గ్రామాలలోకి చేరిన నీరు పూర్తిగా వెనక్కు తీయడంతో ప్రజలు ఇళ్లు బాగుచేసుకొనే పనిలో పడ్డారు. వంట సామగ్రి, తిండి గింజలు కూడా పూర్తిగా తడిసిపోవడంతో ప్రజలు కన్నీటి పర్యంతమౌతున్నారు. ఇప్పుడిప్పుడే వాగులు తగ్గడంతో పొలాలు చూసేందుకు వెళ్లిన రైతులు తీవ్ర మనోవేదనకు గురౌతున్నారు. పంటలు ఆనవాళ్లు కూడా లేకుండా పోవడంతో ఆవేదన చెందుతున్నారు. పంట పొలాల నిండా ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. పొలాలు బాగు చేసుకొనేందుకు కనీసం ఎకరాకు లక్ష వరకూ ఖర్చు అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వరదలో కొట్టుకుపోయిన వాహనాలు

కీసర ప్లాజా, ఐతవరం గ్రామాల మధ్య మునేటి వరద హైవే పైకి చేరి రెండు రోజుల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో సమీపంలోని పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకూ 15 కార్లు, కొన్ని బైక్‌లు కొట్టుకుపోయినట్టు తెలిసింది. వరద తగ్గడంతో వాహనదారులు తమ వాహనాల వెలికితీతకు సహకరించాని టోల్‌ప్లాజాకు చెందిన సేఫ్టీ మేనేజర్, నిర్వాహకులతో పాటు అధికారులను వేడుకున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో వాహనానికి రూ.15 వేలకు పైగా వెచ్చించి వాహనాలను బురద నుంచి రోడ్డు పైకి తెప్పించుకున్నారు. ఈ విషయాన్ని ఆర్డీవో రవీంద్రరరావు దృష్టికి తీసుకురాగా హుటాహుటిన టోల్ ప్లాజా సిబ్బందిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి టోల్ వసూలు చేయడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విపత్తులు వచ్చినప్పుడు టోల్ వసూలు చేయరాదన్న నిబంధన ఉందని, టోల్ ఎలా వసూలు చేశారంటూ నిలదీశారు.

ఆయుష్ ఆస్పత్రి వరద సాయం రూ. 50 లక్షలు



విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితుల సహాయార్థం ఆయుష్ ఆసుపత్రి యాజమాన్యం సీఎం సహాయ నిధికి 50 లక్షల రూపాయలు అందజేసింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఆయుష్ ప్రతినిధులు మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడును కలిశారు. యాజమాన్యంతోపాటు ఆయుష్ వైద్యులు కూడా ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. సీఎంను కలిసిన వారిలో ఆయుష్ ఎండీ డాక్టర్ కె.గోపాలకృష్ణ, కార్డియాలజీ సర్జన్ డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ శశిలు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు వేగవంతం చేయండి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరదనీరు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో అన్నిప్రాంతాల్లోనూ పారిశుధ్య చర్యలు వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలు నుంచి మంగళవారం ఆయన అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ఉధృతి తగ్గుతున్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే పారిశుధ్యచర్యలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని సరఫరాచేసే ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించి శుభ్రంచేయించాలన్నారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో చక్కెర, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్ అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఒక్కో కుటుంబానికి 50కిలోల బియ్యం అందించాలన్నారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో శ్రీదేవి, జెడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

హిడెన్ కెమెరాలపై ఉన్నతస్థాయి విచారణ

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 3 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో వాష్ రూమ్ హిడెన్ కెమెరాల అభియోగంపై అత్యున్నత స్థాయి సైబర్ క్రైమ్, ఐటీ నిపుణుల బృందం మంగళవారం కూడా విచారణ చేసింది. తమకు న్యాయం చేయాలని కళాశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి శాంతియుత ప్రదర్శనకు దిగారు. పోలీసులు వారి ప్రయత్నాన్ని భగ్నం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణుల బృందం మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్విరామంగా ముగ్గురు డీఐజీలు, ఎస్పీ, ముగ్గురు డీఎస్పీల పర్యవేక్షణలో విచారాణ నిర్వహించారు. మీడియా సహా ఇతరులు ఎవరినీ కళాశాలలోకి అనుమతించలేదు. పలువురు విద్యార్థినులను పిలిపించి విచారణ నిర్వహించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ, పూణే నిపుణుల బృందం నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు గానీ, హోంమంత్రి అనితకు కానీ బుధవారం అందచేస్తారని తెలుస్తోంది. కళాశాలలో ఏలూరు రేంజ్ డిఐజి అశోక్, పిఅండ్‌ఎల్ ఐజి పి.హెచ్.డి రామకృష్ణ, ఏసీబీ, ఎస్ఈబీ ఐజీ రవి ప్రకాశ్, ఎస్పీ గంగాధర్ విచారణ నిర్వహించినట్టు తెలిసింది. సోషల్‌మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ఎస్పీ పేర్కొన్నారు.

స్టేషన్ వద్ద విద్యార్థుల హల్‌చల్

వాష్ రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు, 300 వీడియోలు ఉన్నాయంటూ ఆరోపిస్తున్న విద్యార్థులు పోలీస్ స్టేషన్ ముట్టడికి విఫల యత్నం చేశారు. సేకరించిన వివరాల ప్రకారం కళాశాల విద్యార్థులు కొందరు తమకు న్యాయం జరిపించాలని కోరుతూ స్టేషన్‌ను ముట్టడిస్తున్నారన్న సమాచారంతో స్టేషన్ వద్ద భారీగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. విద్యార్థుల వివరాలు సేకరిస్తూ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ముట్టడి కార్యక్రమం భగ్నమైంది. కార్యక్రమంలో ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ, గుడివాడ రూరల్ ఎస్ఐ చంటిబాబు, నందివాడ ఎస్ఐ శ్రీనివాస్, గుడ్లవల్లేరు ఎ.ఎస్.ఐలు 50 మందికి పైగా పోలీసులు పాల్గొన్నారు.

నీటిలోనే కాలనీలు

- బుడమేరు ముంపులో ప్రజలు
- విద్యుత్, నీరు, భోజనం లేక తీవ్ర అవస్థలు
- అంతంత మాత్రంగానే ఎన్డీఆర్ఎఫ్ సేవలు
- వృద్ధులు, చిన్నారులను కాపాడాలని ఆవేదన
- కట్టుబట్టలతోనే సురక్షిత ప్రాంతాలకు..

> ఎటుచూసిన నీరే, బయటకు వెళ్లే దారిలేదు, తినడానికి లేక, కనీసం తాగడానికి మంచినీరు లేక సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంత వాసులు పడుతున్న కష్టాలు వర్ణానాతీతం. బుడమేరు గతంలో ఎన్నడూ లేని విధంగా వరద రావడంతో బుడమేరులో ఇళ్లు కట్టుకున్న వారు రెండురోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక ప్రాంతం అని కాకుండా సింగ్‌నగర్ ఫ్లైఓవర్ దిగివ కనుచూపుమేర అంతా నీరే ఉండడంతో ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి.

సత్యనారాయణపురం/రామలింగేశ్వరనగర్/రాణిగారితోట, సెప్టెంబరు 2 : బుడమేరు శాంతించక పోవడంతో సమీపంలోని కాలనీలు, ఇళ్లు నీట మునిగాయి. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. బుడమేరు వంతెనను తాకుతూ వరదనీరు ప్రవహిస్తున్నది. అయోధ్యనగర్, శాంతినగర్, బసవతారకనగర్, రామకృష్ణాపురం, దేవినగర్, గద్దే వెంకట్రామయ్యనగర్, దావుబుచ్చయ్యకాలనీ , వినయక్‌నగర్ తదితర ప్రాంతాలు వరదలో చిక్కుకుపోయాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడం, ఇళ్లలోకి నీరు చేరడం, అపార్టుమెంట్ మొదటి అంతస్తు వరకూ నీరు రావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీరు, చిన్నారులకు పాలు లేక అనేక మంది సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాతో సోమవారం ఉదయం సింగ్‌నగర్, ఇందిరానాయక్ నగర్, వాంబేకాలని, ఉడాకాలనీ, పాయకాపురం తదిర ప్రాంతాల వారిని రక్షించేందుకు బొట్లను పంపారు. వరదలో చిక్కుకున్న వారికి మంచినీరు. ఆహారం, పాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అయినా అరకొరగానే తమకు సాయం అందుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది తమను రక్షించాలని ఫోన్‌ల ద్వారా స్నేహితులు, బంధువులను కోరుతున్నారు. ఇప్పటికే అనేక మందిని వరద ప్రాంతాల నుంచి బొట్లద్వారా బయటకు తీసుకు వస్తున్నారు.

కొంత మంది ధైర్యం చేసి ఇళ్లకు తాళాలు వేసి నీటిలోనే నడుచుకుంటూ వెళ్లి పోతున్నారు.

ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సిటీవైడ్ ప్రభాస్‌ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి భోజనం, అల్పాహారాన్ని అందజేశారు. సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బాబూరావు బుడమేరు ముంపుప్రాంతాలను పరిశీలించి బాధితులను పరామర్శించారు.

ఎన్‌డిఆర్ఎఫ్ తదితర సంస్థలు పడవల సాయంతో వరదలో చిక్కుకున్న వారిని రక్షిసున్నారు. సుమారు 40కిపైగా వివిధ బోట్లు వచ్చినా వేల సంఖ్యలో బాధితులు ఉండటంతో తరలింపు కష్టమవుతోంది. పలు కాలనీల్లో 10 అడుగులకు పైగా నీరు ఉండటంతో అక్కడి వారికి కనీసం మంచినీరు ఇవ్వలేని సరిస్థితి నెలకొంది. రాణిగారి తోటలోని తారకరామనగర్ పూర్తిగా నీటిలో ఉంది. గతంలో ఏన్నడూ లేనివిధంగా సత్యనారాయణ నగర్, రామలింగేశ్వరనగర్ లోతట్టు ప్రాంతం వరద నీటిలో మునిగింది. బాధితులు కట్టుబట్టలతో సురక్షితప్రాంతాలకు తరలిపోతున్నారు. వారధిని తాకేలా కృష్ణానది ప్రవహించడంతో కరకట్ట ప్రాంత వాసులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వరద బాధితులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ భోజన వసతి కల్పిస్తున్నారు.

ఇరుకు రోడ్లలో బోట్లు వేళ్లలేని పరిస్థిథి

సింగ్‌నగర్‌లోని అనేక ప్రాంతాలు చిన్న చిన్న రోడ్లు కావడంతో బోట్లు వెళ్లలేక బాధితులను రక్షించలేని పరిస్థితి. ఇందిరానాయక్ నగర్ బుడమేరు పక్కనే ఉండటంతో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అవసరమైనన్ని బోట్లు కేటాయించకపోవడంతో అపార్ట్‌మెంట్, బహుళ అంతస్తుల భవనాలలో ఉన్న వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగులు. రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలామంది హృద్రోగులు మందులు లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీసున్నారు.



బుడమేరు ముంపు ప్రాంతాల నుంచి బాధితులను ట్రాక్టర్‌లో తరలింపు

కాపాడాలని వేడుకోలు..

బుడమేరు పక్కనే ఉంటున్న నివాశితులు తమను కాపాడాలని, కనీసం తమ పిల్లలను అయినా ఒడ్డుకు చేర్చాలని ప్రాధేయపడుతున్న దీనస్థితి కనిపిస్తోంది. ఓ ఇంటిలో ఉన్న 10మంది మహిళలు, పిల్లలను ఆంధ్రజ్యోతి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహయంతో కాపాడటంతో బతుకు జీవుడా అంటూ వారు రోదిస్తూ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

సహాయక చర్యల్లో సీపీ

విజయవాడ (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు వరద బాధితుల సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొంటున్నారు. నీరు ముంచెత్తిన ప్రాంతాల్లో పోలీసులు చేస్తున్న సహాయక చర్యలను పర్యవేక్షించడమే కాకుండా ఆయన బాధితులను బోటులో ఎక్కించుకుని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.



మంగళవారం ఆయన అజిత్‌సింగ్ నగర్, నున్న, భవానీపురం, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పర్యటించారు. అజిత్‌సింగ్‌నగర్‌లో కాలనీల్లో బోటుపై వెళ్తుండగా ఒక వ్యక్తి రెండు నెలల పసికందుతో సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు. దీన్ని గమనించిన ఆయన బోటులో అతడి వద్దకు వెళ్లి ఎక్కించుకున్నారు. ఆ వ్యక్తిని, పసికందును సురక్షిత ప్రాంతానికి తరలించారు.

స్పోర్ట్స్

ధనుష్ శ్రీకాంత్‌కు మరో స్వర్ణం



న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో స్వర్ణం కొల్లగొట్టాడు. జర్మనీలోని హానోవర్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటికే రైఫిల్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచిన ధనుష్.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ పసిడి దక్కించుకున్నాడు. ఫైనల్స్‌లో మహిత్ సంధు, ధనుష్ జోడీ 17-5తో భారత్‌కే చెందిన నటాషా జోషి-మహ్మద్ ముర్తజా ద్వయాన్ని ఓడించి స్వర్ణం అందుకుంది. అంతకుముందు క్వాలిఫికేషన్స్‌లో ధనుష్ జంట 628.8 స్కోరుతో వరల్డ్ రికార్డు ప్రదర్శన చేసింది. నటాషా జోడీ కూడా 622.1తో ప్రపంచ రికార్డు స్కోరు చేసి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. 10 మీటర్ల పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత జంట ప్రాంజలి ధుమాల్, అభినవ్ దేశ్వాల్ రజతం గెలిచింది.


లార్డ్స్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ వచ్చే ఏడాది జూన్ 11 నుంచి 15 వరకు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరుగుతుంది. ఆరంభ ఎడిషన్ (2021)కు సౌతాంప్టన్, రెండో ఎడిషన్ (2023)కు ఓవల్ స్టేడియాలు ఆతిథ్యమిచ్చాయి. ఈ రెండు ఫైనల్స్‌లోనూ భారత్ రన్నరప్ గా నిలవగా.. మొదటిసారి న్యూజిలాండ్, రెండో టోర్నీ లో ఆస్ట్రేలియా విజేతలుగా నిలిచిన సంగతి తెలిసిందే.

సువారెజ్ రిటైర్మెంట్



మాంటెవీడియో (ఉరుగ్వే): స్టార్ ఫుట్‌బాలర్, ఉరుగ్వేకు చెందిన లూయిస్ సువారెజ్ (37) తన పదిహేడేళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. శుక్రవారం పరాగ్వేతో జరిగిన వరల్డ్‌కప్ క్వాలిఫయర్ మ్యాచ్ తన కెరీర్‌లో ఆఖరిదని తెలిపాడు. 2007లో అరంగేట్రం చేసిన సువారెజ్.. 142 మ్యాచ్‌ల్లో 69 గోల్స్ చేశాడు. నాలుగు ఫిఫా వరల్డ్‌కప్‌ల్లో ఉరుగ్వేకు ప్రాతినిథ్యం వహించాడు. అయితే క్లబ్ టోర్నీలు ఆడతానని లూయిస్ స్పష్టం చేశాడు.



దీప్తి..

తెలుగు అథ్లెట్‌కు కాంస్యం

- షట్లర్ నిత్యశ్రీ కంచు మోత
- పారాలింపిక్స్

పతక స్ఫూర్తి



పారిస్: పారాలింపిక్స్‌లో భారత అథ్లెట్లు మరో రెండు పతకాలతో మెరిశారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తెలంగాణ అథ్లెట్ దీప్తి జీవాంజితో పాటు 19 ఏళ్ల షట్లర్ నిత్యశ్రీ సివాన్ కాంస్య పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్ మూడు స్వర్ణాలు, ఐదు రజతాలు, ఎనిమిది కాంస్యాలతో 16 పతకాలతో కొనసాగుతోంది. అలాగే పట్టికలో 18వ స్థానంలో ఉంది. ఇక మంగళవారం జరిగిన మహిళల షాట్‌పుట్ ఎఫ్34 ఫైనల్లో భాగ్యశ్రీ జాదవ్ 7.28మీ. దూరం విసిరి ఐదో స్థానంలో నిలిచింది.

స్వర్ణంపై ఆశలు రేపినా..

మహిళల 400మీ. టీ20 విభాగంలో 20 ఏళ్ల తెలుగు అథ్లెట్ దీప్తి జీవాంజి గతంలో వరల్డ్ రికార్డు (55.07సె) సాధించింది. అందుకే పారాగేమ్స్‌లోనూ స్వర్ణం అందుకుంటుందనే భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగానే హీట్స్‌లో దీప్తి 55.45 సె.లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే ఆశించిన పతకం రాకపోయినా.. 55.82 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో మురిపించింది. మంగళవారం రాత్రి జరిగిన ఈ పోటీల్లో దీప్తి ఏడో లైన్ నుంచి రేసు ఆరంభించింది. ఆరంభం నెమ్మదిగానే సాగినా మధ్యలో వేగం పుంజుకుని రేసుగుర్రంలా దూసుకెళ్లింది. కానీ కొద్ది మీటర్లలో ఫినిషింగ్ లైన్ వస్తుందనగా అలసటగా కనిపించిన దీప్తి వేగం తగ్గింది. అయితేనేం.. డిఫెండింగ్ చాంపియన్ బ్రియానా క్లార్క్ (యూఎస్‌ఏ)ను వెనక్కినెడుతూ మూడో స్థానంతో ముగించింది. యులియా షులియర్ (ఉక్రెయిన్, 55.16సె)కు స్వర్ణం, ఏసెల్ ఒన్‌డర్ (తుర్కియే, 55.23సె) రజతం సాధించారు. ఇదిలావుండగా ట్రాక్ రన్నింగ్ ఈవెంట్‌లో భారత్‌కు గతంలో ఒక్క పతకం కూడా రాకపోయినా.. పారిస్ గేమ్స్‌లో మాత్రం ఏకంగా మూడు పతకాలు దక్కడం విశేషం. ప్రీతీ పాల్ రెండు కాంస్యాలు సాధించిన విషయం తెలిసిందే.



తొలిసారే పతకం సాధించి..: బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఎస్‌హెచ్6 విభాగంలో 19 ఏళ్ల నిత్యశ్రీ సివాన్ కాంస్య పతకం సాధించింది. ఈసారే కొత్తగా ప్రవేశపెట్టిన ఈ ఈవెంట్‌లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన తను 21-14, 21-6 తేడాతో రినా మర్లినా (ఇండోనేసియా)ను చిత్తు చేసింది. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ మ్యాచ్‌ను వరల్డ్ నెంబర్‌వన్ నిత్యశ్రీ కేవలం 23 నిమిషాల్లోనే ముగించింది. అంతకుముందు సెమీస్‌లో చైనా షట్లర్ లిన్ షుంగ్‌బో చేతిలో ఓడిన నిత్య ఈ కాంస్య పతక పోరుకు సిద్ధమైంది. మరోవైపు బ్యాడ్మింటన్‌లో భారత్‌కు లభించిన ఐదో పతకమిది. ఇప్పటికే నితేశ్‌కు స్వర్ణం, సుహాస్, తులసీమతిలకు రజతం, మనీషకు కాంస్యం దక్కాయి. అయితే టోక్యో పారాగేమ్స్‌లో షట్లర్లకు నాలుగు పతకాలే లభించడం గమనార్హం.

గురి తప్పిన అవని : మహిళల 50మీ. రైఫిల్ 3పొజిషన్ ఎస్‌హెచ్1లో స్టార్ షూటర్ అవని లేఖారాకు నిరాశే ఎదురైంది. ఫైనల్లో 420.6 పాయింట్లతో తను ఐదో స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో అవని 1159 పాయింట్లతో ఏడో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించగా పతకంపై అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తగ్గట్టుగానే మొదట నీలింగ్ పొజిషన్‌లో మూడు సిరీస్‌ల తర్వాత రెండో స్థానంలో నిలిచింది. కానీ ప్రోన్‌లో మాత్రం తడబాటుకు గురై ఆరో స్థానానికి పడిపోయింది. ఇక ఆఖరిదైన స్టాండింగ్ పొజిషన్ రెండు సిరీస్‌ల తర్వాత ఐదో స్థానానికి చేరింది. ఇక కీలక చివరి సిరీస్‌లో మొదట ఆసీస్, కొరియా, ఉక్రెయిన్ షూటర్లు ఎలిమినేట్ అయ్యారు. అనంతరం 4వ స్థానంలో ఉన్న బెన్సన్ (స్వీడన్) 9.9 స్కోరు చేయగా అవని 9.3కే పరిమితమైంది. దీంతో ఐదో స్థానంతో భారత షూటర్ ఎలిమినేట్ కాక తప్పలేదు. ఇదే విభాగంలో పాల్గొన్న మరో షూటర్ మోనా అగర్వాల్ క్వాలిఫయింగ్‌లో 13వ స్థానంలో నిలిచి ఫైనల్లో అడుగుపెట్టలేకపోయింది.

క్వార్టర్స్‌లో ఓడిన పూజ: మహిళల వ్యక్తిగత రికర్వ్ ఆర్చరీ ఓపెన్‌లో పూజ ప్రస్థానం క్వార్టర్స్‌లో ముగిసింది. చైనా ఆర్చర్ వు చున్‌యాన్ (చైనా)తో జరిగిన ఈ ఆసక్తికర పోరులో పూజ 4-6 తేడాతో ఓడింది. ఒక సెట్ గెలిస్తే రెండు పాయింట్లు లభించే ఈ మ్యాచ్ ఐదు సెట్ల పాటు జరుగుతుంది. ముందుగా ఎవరికి ఆరు పాయింట్లు లభిస్తాయో వారే విజేతగా నిలుస్తారు. అయితే తొలి రెండు సెట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన పూజ 4-0తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. ఇక మూడో సెట్ గెలుచుకుంటే సెమీస్‌కు వెళ్లేది. కానీ పట్టు వీడని చున్‌యాన్ పుంజుకుంటూ చివరి మూడు సెట్లను గెలుచుకుని 6-4తో గెలవడంతో పూజ కంగు తినాల్సివచ్చింది. అంతకుముందు ప్రీక్వార్టర్స్‌లో పూజ 6-0తో యగ్మర్ సెన్‌గుల్ (తుర్కియే)ను ఓడించి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది.

అవమానాలు దాటుకొని..

ఒకప్పుడు పిచ్చిది.. కోతి.. ఇలాంటి అమ్మాయిని ఎలా పెంచుతారు.. అనాథ శరణాలయంలో వదిలేయండి అనే ఉచిత సలహాలు. కానీ, ఇప్పుడా అమ్మాయే ఎంతో స్పెషల్. చిన్ననాటి నుంచి అవహేళనలు.. ఛీత్కారాలు ఎదురైనా తన పరుగుతో వాటిని నెట్టి పారాలింపిక్ చాంపియన్‌గా నిలిచింది జీవాంజి దీప్తి. దేశం మొత్తం దీప్తిని కొనియాడుతుంటే.. ఆమె తల్లిదండ్రులకు ఆనందంలో నోట మాటరావడం లేదు. వరంగల్ జిల్లా, కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి మానసిక వైకల్యంతో జన్మించింది. తండ్రి యాదగిరి, తల్లి ధనలక్ష్మి వ్యవసాయ కూలీలు. పేద కుటుంబంలో పుట్టెడు కష్టాల మధ్య ఎన్నో అవమానాలను దిగమింగుకొంటూ దీప్తి పెరిగింది. అయితే, స్కూల్లో పీఈటీ వెంకటేశ్వర్లు ఆమెలోని అథ్లెట్‌ను గుర్తించాడు. దీప్తి ఎంత శ్రమించినా అలసిపోని తత్వం, పరుగుతీసే విధానం ఆకట్టుకోవడంతో తగు విధంగా శిక్షణ ఇచ్చాడు. ఈ క్రమంలో 2019లో కోచ్ నాగపురి రమేష్ దృష్టిలో పడడంతో ఆమె ఇక వెనుదిరిగి చూసుకోలేదు. హైదరాబాద్‌లో శిక్షణ తీసుకొంటున్న సమయంలో దీప్తిని గమనించిన బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ ఐక్యూ టెస్ట్ చేయించాడు. ఆమెకు గ్రహణ శక్తి తక్కువనీ, ఏవిషయాన్నయినా వేగంగా అర్థం చేసుకోలేదని డాక్టర్లు సర్టిఫై చేశారు. దీంతో జీవాంజి టీ20 కేటగిరీలో పారా అథ్లెట్‌గా బరిలోకి దిగే అవకాశం దక్కింది. ట్రాక్‌పై దుమ్మురేపిన దీప్తి 2022 ఆసియా పారా క్రీడల్లో 400 మీ. రేస్‌లో స్వర్ణం కొల్లగొట్టింది. ఇక, గత మేలో వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో 400 మీటర్ల రేస్‌లో ఏకంగా ప్రపంచ రికార్డుతో ఔరా అనిపించింది.

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

స్వియటెక్ సులువుగా..

- క్వార్టర్స్‌కు ఇగా, సినర్
- మెద్వెదెవ్, అలెక్స్ కూడా



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో టాప్‌సీడ్లు జోరుమీదున్నారు. టాప్‌సీడ్లు జానెక్ సినర్, ఇగా స్వియటెక్ క్వార్టర్‌ఫైనల్స్‌లో అడుగుపెట్టారు. జొకోవిచ్, అల్కారజ్ నిష్క్రమణతో టైటిల్‌పై అంచనాలున్న వరల్డ్ నెంబర్‌వన్ సిన్నర్ ప్రీక్వార్టర్స్ దాటేందుకు తీవ్రంగా చెమటోడ్చాడు. 14వ సీడ్ టామీ పాల్‌తో జరిగిన పోరులో తొలిరెండు సెట్లను టైబ్రేకర్‌లో గెలుచుకున్న సినర్ చివరకు 7-6 (7/3), 7-6 (7/5), 6-1తో గట్టెక్కి ఊపిరి పీల్చుకున్నాడు. సెమీస్ బెర్త్ కోసం మాజీ విజేత డానిల్ మెద్వెదెవ్‌తో సినర్ అమీతుమీ తేల్చుకుంటాడు. 5వ సీడ్ మెద్వెదెవ్ 6-0, 6-1, 6-3తో నూనో బోర్గ్స్‌ను చిత్తుచేశాడు. మరో మ్యాచ్‌లో 10వ సీడ్ అలెక్స్ డి మినార్ 6-0, 3-6, 6-3, 7-5తో జోర్డాన్ థాంప్సన్‌పై గెలిచాడు. ఇక, ఆరో గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న నెంబర్‌వన్ క్రీడాకారిణి స్వియటెక్ 6-4, 6-1తో 16వ సీడ్ లూడ్మిలా సామ్‌సనోవాను సులువుగా ఓడించి 6వ సీడ్ జెస్సికా పెగులాతో క్వార్టర్స్ పోరుకు సిద్ధమైంది. మరో ప్రీక్వార్టర్స్‌లో 22వ సీడ్ బెయైజ్ హద్దాద్ వియా 6-2, 3-6, 6-3తో వెటరన్ స్టార్ వోజ్నియాకిపై గెలిచింది.

మిక్స్‌డ్ సెమీస్‌కు బోపన్న: పురుషుల డబుల్స్‌లో నిష్క్రమించిన రోహన్ బోపన్న, మిక్స్‌డ్‌లో సెమీఫైనల్‌కు చేరాడు. 8వ సీడ్ బోపన్న-సుజియాది (ఇండోనేసియా) ద్వయం 7-6(4), 2-6, 10-7తో 4వ సీడ్ మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)-క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) జోడీని ఓడించింది. సెమీస్‌లో అమెరికా జంట డొనాల్డ్ యంగ్-టేలర్ టౌన్‌సెండ్‌తో బోపన్న జోడీ తలపడనుంది.

బంగ్లా.. ఊడ్చేసింది

- పాక్‌పై రెండో టెస్టులోనూ గెలుపు
- 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

రావల్పిండి: బంగ్లాదేశ్ జట్టు రెండు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్‌ను 2-0తో వైట్‌వాష్ చేసింది. రెండో టెస్టుకు ఆఖరి, ఐదోరోజైన మంగళవారం గెలుపునకు 143 పరుగులు కావాల్సివుండగా.. బంగ్లా 6 వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకొంది. పాక్ నిర్దేశించిన 185 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 42/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 185/4 స్కోరు చేసి నెగ్గింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274, రెండో ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేయగా.. బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 262 స్కోరు చేసింది. తొలి టెస్టులోనూ బంగ్లా గెలిచిన సంగతి తెలిసిందే. విదేశీగడ్డపై సిరీస్ నెగ్గడం బంగ్లా టెస్ట్ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే. 2009లో వెస్టిండీస్‌పై తొలిసారి గెలిచింది. కాగా, గత రెండున్నరేళ్లలో సొంతగడ్డపై టెస్టుల్లో పాక్‌కు విజయమనేదే లేదు. ఆడిన 10 వరుస టెస్టుల్లో 6 ఓడగా.. 4 డ్రా అయ్యాయి. గతంలో 1969-75 మధ్య స్వదేశంలో ఆడిన వరుస 11 టెస్టుల్లో పాక్ పరాజయాలను చవిచూసింది.

బిజినెస్


ఆర్థిక వ్యవస్థకు గృహ పొదుపే కీలకం

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పాత్ర

ముంబై: గృహ (వ్యక్తిగత) పొదుపు దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర అన్నారు. కొవిడ్ తర్వాత తగ్గిపోయిన ఈ పొదుపు, మళ్లీ పుంజుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వచ్చే దశాబ్దాల్లో వ్యక్తిగత పొదుపరులే ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద రుణదాతలవుతారని తెలిపారు. సీఐఐ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పెట్టుబడి అవసరాలు పెరగడంతో కార్పొరేట్ సంస్థల రుణ సేకరణ పెరగబోతోందని పాత్ర తెలిపారు. గృహ పొదుపు, విదేశీ నిధులే ఇందుకు ప్రధాన వనరులన్నారు. చక్కటి సెకండరీ మార్కెట్ ఉన్నపుడే, రుణ పత్రాల మార్కెట్ మదుపరులను ఆకర్షిస్తుందన్నారు.

ఈ ఏడాది భారత వృద్ధి 7 శాతం

అంచనాను పెంచిన ప్రపంచ బ్యాంక్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత దేశ వృద్ధి రేటును ప్రపంచబ్యాంక్ పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7 శాతం వృద్ధిని సాధిస్తుందని తాజాగా అంచనా ప్రకటించింది. గత జూన్‌లో ప్రకటించిన అంచనా 6.6 శాతం కన్నా ఇది అధికం. వ్యవసాయ రంగం రికవరీ సాధించడంతో పాటు గ్రామీణ డిమాండు జోరందుకోవడం అంచనా పెంచేందుకు దారి తీసిన అంశాలని తాజా నివేదికలో తెలిపింది. ప్రపంచ బ్యాంక్ తాజా అంచనా ఐఎంఎఫ్, ఏడీబీ అంచనాలకు దీటుగా ఉంది. రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ఉండటం, ప్రైవేటు వినియోగం, ఎగుమతుల్లో వృద్ధి ఆధారంగా తాము అంచనాను ఎగువకు సవరించామని ప్రపంచబ్యాంక్ సీనియర్ ఆర్థికవేత్త రాన్ లీ చెప్పారు. ప్రపంచ దేశాల నుంచి పలు సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత మధ్యకాలిక దృక్పథం పాజిటివ్‌గానే ఉన్నదని తాజా నివేదికలో తెలిపారు. ఆదాయాల వృద్ధి బలంగా ఉండడంతో పాటు జీడీపీలో రుణాల నిష్పత్తి 2024 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 83.9 శాతం నుంచి 2027 ఆర్థిక సంవత్సరంలో 82 శాతానికి తగ్గుతుందని అంచనాగా ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరం వరకు కరెంట్ ఖాతా లోటు 1-1.6 శాతం మధ్యన ఉంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం తగ్గి దుర్భర దారిద్ర్యం తగ్గడానికి దోహదపడుతుందని పేర్కొంది. 2030 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని సాధించాలంటే భారత్ తన ఎగుమతి వస్తువుల జాబితాలో మరిన్ని వస్తువులను చేర్చాల్సి ఉంటుందని ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్ (ఐడీయూ) తెలిపింది.

మార్కెట్లోకి జావా 42 ఎఫ్‌జే బైక్

ధర రూ.1.99 లక్షలు



న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ యాజమాన్యంలోని క్లాసిక్ లెజెండ్స్ మంగళవారం జావా 42 ఎఫ్‌జె మోటార్ సైకిల్‌ను మార్కెట్లోకి తెచ్చింది. దీని ధర రూ.1.99 లక్షలు. జావా వంటి బ్రాండ్లను పునరుజ్జీవింపచేయడంలో ఎలాంటి సవాలునైనా ఎదుర్కొంటామని ఈ బైక్‌ను విడుదల చేసిన సందర్భంగా మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. ఈ బ్రాండ్లు మనకి ఎన్నో కథలు చెబుతాయంటూ ఒకప్పుడు ఎంతో ఆదరణ పొందిన ఇలాంటి బ్రాండ్లు ఎలాంటి ఉత్సుకత రేపుతాయో చూసేందుకు మనందరం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తూ ఉంటామని చెప్పారు. 42 లైఫ్ సీరీస్‌కు చెందిన జావా డిజైన్, ధర, పని తీరు అన్నింటిలోనూ చక్కని సమతూకాన్ని తెస్తుందని గ్రూప్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ తెలిపారు. ప్రీమియం మోటార్ సైకిల్ విభాగంలో తాము ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్నామని, అగ్రస్థానం సాధించడం తమ లక్ష్యమని చెప్పారు.

జొన్నగిరిలో డీజీఎంఎల్ 'పసిడి' వేట

మార్చికల్లా పూర్తి స్థాయిలో ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ త్వరలో భారత పసిడి ఉత్పత్తి మ్యాప్‌లో చేరనుంది. రాష్ట్రంలోని కర్నూలు జిల్లా జొన్నగిరి గనుల నుంచి త్వరలో బంగారం నిక్షేపాల వెలికితీత ప్రారంభం కానుంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఈ గనుల నుంచి పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి ప్రారంభిస్తామని దక్కన్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్) తన తాజా వార్షిక నివేదికలో తెలిపింది. ఈ గనుల్లో పసిడితో కూడిన సిల్వనైట్, కల్వరైట్ ఖనిజ నిక్షేపాలు దాదాపు 65 లక్షల టన్నుల మేరకు ఉన్నట్టు అంచనా. ఈ ఖనిజాలను వెలికి తీయడం ద్వారా జొన్నగిరి గనుల నుంచి ఏటా 750 కిలోల వరకు పసిడి ఉత్పత్తి చేయవచ్చని డీజీఎంఎల్ భావిస్తోంది. జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ (జీఎంఎస్ఐ) అనే కంపెనీతో కలిసి డీజీఎంఎల్ ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఈ ప్రాజెక్టు ఈక్విటీలో డీజీఎంఎల్‌కు 40 శాతం, జీఎంఎస్ఐకి 60 శాతం వాటా ఉంది.

వరద బాధితులకు ఉపశమన చర్యలు

ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వరద బాధిత ఖాతాదారుల కోసం ఎయిర్‌టెల్ పలు ఉపశమన చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా పోస్ట్ పెయిడ్ హోమ్ ఖాతాదారుల బిల్ పేమెంట్ గడువుని వారం రోజుల పాటు పొడిగించింది. ఈ వారం రోజులు, ఈ ఖాతాదారుల ఇళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వైఫై సేవలు అందుతాయి. అలాగే రీచార్జి గడువు ముగిసిన ప్రీపెయిడ్ హోమ్స్ ఖాతాదారుల వ్యాలిడిటీ గడువుని నాలుగు రోజుల పాటు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నాలుగు రోజులు వారి ఇళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వైఫై సేవ అందుతాయి. బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులతో పాటు ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ మొబైల్ వినియోగదారుల రీచార్జి, వ్యాలిడిటీ గడువునీ నాలుగు, ఏడు రోజుల పాటు పెంచినట్టు ఎయిర్‌టెల్ తెలిపింది.

జీఈ పవర్‌తో నవయుగ సెటిల్‌మెంట్

న్యూఢిల్లీ: జీఈ పవర్ ఇండియా-నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌ఈసీఎల్) మధ్య నడుస్తున్న చెల్లింపుల వివాదం కొలిక్కి వచ్చింది. ఈ వివాద పరిష్కారానికి రూ.31.45 కోట్లు చెల్లించేందుకు ఎన్‌ఈసీఎల్ అంగీకరించినట్టు జీఈ పవర్ ఇండియా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం ఎన్‌ఈసీఎల్ ప్రతి మూడు నెలలకు కొంత చొప్పున 2026లోగా అంగీకరించిన మొత్తాన్ని చెల్లిస్తుంది. దీంతో ఆర్బిట్రేషన్ కోర్టులో నడుస్తున్న ఈ కేసును జీఈ పవర్ వెనక్కి తీసుకుంటుంది.

బీఓఐ 'స్టార్ ధన వృద్ధి ఎఫ్‌డీ' పథకం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 'స్టార్ ధన వృద్ధి' పేరుతో కొత్త ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకం ప్రారంభించింది. 333 రోజుల గడువు ఉండే ఈ ఎఫ్‌డీపై 80 సంవత్సరాలు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లకు బ్యాంక్ 7.9 శాతం వార్షిక వడ్డీ రేటు చెల్లిస్తుంది. ఇదే ఎఫ్‌డీపై 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, ఇతరులకు 7.25 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఈ ఎఫ్‌డీ పథకం హామీపై రుణాలు, గడువు కంటే ముందుగానే వెనక్కి తీసుకునే సౌలభ్యం ఉందని బీఓఐ తెలిపింది.

రికార్డుల ర్యాలీకి విరామం



మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: వరుసగా పది రోజులు పరుగు తీసిన సెన్సెక్స్ మంగళవారం కాస్త విరామం తీసుకుంది. ఇంట్రాడేలో 159 పాయింట్ల వరకు క్షీణించిన సూచీ.. చివరికి 4.40 పాయింట్ల నష్టంతో 82,555.44 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో మదుపరులు ఐటీ, మెటల్, ఆయిల్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. కాగా, నిఫ్టీ వరుసగా 14వ రోజూ పాజిటివ్‌గా ముగిసింది. 1.15 పాయింట్ల పెరుగుదలతో 25,279.85 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.54 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో యుటిలిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, టెక్ అర శాతానికి పైగా నష్టపోయాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు తగ్గి రూ.83.96 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 3.75 శాతం తగ్గి 74.62 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ప్రీమియర్ ఎనర్జీస్ బంపర్ లిస్టింగ్

తొలిరోజే 87% ఎగబాకిన షేరు

హైదరాబాద్‌కు చెందిన సోలార్ సెల్, మాడ్యూల్స్ తయారీ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ లిస్టింగ్‌కు మార్కెట్ వర్గాల నుంచి అపూర్వ స్పందన లభించింది. గత వారంలో ఐపీఓ పూర్తి చేసుకున్న ఈ కంపెనీ.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.450తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 120.22 శాతం ప్రీమియంతో రూ.991 వద్ద లిస్టయింది. ఆ తర్వాత 120.76 శాతం వృద్ధిని కనబర్చింది. తర్వాత మళ్లీ తగ్గుతూ వచ్చింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి ప్రీమియర్ ఎనర్జీస్ షేరు 86.58 శాతం లాభంతో రూ.839.65 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.37,849.27 కోట్లుగా నమోదైంది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 50.30 లక్షల షేర్లు చేతులు మారాయి. కాగా, గత గురువారంతో ముగిసిన ప్రీమియర్ ఎనర్జీస్ ఐపీఓకు సైతం ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు ఏకంగా 74.09 రెట్ల బిడ్లు లభించాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ రూ.2,830 కోట్లు సమీకరించింది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.66-70

ఈ నెల 9న ఇష్యూ ప్రారంభం

బజాజ్ ఫైనాన్స్ అనుబంధ విభాగమైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.66-77గా నిర్ణయించింది. బజాజ్ గ్రూప్‌నకు చెందిన ఈ సంస్థ ఐపీఓ ద్వారా రూ.6,560 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది. అందులో తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.3,560 కోట్లు, మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్ వాటాకు చెందిన రూ.3,000 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. కాగా, వాహన విడిభాగాల తయారీదారు క్రాస్ లిమిటెడ్‌తో పాటు టోలిన్స్ టైర్స్ లిమిటెడ్ ఐపీఓలు సైతం ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనున్నాయి. ఐపీఓ ద్వారా క్రాస్ లిమిటెడ్ రూ.500 కోట్లు, టోలిన్స్ టైర్స్ రూ.230 కోట్ల వరకు సమీకరించాలనుకుంటున్నాయి. ఈ రెండు కంపెనీలు తమ ఇష్యూ ధరల శ్రేణిని ఇంకా ప్రకటించాల్సి ఉంది.

జీఐసీలో 6.78 శాతం వాటా విక్రయం

ప్రభుత్వ రంగ బీమా సంస్థ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ ఆర్ఈ)లో కేంద్ర ప్రభుత్వం 6.78 శాతం వాటాకు సమానమైన 11.90 కోట్ల షేర్లను బుధవారం విక్రయించనుంది. షేరు కనీస ధరను రూ.395గా నిర్ణయించింది. తద్వారా కేంద్రానికి రూ.4,700 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. బీఎస్ఈలో జీఐసీ షేరు ధర మంగళవారం 0.13 శాతం తగ్గి రూ.421.25 వద్ద ముగిసింది. ఈ లెక్కన, కేంద్రం కంపెనీ షేరును 6.23 శాతం తక్కువకు విక్రయించనుంది. ప్రస్తుతం జీఐసీలో కేంద్ర ప్రభుత్వం 85.78 శాతం వాటా కలిగి ఉంది.

ఆర్ఐఎన్ఎల్ సీఎండీగా శక్తిమణి



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్-విశాఖ ఉక్కు) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎస్ శక్తిమణి ఎంపికయ్యారు. ప్రస్తుత సీఎండీ అతుల్‌భట్ పదవీ కాలం నవంబరుతో పూర్తి కానుండడంతో కొత్త సీఎండీ ఎంపికకు పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెలక్షన్ బోర్డు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇంటర్వ్యూకు మంగళవారం ఇద్దరు హాజరుకాగా వారిలో శక్తిమణిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఆయన ప్రస్తుతం ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్‌లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శక్తిమణి 1994లో సెయిల్‌లో జూనియర్ మేనేజర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1998 జూలై నుంచి 2016 మే వరకు సుమారు 18 ఏళ్లు ఆర్ఐఎన్ఎల్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆ తర్వాత సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఐదేళ్లు పనిచేసి గత మూడున్నర సంవత్సరాలుగా ట్రావెన్‌కోర్ లిమిటెడ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,720 ▼	66,640 ▼	90,900 ▼
ముంబై	71,494 ▼	65,489 ▼	82,278 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	505
వరంగల్	472	గోదావరి	500
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	92
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

హమ్మయ్య.. శాంతిస్తున్న కృష్ణమ్మ

» ప్రకాశం బ్యారేజీకి భారీగా తగ్గిన వరద

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉగ్ర రూపంతో ఉన్న కృష్ణమ్మ నెమ్మదిగా శాంతిస్తోంది. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద భారీగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం రాత్రి 10 గంటలకు బ్యారేజీలో 6,61,335 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. సోమవారం రికార్డు స్థాయిలో 11,43,201 క్యూసెక్కులు వచ్చిన సంగతి తెలిసిందే. ఒక్కరోజులోనే దరిదాపుగా 5 లక్షల క్యూసెక్కులు తగ్గిపోవడం విశేషం. మొత్తం వరదను 70 గేట్లను పూర్తిస్థాయికి ఎత్తి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అటు ఎగువన శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు కూడా వరద తగ్గింది. శ్రీశైలం డ్యాంకు 4,77664 క్యూసెక్కులు వస్తుండగా.. దిగువకు 3,56,309 క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. సాగర్‌కు సోమవారం 5.40 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 2,39,227 కు తగ్గింది. ఆ వరదను పులిచింతల ప్రాజెక్టుకు వదిలారు. ఇతర కాలువల నుంచి వస్తున్నదానితో కలిపి పులిచింతలకు 3,21,544 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. అక్కడి నుంచి 2.94 లక్షల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీకి వదులుతున్నారు. దీంతోపాటు వాగులు, ఏరుల నుంచి మొత్తం 6.61 లక్షల క్యూసెక్కులు బ్యారేజీకి వస్తోంది.

కృష్ణా పరివాహక ప్రాజెక్టుల్లో ప్రవాహ పరిస్థితి..

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ఆలమట్టి	129.72	126.38	47,000	20,000
నారాయణపూర్	37.64	36.22	20,000	8,272
జూరాల	9.657	8.087	2,00,000	2,09,067
తుంగభద్ర	105.79	99.98	47,911	15,631
శ్రీశైలం	215.807	208.721	4,77,664	3,56,309
నాగార్జునసాగర్	312.05	300.082	3,04155	2,39,227
పులిచింతల	45.77	41.590	3,21,544	2,94,133
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	6,61,335	6,61,335

తగ్గుముఖం పట్టిన వరద

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరద నీరు బయటకు వెళ్లే కొద్దీ పంట మునక శాతం తగ్గుముఖం పడుతోంది. పొలాల్లో ఉన్న నీటిని రైతులు బయట కాలువల్లోకి మళ్లిస్తున్నారు. దీంతో ముంపు ముప్పు తగ్గుతోంది. రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదలకు 20 జిల్లాల్లో 4,31,355 ఎకరాల్లో పంటలు ముంపు బారిన పడ్డాయని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా, మంగళవారం నాటికి దాదాపు 8 వేల ఎకరాలకు ముంపు తప్పింది. తాజా సమాచారం ప్రకారం 16 జిల్లాల్లో 4,23,425 ఎకరాల పంట ఇంకా ముంపులోనే ఉందని గుర్తించారు. అల్లూరి, విజయనగరం, కాకినాడ, ఉభయగోదావరి, కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వరి, పత్తి, అపరాలు, చిరుధాన్యాల వంటి పంటలు ముంపులో ఉన్నాయి. వరి 3.32 లక్షల ఎకరాలు, పత్తి 59,685, మొక్కజొన్న 13,382, మినుములు 6,940, కంది 4,227, పెసర 2,610, వేరుశనగ 2,050, ఇతర పంటలు 2,042 ఎకరాల్లో నీట మునిగినట్లు తేలింది. వరద తగ్గుముఖంతో ఇప్పుడు అవన్నీ బయటపడుతున్నాయి.



విజయవాడలోని ప్రకాశ్‌నగర్‌లో వరద బాధితులను బోటులో తరలిస్తున్న దృశ్యం

సర్వశక్తులు ఒడ్డుతున్నాం

» బాధితుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తాం

» అరగంట ఆలస్యమైనా అందరినీ ఆదుకుంటాం: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విపరీతంగా వచ్చిన వరదలతో ఇబ్బంది పడుతున్న విజయవాడ, పరిసర ప్రాంతాలకు చెందిన బాధితులను ఆదుకొనేందుకు మూడురోజులుగా తన సర్వశక్తులు వొడ్డి పని చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆరు హెలికాప్టర్లు, 30డ్రోన్లు తెప్పించి బాధితులకు ఆహారం అందజేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 32 మంది ఐఏఎస్ అధికారులు విధుల్లో ఉన్నారని, 10 జిల్లాల నుంచి బాధితుల కోసం ఆహారం తెప్పిస్తున్నామని తెలిపారు. మూడు పూటలా ఆహారం అందిస్తున్నామని, చివరి వ్యక్తి వరకూ సాయం అందిస్తామని తెలిపారు. దీనికోసం 179 సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయానికి ఒక సీనియర్ అధికారిని నియమించామన్నారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టే క్రమంలో మూడో రోజు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితుల వద్దకు ట్రాక్టర్లు, వ్యాన్లు, పొక్లెయిన్లు, బోట్లు... ఎలా వెళ్లడానికి సాధ్యమైతే ఆ విధంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..



చంద్రబాబు సమక్షంలో వరద బాధితులకు మంచినీటి బాటిళ్లు ఇస్తున్న దృశ్యం

వరద బాధలు ప్రత్యక్షంగా చూస్తున్నా..

"వరద సహాయకచర్యల్లో పాల్గొంటున్న అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను. వాటిని పాటించకపోతే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోను. ఆహార సరఫరా సమయంలో బాధితులు ఎక్కువగా గుమికూడకుండా ఉంటే వారుండే ప్రాంతానికి తీసుకెళ్లి అందించడం వీలవుతుంది. ఆహార సరఫరా చేపడుతున్న ఒక్కో బోటులో నలుగురు సిబ్బంది, ఒక ఆక్టోపస్, ఒక గ్రేహౌండ్ సిబ్బంది ఉంటారు. ప్రజలకు నష్టం జరిగితే ఊరుకునేది లేదు. రెండు రోజులుగా వరద బాధితులు పడుతున్న బాధలు నేరుగా చూశాను. బిడ్డను బతికించుకోవడానికి భార్యను భర్త వదిలి రావాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో మనం అర్థం చేసుకోవాలి. వారి పట్ల మానవతా దృక్పథంతో పనిచేద్దాం"

బాధితులూ సహకరించాలి

"బాధితులు తమకు వచ్చే ఐవీఆర్ఎస్ కాల్‌కు సరైనరీతిలో స్పందించాలి. ఎక్కడ ఆహారం అందలేదో చెబితే అక్కడికి అధికారులను పంపుతాం. విపత్కర పరిస్థితుల్లో ఉన్నవారు తమ సమాచారం అందించాలి. బాధితుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తాం. వారంతా సంయమనం పాటించాలి. అరగంట ఆలస్యమైనా అందరికీ న్యాయం చేస్తాం. సమాజంలో బాధ్యత కలిగిన వారంతా బాధితులకు అండగా నిలవాలి. భోజనం అందిస్తారా?, పరామర్శించి ధైర్యం చెప్తారా?.. అనేది వాళ్ల ఇష్టం"

వీఆర్‌లో పెడితే పనిచేయరా?

"వీఆర్‌లో పెడితే పనిచేయరా? 'జీతం తీసుకోవడం లేదా? ప్రజలు ఉంటేనే మనం ఉంటాం. కానీ, ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కొందరు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సాయం అందించాలని నేను ఆదేశించినా... క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు పనిచేయడం లేదని బాధితులు చెప్తున్నారు. హుద్‌హుద్ సమయంలో చేసిన సేవలను నాడు ప్రధాని చూసి అభినందించారు. మూడు రోజుల బిడ్డకు పాలు అందకపోతే ఏ తల్లిదండ్రులైనా ఎంత విలవిలలాడిపోతారు? అందుకే మానవతాదృక్పథంతో పనిచేయాలి. సరిగా పనిచేయని అధికారులు రేపటిలోగా తీరు మార్చుకోవాలి. ఇక ఆ తర్వాత మీరే చూస్తారు"

ప్రజల నష్టాలను ఎన్యుమరేట్ చేస్తాం

"వరద వదిలిన ప్రాంతాలను అంటువ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. దానికోసం మెడికల్ పాయింట్లు ఏర్పాటుచేస్తున్నాం. వరద వదిలిన ఇళ్లలోని బురదను తొలగించేబాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుంది. వెయ్యి కుటుంబాలకు ఒకరిచొప్పున సహాయక సిబ్బందిని నియమించి, వారికి సెల్‌ఫోన్ అందిస్తాం. వారు సచివాలయాలవారీగా పర్యవేక్షిస్తారు. ప్రజలకు జరిగిన నష్టాలను ఎన్యుమరేట్ చేస్తాం"

ఐదు నిమిషాలు షో చేసి వెళ్లారు

» జగన్‌ది చెత్త రాజకీయం.. విపత్కాలంలోనూ కుట్రలు:చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ వరద ప్రాంతాలకు వెళ్లి ఐదు నిమిషాలు షో చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. "కనీసం ఒక్కరికైనా ఒక పొట్లం ఆహారం అందించారా? కనీసం ఒక్కరినైనా రక్షించారా? కనీసం పలకరించారా?" అని ప్రశ్నించారు. వరదల సమయంలోనూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "కొందరు చెత్త రాజకీయాలు చేస్తున్నారు. ప్రజాహితం కోసం ఎవరైనా పనిచేయాలి. కానీ, ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. సహాయకచర్యలకు భంగం కలిగించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలను సహించేది లేదు. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. మీడియాకూడా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి" అని చంద్రబాబు హితవు పలికారు. వర్షం పడి ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే గుడ్లవల్లేరు కాలేజీ సమస్య అంటూ తన కేంద్రీకరణను దెబ్బతీయాలని చూస్తున్నారని మండిపడ్డారు. సిగ్గుంటే ఇలా మాట్లాడతారా అని మండిపడ్డారు. ఐదేళ్లు వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, అధికారులు పని చేయడం మానేశారని, ఇదంతా తనకు కొత్తగా ఉందని చంద్రబాబు అన్నారు. "ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. జక్కంపూడిలో ఓ అధికారిని సస్పెండ్ చేశాం" అని పేర్కొన్నారు.

బోట్ల ఉదంతంపై విచారణ జరిపిస్తాం

"ప్రకాశం బ్యారేజీకి కొట్టుకొచ్చిన బోట్ల ఉదంతంపై విచారణ చేపడతాం. బోట్లు తగిలిన చోట్ల పిల్లర్ దెబ్బతింది. ఫుడ్ పాయిజన్ చేస్తున్నారు. బాబాయ్‌ని చంపి నారాసుర రక్తచరిత్ర అని వార్తలు రాసినవాళ్లపై ఇలాంటి అనుమానాలు వచ్చి తీరుతాయి. దుర్మార్గుల నుంచి ప్రజల్ని కాపాడుకుని మనం ముందుకెళ్లాలి. ఏ స్థాయిలో తప్పు జరిగినా ఉపేక్షించబోను. నిన్న, మొన్న కొందరు అధికారులు సరిగా పనిచేయలేదు. ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్నారనేది గుర్తుంచుకోవాలి. సమాజానికి తప్పుడు సంకేతాలిచ్చి పరువు పోగొట్టుకోవద్దు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి" అని సూచించారు.



ప్రకాశ్‌నగర్‌లో పాల ప్యాకెట్ల కోసం వరద బాధితుల పాట్లు

వీలైనంత త్వరగా సాధారణ స్థితికి

» వరద చర్యలు ముమ్మరం : మంత్రులు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద సహాయక చర్యలు ముమ్మరమయ్యాయని, పరిస్థితులు వీలైనంత త్వరగా సాధారణ స్థితికి చేరుకుంటాయని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో ప్రజలు వరదతో చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. గత 200ఏళ్లలో ఇంత వర్షం, వరద కృష్ణానదికి గానీ చిన్న నదులకు గానీ, విజయవాడలో గానీ రాలేదని గుర్తుచేశారు. పరిస్థితులు మారే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని సీఎం చంద్రబాబు చెప్పారని తెలిపారు. అంతా సమన్వయంతో పనిచేయడం వల్ల ప్రాణనష్టాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించగలిగామని చెప్పారు. వరద ఉధృతికి పడవలు, ట్రాక్టర్లు కూడా బోల్తాపడ్డాయన్నారు. హెలికాప్టర్‌కు కూడా వాతావరణం అనుకూలించలేదని, క్షేత్రస్థాయిలో 30 డ్రోన్‌లు పనిచేస్తున్నాయని అన్నారు. ఆహారం కావాల్సినంత ఉందని, రాత్రికి 10 లక్షల ఆహార పొట్లాలు అందిస్తామని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా కోసం జిల్లాల నుంచి 500 ట్యాంకర్లు బుధవారం ఉదయానికి నగరానికి వస్తున్నాయని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు 10 లక్షల పాకెట్ల పాలు సరఫరా చేస్తామని తెలిపారు. వరద తగ్గాక పారిశుధ్యం, ఆరోగ్యంపై దృష్టి పెడతామని అన్నారు. 3వేల మంది అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమై ఉండగా, 10వేల మంది సిబ్బందిని వివిధ కార్పొరేషన్ల నుంచి తీసుకొచ్చామని నారాయణ వివరించారు. కాగా, విజయవాడలోని చాలా ప్రాంతాలు ఇప్పుడిప్పుడే వరద ప్రభావం నుంచి బయటపడుతున్నాయని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాత్రింబవళ్లు ప్రభుత్వ యంత్రాంగం శ్రమిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వివిధ ప్రాంతాల్లో మంత్రులు పర్యటిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటికీ ఆహారం అందేలా ప్రతి సచివాలయానికి ఒక అధికారిని నియమించి వారి ద్వారా సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం నుంచి 6.5 లక్షల అల్పాహారం పొట్లాలు, మధ్యాహ్నం 8.20 లక్షల ఆహార పొట్లాలు అందించామని తెలిపారు. వరద ఉధృతి తగ్గేవరకు సహాయ చర్యలు కొనసాగిస్తామని పయ్యావుల స్పష్టం చేశారు. కాగా, వరద బాధితులను ప్రభుత్వం అన్నీ విధాలా ఆదుకుంటుందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పంట నష్టాలను అంచనా వేసి ప్రతి రైతును ఆదుకుంటామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రతి బాధితుడికీ అండగా నిలుస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

కడుపు నింపుతూ.. భరోసా కల్పిస్తూ..

» వరద ముంపు ప్రాంతాల్లో మంత్రుల పర్యటన

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరదల నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాధితులకు భరోసా కల్పిస్తున్నాయి. బాధితులకు మరిన్ని సేవలు అందించే లక్ష్యంతో మంత్రులకు నగరంలోని పలు డివిజన్లను సీఎం కేటాయించారు. మంగళవారం నగరంలోని 45, 46, 47 డివిజన్లలో మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా పర్యటించారు. జేసీబీపై వెళ్లి బాధితులకు తాగునీరు, పాలు, ఆహార పదార్థాలు అందించారు. మరో మంత్రి సవిత 54, 55, 56 డివిజన్లలో సుడిగాలి పర్యటన చేశారు. 55వ డివిజన్‌లో సెంటర్‌లో పర్యటన సందర్భంగా నిస్సహాయులుగా నిల్చున్న ముగ్గురు దివ్యాంగులను గుర్తించి.. వారిని పునరావాస కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. కాగా, జగన్ బురద రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మంత్రి డోలా మండిపడ్డారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, కొండపల్లి, విజయవాడల్లో పర్యటించారు.

లంకగ్రామాలకు అండగా ఉంటాం: మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 3: వరద ఉధృతి తగ్గేవరకు లంక గ్రామాల ప్రజలకు అండగా ఉంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. మంగళవారం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం పరిధిలోని వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులతో కలసి పర్యటించారు. కృష్ణానదికి వరద నీటి ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

బుడమేరుకు గేట్లా?: మంత్రి అచ్చెన్న

'మతిస్థిమితం ఉండే మాట్లాడుతున్నావా జగన్?' అంటూ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'బుడమేరుకు గేట్లు ఉన్నాయా? అవి చూడటానికి ప్రజలు వచ్చారా? ఏ రోజైనా ప్రజల మధ్యకు వచ్చావా.. వాస్తవాలు తెలియడానికి?' అంటూ నిలదీశారు. కాగా, విజయవాడ 45వ డివిజన్‌లో సీఎం చంద్రబాబు మంగళవారం వరద బాధితులకు సహాయ చర్యలను పర్యవేక్షించారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కూడా ఆయన వెంట ఉన్నారు. ఈ డివిజన్‌లో బాధితులకు అందుతున్న సహాయ చర్యలను విజయానంద్ పర్యవేక్షిస్తారంటూ ఆయన్ను నోడల్ అధికారిగా చంద్రబాబు ప్రకటించారు. ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి కూడా పాల్గొన్నారు.

వరద నిందను కూటమి నాపై వేస్తోంది

» బాబు పర్యటన ప్రచార ఆర్భాటమే : జగన్

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): "విజయవాడ వరద నిందను కూటమి ప్రభుత్వం నాపై వేస్తోంది" అని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వరద బాధితుల సహాయం కోసం ఆయన రూ.కోటి ప్రకటించారు. "అది ఏ రూపంలో ఇస్తానో పార్టీ నేతలతో సంప్రదించి వెల్లడిస్తా. వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన ప్రచారార్భాటమే తప్ప.. బాధితులకు సాయం అందటంలేదు. సోమవారం నేను బాధితులను పరామర్శించిన సమయంలో ప్రభుత్వం నుంచి సాయం అందలేదని చెప్పారు. ఎగువ నుంచి వరదతో పాటు భారీ వర్షం కారణంగానే వరద వచ్చిందని ప్రభుత్వం చెప్పడం కరెక్టు కాదు. వైసీపీ సర్కారు అధికారంలో ఉన్నప్పుడు కూడా 38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. జలాశయాలు ఎప్పటికప్పుడు ఖాళీ చేసి ఉంటే విజయవాడకు వరద ముప్పు వచ్చేది కాదు. ప్రభుత్వ తప్పిదం వల్లే జరిగిన ఘటనను నాపై వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నాయకులు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో లక్ష లీటర్ల పాలు, మంచినీళ్ల బాటిళ్లను సరఫరా చేయాలి" అని జగన్ ఆదేశించారు.

3 జిల్లాలకు, రాజమండ్రి నగరానికి వైసీపీ అధ్యక్షుల నియామకం

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) మూడు జిల్లాలకు, రాజమండ్రి నగరానికి వైసీపీ అధ్యక్షులను జగన్ నియమించారు. అనంతపురం జిల్లా అధ్యక్షునిగా అనంత వెంకటరామిరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షునిగా పెనుగొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షునిగా చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ, రాజమండ్రి నగర అధ్యక్షునిగా మార్గాని భరత్‌రామ్‌లను నియమించారు.

జగన్ మాటలు విడ్డూరం

» మంత్రులు అనగాని, గొట్టిపాటి

రేపల్లె, సెప్టెంబరు 3: గత పాలకుల వైఫల్యం వల్లే వరద నీరు కరకట్టపైకి చేరుతోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం వరద పరిస్థితిపై ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెలికాప్టర్‌లో తప్ప స్వయంగా ముంపు ప్రాంతాలకు వచ్చి ప్రతిపక్షనేత ఎప్పుడైనా ప్రజలను పలకరించాడా అని ప్రశ్నించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ లంక గ్రామాల్లో వరదలకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.



రేపల్లె మండలం పెనుమూడిలో వరద సహాయక శిబిరంలో మంత్రులు అనగాని, గొట్టిపాటి

అత్యంత భయానకం

బుడమేరు చరిత్రలోనే రికార్డు వరద

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

బుడమేరు, దిగువన కొల్లేరు ప్రాంతంలో ఇష్టానుసారం ఆక్రమణలకు గురి కావడం... చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా బుడమేరుకు అత్యంత భారీగా వరద పోటెత్తడం... ఫలితంగా బుడమేరు వరద ప్రవాహం వేగం తగ్గి, దిశ మార్చుకోవడంతో గతంలో ఎప్పుడూ చూడనంతగా విజయవాడ ప్రాంతం ముంపునకు గురైంది. బుడమేరుకు అత్యధికంగా 45 వేల క్యూసెక్కుల వరద రాగా, దిగువకు 40 వేల క్యూసెక్కులకు పైగా వరద ముంచెత్తింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ నుంచి కేవలం 5 వేల లోపు క్యూసెక్కుల నీటినే కృష్ణా నదిలోకి పంపారు. కానీ కృష్ణా నదికి కూడా గరిష్ఠ స్థాయిలో వరద రావటంతో వెలగలేరు రెగ్యులేటరీ నుంచి బుడమేరు వరద ఆశించిన స్థాయిలో వెళ్లలేదు. దిగువకు 40 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చిందని భావిస్తున్నారు. దీంతో బుడమేరు వరద విజయవాడ నగరంపై దండెత్తింది.

బుడమేరుకు వచ్చిన వరదలు (క్యూసెక్కులలో)

సంవత్సరం	మొత్తం వరద	దిగువకు వరద (డైవర్షన్ పోను)
9.9.1962	8,823	2,923
22.8.1963	12,318	6,166
22.9.1964	39,595	28,470
19.5.1969	26,080	18,580
21.8.1971	3,722	3,196
10.8.1976	17,009	14,784
31.7.1978	22,452	16,302
6.10.1983	13,850	9,600
13.8.1986	20,000	13,200
23.7.1989	34,996	24,371
11.5.1990	32,273	24,473
23.9.1991	26,072	18,572
24.8.2020	11,549	3,699
20.9.2005	24,945	14,000
10.8.2009	17,000	7,100
31.8.2024	45,000	40,000

గతంలో ఆరుసార్లు వరద

బుడమేరు చరిత్రలో ఎన్నడూ వరద ప్రభావానికి గురి కాని గన్నవరం ప్రాంతం తొలిసారిగా ఇప్పుడు ముంపునకు గురైంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఈ ప్రాంతానికి వరద పోటెత్తింది. గూడవల్లి, నిడమానూరు, కేసరపల్లి, వెంకట నరసింహాపురం, సావారిగూడెం, పురుషోత్తపట్నం, ముస్తాబాద, దోనె ఆత్కూరు గ్రామాలు బుడమేరు ముంపునకు గురయ్యాయి. 1964లో బుడమేరుకు అత్యధికంగా 39,595 క్యూసెక్కుల వరద రాగా కృష్ణా నదికి డైవర్షన్ పోను దిగువకు 28,470 క్యూసెక్కుల వరదను విడుదల చేశారు. ఈ సారి అంతకుమించి ఏకంగా 45 వేల క్యూసెక్కుల వరద బుడమేరుకు వచ్చింది. ఇప్పటివరకు బుడమేరుకు 6 సార్లు భారీగా వరదలు వచ్చాయి. ప్రస్తుత వరదతో కలిపితే ఏడోది. కాగా, బుడమేరు ప్రవాహానికి అవాంతరాలు ఏర్పడటంతో దిశ మార్చుకుని గన్నవరం నియోజకవర్గంపై ప్రభావం చూపించింది. చాలా గ్రామాలలోకి భారీగా వరద చేరింది. లోతట్టు ప్రాంతాల ఇళ్లన్నీ వరదనీటిలో దిగ్బంధమయ్యాయి. తొలిసారి జాతీయ రహదారి-16 ముంపులో చిక్కుకుంది. నిడమానూరు జలదిగ్బంధమైంది. వేలాది ఎకరాల పంట పొలాలు వరద ముంపునకు గురయ్యాయి. వరి పంట అంతా కొట్టుకుపోయింది.

30 ఏళ్లుగా ఆక్రమణలు

భారీ ముంపు ప్రమాదం ఏర్పడటానికి బుడమేరు ప్రాంతం ఆక్రమణలకు గురికావటం కూడా ప్రధాన కారణమని తెలుస్తోంది. బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), దాని బఫర్ జోన్ (బీజడ్) దాటి ఆక్రమణలు పెరిగిపోవటం, రానురానూ అవి కాలనీలుగా రూపాంతరం చెందటం వల్ల బుడమేరు కుంచించుకుపోతూ వస్తోంది. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ ఏర్పాటు తర్వాత గత మూడు దశాబ్దాలుగా బుడమేరు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురి అవుతూ వస్తోంది. హెడ్ రెగ్యులేటరీ వల్ల వరదలు రావన్న ధైర్యంతో పేదలు ఆక్రమణలు చేపట్టారు. ఆ తర్వాత అవి చేతులు మారి, క్రయ విక్రయాలు జరిగాయి. స్థానిక యంత్రాంగాలు మౌలికసదుపాయాలు కల్పించటంతో కాలనీలు విచ్చలవిడిగా విస్తరించాయి. బుడమేరు ప్రవాహం దిశలు మార్చుకోవటానికి ఇదే కారణమని తెలుస్తోంది. గన్నవరం ప్రాంతం తొలిసారి వరద ముంపునకు గురికావడానికి కూడా ఇదే కారణం. కొల్లేరు సరస్సు దగ్గర ఆక్రమణలు కూడా బుడమేరు ప్రవాహానికి అవాంతరంగా మారుతోందని తెలుస్తోంది. బుడమేరు వరద అంతా కొల్లేరులోనే కలుస్తుంది. అయితే కొల్లేరులోకి ప్రస్తుతం వరద వెళ్లటం కష్టంగా ఉంటోంది. ఎగువ నుంచి బుడమేరు వేగంగా వస్తుండటం, దిగువన నిదానంగా వెళ్లటం వల్ల నిడమానూరు దిగువ ప్రాంతంలో బుడమేరు కాలువ పంటపొలాల మీదకు ఉప్పొంగి కృష్ణా జిల్లాలోని అనేక ప్రాంతాలను ముంచెత్తింది. వరద ఇంకా ఏయే ప్రాంతాలకు విస్తరిస్తుందో బుధవారం నాటికికానీ తెలిసే పరిస్థితి లేదు. కొల్లేరులో బుడమేరు కలిసే ప్రాంతం దగ్గర ఉన్న ఆక్రమణల కారణంగానే ప్రవాహవేగానికి అడ్డుకట్ట పడిందని తెలుస్తోంది. ఈ కారణంగానే బుడమేరు పొంగుతోందని స్థానిక రైతులు చెబుతున్నారు. కొల్లేరు దిగువ సముద్రంలో కలిసే చోట కూడా అవాంతరాలు ఉన్నాయని తెలుస్తోంది.

బుడమేరుకు గండి పడిన ప్రాంతమిదే.
ప్రస్తుతం ఈ గండ్లను పూడ్చే పనులు సాగుతున్నాయి





మోకాలు లోతు నీళ్లలో పాత వాటర్ ట్యాంకును విరగ్గొట్టి అందులో పిల్లలను కూర్చోబెట్టి తీసుకెళ్తున్న దృశ్యం



రాజీవ్‌నగర్‌లో కర్రనే డోలీగా మార్చి వృద్ధురాలిని తరలిస్తున్న యువకులు



డాబాకొట్టు సెంటర్‌లో మోకాలు లోతు వరద నీటిలో వెళ్తున్న గర్భిణి

కష్టాలు.. కన్నీళ్లు



వైఎస్సార్ కాలనీలో మిద్దెపై ఉన్న మహిళకు నిత్యావసరాలు అందిస్తున్న యువకుడు

(మొదటి పేజీ తరువాయి)

అన్నీ ఉన్నా నీళ్ల లేవు. పాలు లేవు. కరెంటు లేదు. మూడు రోజులుగా ఆహారం, నీరు లేక నీరసించడంతో బతుకు కాపాడుకునేందుకు... ప్రాణాలకు తెగించి వరద బాధితులే వరద నీళ్లలో బయటకు వచ్చారు. మెడలోతు, నడుములోతున్న నీళ్లలో కర్రలు ఆసరాగా చేసుకుని, ఒకరి చేతులు మరొకరు పట్టుకుని ఒడ్డుకు చేరుతున్న వారు కోకొల్లలుగా కనిపించారు. ఎన్డీఆర్, ఎస్డీఆర్ఎఫ్, బోట్లు, మర బోట్లు అని అధికారులు చాలానే చెబుతున్నారు. ఇతర జిల్లాల నుంచి బోట్లు వచ్చినా వాటిని కిందికి దించలేదు. ఉన్న అరకొర బోట్లనే తిప్పుతున్నారు. దీంతో.. చాలామంది బాధితులే నానా తంటాలు పడుతూ ఒడ్డున పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, పక్షవాతంతో మంచం పట్టిన వారిని కూడా బయటికి తీసుకురాలేని దైన్యం నెలకొంది. ఫలానా చోట పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి ఉన్నాడు. దయచేసి బోటునో, ట్రాక్టర్‌నో పంపించి ఆదుకోండి అని స్వయంగా జిల్లాస్థాయి అధికారులకు చెప్పినా ఫలితం లేకపోయింది. ఫ్రిజ్ డోర్లు విరిచి పెద్దవాళ్లను అందులో పడుకోబెట్టి వరద దాటిస్తుండటం... సన్నిహితులు పంపిన గాలి నింపిన ట్యూబుల సహాయంతో బయట పడటం... థర్మోకోల్ షీట్లను పడవలుగా, లైఫ్‌జాకెట్లుగా మార్చుకోవడం... వంటి హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. కొంతమంది ఏకంగా రెండు-మూడు కిలోమీటర్లు నీళ్లలో నడుస్తూ బయటికి వచ్చారు. చలితో వణికి పోయారు. చాలామంది ఆహారం, నీరు లేక బలహీనంగా కనిపించారు.

ఎన్డీఆర్ఎఫ్‌కు ఏదీ సహకారం...

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) చురుగ్గా వ్యవహరిస్తూ సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నా... స్థానిక యంత్రాంగం నుంచి మార్గ నిర్దేశం కరువైంది. స్థానిక భౌగోళిక పరిస్థితులు తెలియకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గందరగోళ పడ్డాయి. అయినప్పటికీ... చూస్తూ ఊరుకోలేక తామే స్వయంగా వరదలోకి బోట్లతో వెళ్లి వీలైనంత సహాయం చేస్తున్నారు. ఇక... నేవీ హెలికాప్టర్లు అపార్ట్‌మెంట్లపైన మాత్రమే ఆహారం జారవిడుస్తున్నాయి.

30 శాతం దాటని సాయం...

వరద ముంపులో చిక్కుకున్న ప్రాంతంలో 30 శాతం ప్రాంతానికి మాత్రమే ఆహారం, మంచినీళ్లు అందించినట్లు అంచనా. ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న వారిని మినహాయిస్తే... లోపలున్న వారికి గత మూడు రోజులుగా ఆహారం అందలేదు. కనీసం మంచినీళ్లు కూడా అందలేదు. అష్టకష్టాలు పడుతూ బయటకు వచ్చిన బాధితుల్లో ఎవరిని పలకరించినా మూడు రోజులుగా తమకు ఆహారం, మంచి నీళ్లు అందలేదని వాపోయారు. వరద నుంచి బయటకు వచ్చే వారికి ఆహారం ఇస్తున్నారే తప్ప... బయటకు రాలేని వారికి బోట్ల మీద వెళ్లి ఇచ్చే ప్రయత్నాలు సరిగా జరగడంలేదు. అంబాపురం, కండ్రిక, పీఅండ్‌టీ కాలనీ, ఇందిరానాయక్ కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ తదితర లోతట్టు దూర ప్రాంత వాసులు మూడు రోజులుగా మంచినీరు కూడా లేకుండా విలవిల్లాడిపోతున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఆహారాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. ఆహారం పాడైపోతోందని, బాధితులకు పంచాలని ఇక్కడి అధికారులకు ఆయా జిల్లాల అధికారులు ఫోన్ చేసినా స్పందన కనిపించడంలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కళ్లముందే కనిపిస్తున్నా... 'ఆహారం తీసుకుని పంపిణీ చేయడం మా వల్ల కాదు. అది మా బాధ్యత కాదు' అని తేల్చి చెబుతున్నారు.

మరణ వేదన...

మృతదేహాలను తరలించడంపైనా అదే నిర్లక్ష్యం. సింగ్‌నగర్‌లో ఉండే పద్మావతి అనే మహిళ గుండెపోటుతో మరణించారు. ఎంత బతిమలాడినా మృతదేహాన్ని బయటకు తెచ్చేందుకు బోట్ల సిబ్బంది ససేమిరా అన్నారు.. చివరికి ఆమె భర్త తోపుడు బండి మీద మృతదేహాన్ని పెట్టి.. 3 కిలోమీటర్లు వరదలో తీసుకుని వచ్చారు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్ రోడ్డు సమీపంలోని ఏ1 టీ స్టాల్ దగ్గరకు 2 రోజుల కిందట ఓ మృతదేహం కొట్టుకు వచ్చింది. మృతదేహం ఉబ్బిపోయి దుర్వాసన వస్తున్నా అదే పరిస్థితి. ఉడా కాలనీలో మూడేళ్ల చిన్నారి వరదనీటిలో పడింది. మంగళవారం ఉదయం డ్రెయినేజీలో పాప మృతదేహం కనిపించింది. కొత్త రాజరాజేశ్వరిపేటలో పెద్దాభక్తుని నాయుడు, చీపురుపల్లి నాయుడులు వరదలో పడి చనిపోయారు. మృతదేహాలను తరలించాలని అధికారులను కోరినా ఫలితం లభించలేదు. స్థానిక టీడీపీ నాయకుడు ఎరుబోతు రమణారావు ఆ మృతదేహాలను తరలించారు.

ఫ్లైఓవర్ దాటని సాయం

ప్రస్తుతానికి వరద సహాయం మొత్తం అజిత్‌సింగ్ నగర్ ఫ్లైఓవర్‌కు పరిమితమవుతోంది. ఆహారంతో వచ్చిన వాహనాలు ఫ్లై ఓవర్ మీదనే ఆగిపోతున్నాయి. బాధితులకు అక్కడే ఆహార పొట్లాలు అందిస్తున్నారు. అందులోనూ ఒక తీరూ తెన్నూ లేదు. ఫ్లై ఓవర్ మీద ఆహార ప్యాకెట్లు చిందర వందరగా పడి ఉన్నాయి. వరద లోపల ఎంతో మంది ఆకలితో అలమటిస్తుండగా... బయట ఇలా వ్యర్థమవుతోంది.

కలెక్టర్ ఎక్కడ??

కీలకమైన సమయంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పనితీరు మొక్కుబడిగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్‌కు ఫోన్లు చేసినా స్పందించటం లేదని, కంట్రోల్ రూమ్ శుద్ధ దండగ అని బాధితులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి వస్తే తప్ప ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సహాయక చర్యలను పర్యవేక్షించటానికి క్షేత్రస్థాయికి రావటం లేదని చెబుతున్నారు. అధికార యంత్రాంగంకంటే... టీడీపీ, జనసేన, సీపీఎంనేతలు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులే బాగాపని చేస్తున్నారనే అభిప్రాయం వినిపిస్తోంది.

చేష్టలుడిగిన పోలీసు

రెండు లక్షల మందికి పైగా ఉన్న వరద బాధితులను రక్షించాల్సిన చోట పోలీసు యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బుడమేరు బ్రిడ్జి దాటిన తర్వాత సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీద భారీ సంఖ్యలో పోలీసు వాహనాలు, ఆహార వాహనాలు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. ఇది సహాయ చర్యలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఫ్లైఓవర్ ప్రాంతాన్ని ఫ్రీ జోన్ చేయాలని, అప్పుడే సహాయక చర్యలు చేపట్టగలమని మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం నగర పోలీసు కమిషనర్‌కు వాకీటాకీలో పదేపదే చెప్పారు. మంగళవారం ఈ పరిస్థితి ఇంకాస్త ఎక్కువైందే తప్ప తగ్గలేదు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌ను ఖాళీ చేస్తే తప్ప సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

ఫోన్ల మూగనోము

గత మూడు రోజులుగా వరద ప్రాంతంలో విద్యుత్ లేకపోవటంతో చాలా మంది ఫోన్లు స్విచ్చాఫ్ అయిపోయాయి. సాయం కోరే దారీ లేకుండా పోయింది. విద్యుత్ లేకపోవటంతో సెల్ టవర్లు కూడా పనిచేయడంలేదు. జనరేటర్ల ద్వారా వాటిని నడిపించేందుకు డీజిల్ పంపించినా... టవర్ల దాకా చేరే మార్గం కనిపించడంలేదు.



సింగ్‌నగర్ డాబా కొట్టు సెంటర్‌లో చిన్న పిల్లలను పవర్ బోట్‌లో తరలిస్తున్న సహాయ సిబ్బంది



మృతదేహాన్ని రిక్షాపై తరలిస్తున్న కుటుంబ సభ్యులు



జనం, వాహనాలతో నిండిపోయిన సింగ్‌నగర్ వంతెన. దీంతో బయట నుంచి సహాయ సామగ్రితో వచ్చిన వాహనాలకు దారి లేకుండా పోయింది

154 మంది గర్భిణీలు సురక్షిత ప్రాంతాలకు

- పునరావాస కేంద్రాలకు అనుబంధంగా 14 వైద్య శిబిరాలు: కృష్ణబాబు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో తదుపరి పది రోజుల్లో ప్రసవించే 154 మంది గర్భిణీలను ఆరోగ్యశాఖ సురక్షిత ప్రాంతాలకు చేర్చిందని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం తెలిపారు. వరద విపత్తు వేళ.. బాధితులకు అత్యవసర సేవలందించేందుకు ఆరోగ్యశాఖ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పునరావాస కేంద్రాలకు అనుబంధంగా 14 వైద్య శిబిరాలు, అదనంగా 20 సంచార వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరాల ద్వారా ఇప్పటి వరకూ 17,538 మంది రోగులు వైద్య సేవలు అందుకున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. విజయవాడ నగరంలో 32 వార్డులు జల దిగ్బంధంలో చిక్కుకొన్న దృష్ట్యా అందరికీ ఆరు రకాల అత్యవసర మందులతో కూడిన 75 వేల మెడికల్ కిట్లను హెలికాప్టర్లు, బోట్ల ద్వారా అందించామన్నారు. మరో పాతిక 108 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామన్నారు. వరదల కారణంగా వ్యాధులు పెరిగి ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల కోసం అదనంగా 100 పడకలు ఏర్పాటు చేశామన్నారు. సంక్రమిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విస్తారమైన వైద్య సహాయక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సూచనలు, సలహాల కోసం ఉన్నతాధికారులతో 10 బృందాలు, ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామని చెప్పారు.

బాధితులకు సాయం అందితీరాలి: డీజీపీ

వరదల్లో చిక్కుకున్నామని, సాయం అందలేదని ఏ ఒక్కరూ చెప్పకుండా చివరి ప్రాంతం వరకూ వెళ్లి సహాయం అందించాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు పోలీసు సిబ్బందికి సూచించారు. నిఘా విభాగం అధిపతి మహేశ్ చంద్ర లడ్డా, ఏపీఎస్పీ బెటాలియన్స్ చీఫ్ ఆర్కే మీనా, ఐజీ వినీత్ బ్రిజిలాల్‌తో కలిసి ఆయన మంగళవానం సింగ్ నగర్, ఆర్ ఆర్ పేట ప్రాంతాల్లో పర్యటించారు. పలుచోట్ల ప్రజలతో మాట్లాడిన డీజీపీ వారికి సాయం చేయాల్సిందిగా పోలీసుల్ని ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని బోట్లపై సింగ్‌నగర్ వంతెన ప్రాంతానికి తరలించే చర్యల్ని పర్యవేక్షించారు. అయితే తాము బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లేందుకు ఎలాంటి రవాణా సౌకర్యం లేదని బాధితులు డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన వెంటనే అవసరమైనన్ని ఆర్టీసీ బస్సుల్ని రప్పించి బాధితులను పంపించారు.

ఆపదలో దోపిడీ

- బెజవాడ వరద ప్రాంతాల్లో ధరలు ఆకాశానికి
- పాల ప్యాకెట్ రూ.100... కోడిగుడ్డు ధర 10
- కిలో బియ్యం 100 పైనే.. కూరగాయలు డబుల్
- సెల్‌ఫోన్ చార్జింగ్‌కు గంటకు 50 వసూలు
- ఇళ్ల నుంచి ప్రజలను తరలించాలంటే వేలల్లోనే

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చుట్టూ వరద నీరు.. తాగడానికి మాత్రం మంచి నీళ్ల లేవు.. పాల ప్యాకెట్లు దొరకడం లేదు.. కరెంట్ లేదు.. కూరగాయలు లేవు.. విజయవాడలో వరద ముంపు ప్రాంతాల ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొందరు వ్యాపారులు దీన్ని అవకాశంగా తీసుకుని, మానవత్వం మరిచి బురద వ్యాపారం మొదలుపెట్టారు. అరలీటరు పాల ప్యాకెట్‌ను రూ.వందకు విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.80 చేసేశారు. అన్నిరకాల కూరగాయల ధరలు రెట్టింపు చేశారు. బియ్యం కిలో రూ.వందకు పైగా అమ్ముతున్నారు. కోడిగుడ్డును రూ.పది చేశారు. విజయవాడలోని భవానీపురం, చిట్టినగర్, వన్‌టౌన్, సింగ్‌నగర్, రాజరాజేశ్వరీపేట తదితర ప్రాంతాలను బుడమేరు వరద ముంచెత్తింది. శనివారం నుంచి సోమవారం వరకు ఈ ప్రాంతాల ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. మంగళవారం వరద కొంత తగ్గడంతో నిత్యావసర వస్తువుల కోసం బయటికొచ్చారు. వ్యాపారులు దీన్ని ఆసరాగా తీసుకుని ధరలు అమాంతం పెంచేశారు. ప్రజలు ఎవరైనా ప్రశ్నిస్తే... తాము ఎంతో కష్టపడి తెస్తున్నామని, ఈ ధరలు లేకపోతే గిట్టుబాటు కాదంటూ అడ్డగోలుగా వాదిస్తున్నారు. గత రెండు రోజులుగా భారీ వరదలతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినందున సెల్‌ఫోన్లలో చార్జింగ్ అయిపోయింది. కొందరు దీన్ని కూడా వ్యాపారంగా మార్చి గంట చార్జింగ్‌కు రూ.50 చొప్పున వసూలు చేశారు. మంగళవారం వరద తగ్గుముఖం పట్టడంతో చాలామంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లే ప్రయత్నాలు మొదలుపెట్టారు. రోడ్లలో మోకాళ్ల లోతు వరకూ నీళ్లు ఉండటంతో ప్రధాన రహదారులకు రాలేని పరిస్థితి. దీన్ని కూడా అవకాశంగా తీసుకుని ట్రాక్టర్లు, పడవల ద్వారా బాధితులను ప్రధాన రోడ్లకు చేర్చడానికి దూరాన్ని బట్టి ఒక్కొక్కరికి రూ.2, 3 వేలు వసూలు చేశారు.

విపత్తులో అండగా..

'ఇంట్లో చిన్న పాప ఉంది. ఒక్క పాల ప్యాకెట్ ఇవ్వండి' అంటూ సింగ్‌నగర్‌లో ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేసిన వీడియో ఎంతోమందిని కలచివేసింది. అధికార యంత్రాంగాన్ని మరింత వేగంగా కదిలించింది. రాష్ట్రంలోనే కాదు ఎక్కడెక్కడో ఉన్న తెలుగు ప్రజలు విపత్తును చూసి చలించిపోయారు.

చీకట్లో లంక గ్రామాలు

- ఆహారం, తాగునీరు అందక ఇబ్బందులు

తెనాలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణానది శాంతించి వరద ప్రభావం తగ్గుముఖం పడుతోంది. అయితే.. నీటి కష్టాలు మాత్రం ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. కొన్ని ఇళ్లు వరద ముంపు నుంచి బయటపడుతుంటే, మరికొన్ని ఇళ్లు ఇంకా నడుంలోతు నీటిలోనే ఉన్నాయి. నీరు బయటకు పోయిన ఇళ్లలో బంకమట్టి పేరుకుపోయి, దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు విద్యుత్ సరఫరా లేకపోవటంతో కటిక చీకటిలోనే గుంటూరు లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గత మూడు రోజులుగా కృష్ణా నదికి వరద ఉధృతి పెరగటంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువనున్న లంక గ్రామాలు, నది వెంబడి ఉన్న గ్రామాలు వరద నీటిలో మునిగిపోయాయి. సోమవారం వరకు 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తే, మంగళవారానికి 7.24 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గింది. బుధవారానికి వరద మరింత తగ్గుతుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు చెబుతున్నారు. అయితే లంక గ్రామాల్లో మాత్రం ఇంకా వరద ముంపు అంత వేగంగా తగ్గటంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువన తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కరకట్టకు లోపల ఉన్న ఊళ్లన్నీ వరద ముంపునకు గురయ్యాయి. ప్రధానంగా కొల్లిపర మండలం బొమ్ముువానిపాలెం, అన్నవరపులంక, కొత్తూరులంక, మరికొన్ని లంకలు, కృష్ణా జిల్లాకు చెందిన కనిగిరిలంక, కొల్లూరు మండలంలోని మరో 11 లంక గ్రామాలు, భట్టిప్రోలు మండలంలోని మరికొన్ని లంకలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. నాలుగు రోజులుగా వరద నీటిలో ఇళ్లు మునిగి ఉండటం, గోడలు నానిపోయి ఉండటంతో ఏ ఇల్లు ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. మరోవైపు, విద్యుత్తు సరఫరా లేకపోవటంతో కష్టాలు మరింత పెరిగాయి. దోమల దెబ్బకు అల్లాడిపోతున్నారు. ఇంకోవైపు విష కీటకాలు, సర్పాల బెడద కూడా గ్రామస్థులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. అయితే కొల్లూరు నుంచి జనరేటర్‌లు, దీపాలను గ్రామాలకు పంపామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

అందని సాయం

లంక గ్రామాల వారికి ప్రభుత్వ అధికారులు ఆహారం, తాగునీటి బాటిళ్లను పెద్ద ఎత్తున పంపుతున్నారు. అయితే అవి అందరికీ చేరటంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాపట్ల జిల్లా అవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాలు వరద నీటిలో ఉన్న ఏరియల్ వ్యూ

ఎన్టీఆర్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

- ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- ప్రకాశం బ్యారేజీపై రాకపోకలు బంద్

విజయవాడ/తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరదలతో అల్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లాకు ముప్పు ఇంకా తొలిగిపోలేదు. బుధ, గురువారాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈ ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలోను ఒక మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపింది. మరోవైపు, కృష్ణా నదికి వరద ఉధృతి తగ్గినా ప్రకాశం బ్యారేజీపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. బ్యారేజి 69వ గేట్ మరమ్మతులు పూర్తయ్యే వరకు రకాల రాకపోకలు నిషేధిస్తున్నట్లు తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు మంగళవారం తెలిపారు.

రేపు అల్పపీడనం

- ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోస్తా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు రుతుపవన ద్రోణి తూర్పు భాగం రామగుండం, కళింగపట్నం మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించింది. దీంతో రుతుపవనాలు చురుగ్గా మారి.. మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నెల 5న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో అనేక చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ నెల ఏడో తేదీ వరకు ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

బాబు చొరవతో ఆస్పత్రికి గర్భిణీ



విజయవాడ పాతప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీ

విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు మంగళవారం జేసీబీ ఎక్కి విజయవాడలోని వరద ప్రాంతాల్లో పర్యటించారు. ఆ సమయంలో వాంబే కాలనీలోని కండ్రికకు చెందిన నెలలు నిండిన గర్భిణీ లక్ష్మి(31) తన గోడును ఆయనకు చెప్పుకొన్నారు. వరద నీరు కారణంగా ఆస్పత్రికి వెళ్లడానికి కుదరడం లేదని, ఏ క్షణాన డెలివరీ అవుతుందో తెలియడం లేదని వాపోయారు. చంద్రబాబు అక్కడికక్కడే స్పందించారు. భయం వద్దు.. జాగ్రత్తగా ఆస్పత్రికి చేర్చుతానని ఆమెకు ధైర్యం చెప్పారు. సీఎం ప్రయాణిస్తున్న జేసీబీ వెంట ఆ సమయంలో ట్రాక్టర్‌పై సీఎం సెక్రటరీ ఐఏఎస్ రాజమౌళి పర్యటిస్తున్నారు. చంద్రబాబు సూచనతో రాజమౌళి.. లక్ష్మిని తన ట్రాక్టర్‌లోకి ఎక్కించుకుని మెయిన్ రోడ్డు వరకు తీసుకొచ్చారు. అంబులెన్స్‌ను పిలిపించి ఆమెను పాత ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేయించారు.

వాయుసేన హెలికాప్టర్లతో ఆహార పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు భారత వాయుసేన హెలికాప్టర్ల ద్వారా తాగునీరు, బిస్కెట్లు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఇందుకోసం ఏడు వాయుసేన, నేవీ హెలికాప్టర్లు నిరంతరం పనిచేస్తున్నాయి. కాగా, వరద బాధితులకు స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వదలచిన దాతల కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్దేశిత పాయింట్‌ను నెలకొల్పినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఐఏఎస్ అధికారి మనజీర్‌ను ఫోన్ నంబరు 7906796105లో దాతలు సంప్రదించాలని సూచించింది. వ్యక్తిగత ధన సాయం చేయదలచిన దాతలు ఆన్‌లైన్ ద్వారా ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఖాతాలకు జమ చేయవచ్చని పేర్కొంది.

5 లక్షల ఆహార పొట్లాలు

- 'అక్షయ పాత్ర' అరుదైన రికార్డు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలోని హరేరామ హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ పాత్ర సంస్థ వరద బాధితుల కోసం 5 లక్షల ఆహార పొట్లాలు సిద్ధం చేసి అరుదైన రికార్డు సృష్టించింది. ప్రభుత్వం, దాతల సహకారంతో అక్షయ పాత్ర వంటశాలలో మొదటి రోజు 60 వేలు, రెండో రోజు లక్ష, మూడో రోజు 2 లక్షలు, నాలుగో రోజు 5 లక్షల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేసినట్లు అక్షయ పాత్ర అధికార ప్రతినిధి విలాస దాసప్రభు తెలిపారు. గుంటూరు, చిలకలూరిపేట, తెనాలి పురపాలక సంఘాల నుంచి రోజుకు 400 మంది సిబ్బంది ఈ విధుల్లో పాల్గొంటున్నారు.

ఆ మాత్రం చేయలేరా?

వరద సహాయ సామగ్రి ఉంది.. సొమ్ములకు కూడా కొదవ లేదు.. వాటిని పంచే పనీ చేయలేరా?

- అధికారులు, మంత్రులపై బాబు ఫైర్



జేసీబీ యంత్రంపై నిలబడి వరద బాధితులతో మట్లాడుతున్న సీఎం

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చల్లని చంద్రుని మాదిరిగా ఉండే ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం భగభగమండారు. వరద ముంపు ప్రాంతాల్లో సాయం అందడం లేదన్న ఫిర్యాదులు ఇంకా వస్తుండటంతో ఉన్నతాధికారులు, మంత్రులపై ఆయన విరుచుకుపడ్డారు. 'మంగళవారం సాయంత్రానికి ప్రతి ఇంటికీ సాయం అంది తీరాలి. సాయం అందలేదన్న ఫిర్యాదు ఒక్కటి వచ్చినా నేను ఊరుకొనేది లేదు. ఐఏఎస్ అధికారులనైనా... మంత్రులనైనా సస్పెండ్ చేయడానికి వెనకాడేది లేదు. ఇప్పటికి రెండు రోజులైంది. బాధితులు ఇంకా ఎన్ని రోజులు ఎదురు చూడాలి? సహాయ సామగ్రికి కొదవలేదు. డబ్బులకు వెనుకాడాల్సిన అవసరం లేదు. ప్రతి ఇంటికీ వాటిని చేర్చడమే మీ పని. అది కూడా మీరు చేయలేకపోతే ఊరుకోను. చేయలేనివాళ్లు పక్కకు తప్పుకోండి. చేయగలిగిన వాళ్లతో చేయించుకొంటాను' అని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. తాను బస చేసిన విజయవాడ కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం అధికారులు, మంత్రులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బాధితుల నుంచి ఫోన్ల ద్వారా చేసిన సర్వేలో వారికి అందుతున్న సాయంపై సంతృప్తి శాతం తగినంతగా లేకపోవడం ఆయన ఆగ్రహానికి కారణమైందని చెబుతున్నారు. సోమవారం రాత్రి చేయించిన ఈ సర్వేలో తమకు సాయం అందిందని చెప్పినవారు 70 శాతం ఉన్నారు. 30 శాతం అందలేదని చెప్పారు. ఆయన ఆ వివరాలను అధికారులందరికీ పంపారు. "ఇంత శాతం ప్రజలకు అందకపోతే మీరేం పనిచేస్తున్నట్లు? ఎవరికి అందుతోందీ... లేనిదీ చూసుకొనే బాధ్యత లేదా? ఇంటింటికీ తిరిగి నేనే పంచాలా? నేను ఒక ఆదేశం ఇస్తే 24 గంటల్లో సంపూర్ణంగా అమలు చేసిన చరిత్ర మన అధికార యంత్రాంగానికి ఉంది. ఇప్పుడు ఏమిటీ దౌర్భాగ్యం? గత ఐదేళ్లలో వ్యవస్థలు ఇంత పతనం అయ్యాయా' అని ఆయన వారిని నిలదీశారు.

సోమవారం రాత్రి పొద్దుపోయేవరకూ మంత్రులు లోకేశ్, నారాయణ, కేశవ్, ఉన్నతాధికారులు కూర్చుని ప్రతి ఇంటికీ సాయం అందించడానికి సవివరమైన ప్రణాళిక రూపొందించారు. ముంపు ప్రాంతాల్లో మొత్తం 172 వార్డు సచివాలయాలు ఉండగా అందులో పాతిక సచివాలయాల పరిధిలో పూర్తి స్థాయిలో పంపిణీ జరగలేదని క్షేత్ర స్థాయి నుంచి వారికి సమాచారం అందింది. లోపల ఉన్న ఇరుకు సందుల్లోకి పడవలు వెళ్లలేకపోతున్నాయి. ముంపు ఎక్కువ ఉండటంతో నడిచి వెళ్లలేకపోతున్నారు. హెలికాప్టర్లు, డ్రోన్లతో ఎంత పంపిణీ చేసినా సరిపోవడం లేదు. సింగ్ నగర్ ప్రాంతంలో లోపలికి వెళ్లే వీలు లేకుండా ప్రారంభంలోనే వేల మంది ప్రజలు, వాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. దీనితో పంపిణీ అక్కడే పూర్తయిపోయి లోపలికి వెళ్లలేకపోతున్నామని ఒక అధికారి వివరించారు. దీనితో 30 ట్రాక్టర్లు తెప్పించి వాటి ద్వారా లోపలి వీధుల్లోకి ఆహార పొట్లాలు, మంచినీరు, పాలు పంపాలని నిర్ణయించారు. జక్కంపూడి కాలనీ ప్రాంతంలో శ్రీనివాస్ అనే ఒక అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మంగళవారం ఉదయం అతనిని సస్పెండ్ చేశారు. తాను చెప్పిన ఆదేశాలు ఎంత వరకూ అమలయ్యాయో చూడటానికి చంద్రబాబు 12 గంటలకు ముంపు ప్రాంతాలకు వెళ్లారు. భోజనం కూడా చేయకుండానే వెళ్లిన ఆయన, సాయంత్రం వరకూ అక్కడే ఉన్నారు.

22 కిలోమీటర్లు జేసీబీపై నిలబడి...

- నాలుగున్నర గంటలపాటు బాబు పర్యటన

విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన 22 కిలోమీటర్ల దూరం జేసీబీ యంత్రంపై నిలబడి ఉన్నారు. వరద నీటిలో ఈ యంత్రంపై అయితే ప్రజలకు దగ్గరగా వెళ్లవచ్చని భావించి, ఆయన తన కాన్వాయ్‌ను వదిలిపెట్టి దీనిపై ఎక్కారు. సుమారు నాలుగున్నర గంటలపాటు ఆయన పర్యటన సాగింది. వరద నీరు నిలిచిన చోటుకు కార్లు వెళ్లే అవకాశం లేదు. పడవలు కూడా అన్ని వీధుల్లోకి వెళ్లలేకపోతున్నాయి. దీనితో ఆయన జేసీబీని ఎంచుకున్నారు. దానిలో డ్రైవర్ తప్ప మరొకరు కూర్చోవడానికి అవకాశం ఉండదు. దీంతో ఆయన నిలబడే తిరిగారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన కనకదుర్గ ఆలయానికి సమీపంలో ఉన్న భవానీపురం ప్రాంతం నుంచి పర్యటన ప్రారంభించారు. సితార సెంటర్, జక్కంపూడి రాజీవ్ స్వగృహ కాలనీ, వాంబే కాలనీ, వైఎస్సార్ కాలనీ, నున్న, కండ్రిక, ఇన్నర్ రింగ్ రోడ్డు వరకూ పర్యటన సాగింది. నున్న ప్రాంతం విజయవాడ నగరానికి రెండో వైపు నూజివీడు వెళ్లే దారిలో ఉంటుంది. ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద ఆయన తన పర్యటన ముగించి కారు ఎక్కారు. ఆయన తన పర్యటన ముగించిన చోటుకు కాన్వాయ్ చేరలేకపోయింది. దీనితో మరి కొంత దూరం జేసీబీపైనే ప్రయాణం చేసి తన కాన్వాయ్ కనిపించిన చోట దిగి ఎక్కారు. సితార సెంటర్లో ఆయన వెనక్కు వచ్చి కారు ఎక్కుతారని భావించి కార్లను అక్కడ నిలిపారు. కానీ ఆయన ఎక్కువ మంది బాధితులను కలవాలని వరద నీటిలోనే తిరిగారు. ప్రతి చోటా ఆగి బాధితులతో మాట్లాడి వారికి సాయం అందుతోందా... ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకొన్నారు. కొంత మంది తమ ఆరోగ్య సమస్యలు చెప్పి వరద ప్రాంతం నుంచి బయటకు పంపించాలని కోరారు. ఎవరు ఏ సమస్య చెప్పినా ఆయన స్థానిక ఇన్‌చార్జి అధికారికి చెప్పి నోట్ చేయించారు. పలు ప్రాంతాల్లో బాధితుల సమస్యలు విన్న ఆయన అక్కడి అధికారులను గట్టిగా మందలించారు. పర్యటన పూర్తయిన తర్వాత ఆయన విజయవాడ కలెక్టరేట్‌కు వచ్చి తిరిగి అధికారులతో సమావేశం అయ్యారు. సాయం అందలేదని తనకు చెప్పిన ప్రాంతాలకు ఆహారం, మంచినీళ్లు వెళ్ళకపోవడానికి కారణం ఏమిటని నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నూటికి నూరు శాతం ప్రభుత్వ సాయం ప్రతి ఇంటికీ అందాలని, అప్పటివరకూ తాను రోజూ క్షేత్ర పర్యటన జరిపి ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొంటానని స్పష్టం చేశారు. ఆయనతోపాటు నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

సన్నద్ధంగా లేని యంత్రాంగం

ఆకస్మిక వరదలు వస్తే ఎదుర్కోవడానికి విజయవాడ నగర యంత్రాంగం సన్నద్ధంగా లేదని తాజా పరిణామం నిరూపించింది. ప్రజలను తరలించడానికి మొదటి రెండు రోజుల్లో పాతిక పడవలను మాత్రమే అధికారులు సమీకరించగలిగారు. గోదావరి జిల్లాల్లో వరదలు వచ్చినప్పుడు ఒక చిన్న లంకకు కూడా పది పడవలు పంపి ప్రజలను బయటకు తరలిస్తారని అక్కడి ఎమ్మెల్యే ఒకరు చెప్పారు. విజయవాడ నగరంలో రెండున్నర లక్షల జనాభా ముంపు ప్రాంతంలో ఉండిపోయింది. ఇన్ని లక్షల మందిని తరలించే మార్గం లేక అధికారులు చేతులు ఎత్తేశారు. మున్ముందు ఇటువంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి అత్యవసర ప్రణాళిక అవసరమని ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయి.

గంటల్లోనే బీభత్సం

- స్థానిక వాగుల నుంచి భారీ వరద
- బెజవాడ ముంపునకు ఇదే కారణం
- కృష్ణా నది ప్రవాహంలో సగం వాటి వల్లే
- అంచనాలకు దొరకని వాగుల వరద



కృష్ణా నదిలో ఉండే భవానీ ద్వీపం వద్ద వరద ఉధృతి. నీటిలో కొట్టుకు వచ్చిన కారు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిని తాజాగా ముంచెత్తిన వరదలో సగం జల ప్రవాహం స్థానిక వాగుల నుంచే వచ్చింది. ఈ వాగుల నుంచి ఎంత వరద వస్తోందో ముందుగా అంచనాలకు అందకపోవడమే ఆ తర్వాత అధికార యంత్రాంగం పరుగులు పెట్టడానికి కారణమైంది. కొద్ది గంటల వ్యవధిలోనే వాగుల నుంచి భారీ ప్రవాహం పోటెత్తడమే విజయవాడ ముంపునకూడా ప్రధాన కారణం. కృష్ణా నదిపై పై నుంచి కింది వరకూ ప్రవాహాన్ని అంచనా వేసే యంత్రాలు ఉన్నాయి. ప్రతి ఆనకట్ట, బ్యారేజీ వద్ద వీటిని పెట్టారు. వీటి సాయంతో వరద ఎంత ఉందో, ఏ సమయానికి ఏ ప్రాంతానికి అది వస్తుందో నీటి పారుదల శాఖ వర్గాలు అంచనా వేయగలుగుతున్నాయి. ఉదాహరణకు పులిచింతల నుంచి విడుదలైన వరద ప్రకాశం బ్యారేజీ చేరడానికి ఏడు గంటలు పడుతుంది. దీని ఆధారంగా అధికారులు సన్నద్ధమై, ప్రజలను అప్రమత్తం చేసేవారు. కానీ ఇటువంటి వ్యవస్థ స్థానిక వాగులపై లేదు. అనేక చిన్న చిన్న వాగులు కలిసి ఒక పెద్ద వాగుగా రూపాంతరం చెందుతున్నాయి. ఈసారి ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదికి పదకొండున్నర లక్షల క్యూసెక్కుల వరద వస్తే, అందులో స్థానిక వాగుల ద్వారా వచ్చిది 5లక్షల క్యూసెక్కులకు పైగా ఉంది. మున్నేరు, వైరా, బుడమేరు వంటి వాగులు ఈ ప్రవాహాన్ని తీసుకొచ్చాయి. ఇవన్నీ పులిచింతల కింద ప్రకాశం బ్యారేజీకి ఎగువన నదిలో కలుస్తున్నాయి. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ వాగులు ఈసారి విపరీతమైన వరదను చవిచూశాయి. పైగా ఇవన్నీ రెండు మూడు గంటల వ్యవధిలోనే కృష్ణా నదిలో కలిశాయి. వరద రాబోతోందని తమకు ముందు రోజు రాత్రి చెప్పారని, కొంతముందుగా చెబితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేవాళ్లమని విజయవాడ నగరంలో కృష్ణా నదిని ఆనుకొని ఉన్న రామలింగేశ్వర నగర్ ప్రాంతవాసులు మీడియా ప్రతినిధులకు చెప్పారు. మున్ముందు స్థానిక వాగుల ప్రవాహం తీరు తెన్నుల అంచనాకు కూడా యంత్రాల ఏర్పాటు తప్పదని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

వైసీపీ సర్కారు అలసత్వంతో...

విజయవాడలో మిల్క్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ప్రాంతాలను ముంచి వేసిన బుడమేరు కూడా ఆకస్మికంగానే వచ్చి పడింది. దీనికి వరద వస్తే 30 వేల క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి తీసుకువెళ్లడానికి ఒక పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. దిగిపోయే సమయానికి 80% పూర్తయింది. వైసీపీ ప్రభుత్వం దానిని పట్టించుకోకుండా వదిలేసింది. ఇప్పుడు బుడమేరుకు రికార్డు స్థాయిలో వరద వచ్చింది. ప్రవాహ మార్గంలో బుడమేరుకు మూడు చోట్ల గండ్లు పడటంతో వరద విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. గండ్లు పడిన మార్గం వద్దకు వెళ్లే దారి కూడా లేకుండా పోయింది. ప్రవాహం తగ్గిన తర్వాత మంగళవారం గండ్లను పూడ్చే పనులను అధికార యంత్రాంగం ప్రారంభించింది. అవి పూడ్చితే ఈ ఏరు నుంచి విజయవాడ నగరంలోకి వచ్చే వరద ఆగే అవకాశం ఉంది.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీకి సూచనలు ఇస్తున్న మంత్రి లోకేశ్

శరవేగంగా సహాయం

- 6 హెలికాప్టర్లు, 174 బోట్ల ద్వారా ఆహారం, మంచినీరు, మందులు
- బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా... లోకేశ్ పర్యవేక్షణ

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద బాధితులకు మానవ వనరులశాఖ మంత్రి లోకేశ్ పర్యవేక్షణలో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంత్రి పిలుపు మేరకు రాష్ట్రం నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు విజయవాడకు చేరుకున్నాయి. బాధితుల కోసం వివిధ సంస్థలు ఆహారాన్ని పంపిస్తున్నాయి. గీతం విద్యాసంస్థల ఛైర్మన్, విశాఖ ఎంపీ భరత్ 50వేల మందికి, ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో 25వేల మందికి ఆహారం అందజేశారు. ద్వారకా తిరుమల దేవస్థానం రూ.5 వేల పులిహోర ప్యాకెట్లు పంపింది. ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో మంగళవారం ఉదయం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు 6 హెలికాప్టర్లు, 174 బోట్ల ద్వారా బాధితులకు ఆహారం, మంచినీరు, మందులు సరఫరా చేస్తున్నారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా పంపిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే 3 లక్షల ఆహార పొట్లాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది ఆశ్రయం పొందుతున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అభ్యర్థన మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలు పంపించారు. ఇంకా వాంబే కాలనీ, అజిత్‌సింగ్‌నగర్‌లో హెలికాప్టర్ల ద్వారా ఆహారం, వాటర్ బాటిళ్లను జారవిడిచారు. ఈ పునరావాస, సహాయ కార్యక్రమాలు చివరి బాధితుల వరకు చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు వీలుగా ప్రతి వార్డుకు ఒక ఎమ్మెల్యేని ఇన్‌చార్జిగా నియమించారు. మంత్రులు కేశవ్, అనిత, కొల్లు రవీంద్ర, పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో మంత్రి లోకేశ్ సమన్వయం చేసుకుంటూ సహాయ కార్యక్రమాలు సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి రవిచంద్ర, ఇంటెలిజెన్స్ డీజీ మహేశ్‌చంద్ర లడ్డా తదితర ఉన్నతాధికారులతో లోకేశ్ సమీక్ష నిర్వహించారు.

ఈ కన్నీటి వ్యథకు వైసీపీ నేతలే కారణం: పల్లా

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇసుక దందా వల్లే బుడమేరుకు గండ్లుపడి విజయవాడకు వరద ముంపు వచ్చిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్ ధ్వజమెత్తారు. ఐదేళ్లూ బుడమేరును గాలికొదిలేసి, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లేందుకు జగన్ వచ్చాడని మండిపడ్డారు. విపత్తు సమయాల్లో జగన్ ఏనాడూ బాధితుల పక్షాన నిలబడలేదన్నారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

బుడమేరు విపత్తు జగన్ తప్పిదమే: మంత్రి నిమ్మల

బుడమేరు విపత్తు ముమ్మాటికీ జగన్ తప్పిదమేనని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. మంగళవారం విజయవాడలో మాట్లాడారు. 'బుడమేరును జగన్ నిర్లక్ష్యం చేయడం వల్లే విజయవాడ నగరానికి వరద విపత్తు సంభవించింది. సోమవారం జగన్ చేసిన బురద రాజకీయాలను ప్రజలు నమ్మలేదు' అని అన్నారు.

జగన్...ఆ తేడా తెలుసుకో: నాగబాబు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం, ప్రస్తుత పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డీ... మీరు ఫస్ట్ క్లాస్ స్టూడెంట్. కాబట్టి ప్రకృతి విపత్తుకు, మానవ కల్పిత విపత్తుకు తేడా తెలుసుకోవలసిందిగా కోరుతున్నా' అని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. 'కృష్ణా నది వరదలు మానవ కల్పిత విపత్తు' అని జగన్ పేర్కొనడాన్ని నాగబాబు ఎక్స్ వేదికగా తప్పుపట్టారు.

ప్రకాశం బ్యారేజీలో..

మరో 'కౌంటర్' కట్!



ప్రకాశం బ్యారేజ్‌పై అధికారులకు సూచనలిస్తున్న ప్రభుత్వ సలహాదారు కన్నయ్య నాయుడు

- 67వ ఖానా వద్ద దెబ్బతిన్న సిమెంట్ దిమ్మె
- 3 కౌంటర్ వెయిట్లు ధ్వంసం
- పరిశీలించిన కన్నయ్యనాయుడు

విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీలో మరో కౌంటర్ వెయిట్ దెబ్బతింది. వరదలో కొట్టుకొచ్చిన ఇనుప బోట్లు ఢీకొని ఇప్పటికే 64, 69వ నంబర్ల వద్ద ఉన్న రెండు కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్న విషయం తెలిసిందే. జలవనరుల శాఖ సలహాదారు కన్నయ్యనాయుడు, డ్యాం సేఫ్టీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, వర్క్‌షాపు అధికారులు మంగళవారం మరోసారి బ్యారేజీని, వరద తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇనుప బోటు కారణంగా 67వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్ కూడా మధ్యకు విరిగిపోయినట్లు గుర్తించారు. 69, 64వ వద్ద ఉన్న కౌంటర్ వెయిట్లు ఇప్పటికే దెబ్బతిన్నాయి. ఈ రెండింటిని తక్షణం మార్పు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు మూడో వెయిట్ కూడా తయారుచేయాలని నిశ్చయించారు. వాటికి సంబంధించిన డిజైన్లను రూపొందించే పనిలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు ఉన్నారు. కౌంటర్ వెయిట్లను పరిశీలించిన అనంతరం బ్యారేజీకు పైన ఉన్న మోటార్లను, చైన్ సిస్టంను పరిశీలించారు. కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్న గేట్లకు సంబంధించిన మోటర్లతోపాటు ఇతర మోటర్లను కన్నయ్యనాయుడి బృందం పరిశీలించింది. వరద తగ్గుముఖం పట్టాక ఈ మూడు కౌంటర్ వెయిట్లు ఉన్న గేట్లను కిందికి దించాలని సూచించారు. కిందికి దింపే క్రమంలో మోటార్లను ఉపయోగించవద్దని కన్నయ్యనాయుడు స్పష్టం చేశారు. మోటార్లు ఆన్ చేయకుండా మాన్యువల్‌గా నెమ్మదిగా కింది దించాలన్నారు. ప్రస్తుతం బ్యారేజీకి 7.76లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ఇది 5లక్షల క్యూసెక్కులకు తగ్గిన తర్వాత నెమ్మదిగా దింపాలని సూచించారు. మోటార్లు ద్వారా దింపితే గేటు వేగంగా దిగి దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కౌంటర్ వెయిట్ ఏమిటంటే?

నదులపై బ్యారేజీలు నిర్మించినప్పుడు ఎగువ నుంచి వచ్చిన నీరు దిగువకు వెళ్లడానికి గేట్లు అమర్చుతారు. వరదలు వచ్చినప్పుడు దిగువకు వెళ్లే నీటి పరిమాణాన్ని బట్టి ఖానాలు, గేట్లు నిర్మిస్తారు. ఖానాల మధ్యలో గేట్లు ఉంటాయి. ఈ గేట్లను విద్యుత్ మోటార్ల ద్వారా పైకి ఎత్తడం, కిందికి దింపడం చేస్తుంటారు. ఈ గేట్లకు బ్యారేజీ పై భాగం నుంచి రెండు వైపులా భారీ ఇనుప గొలుసులను అమర్చుతారు. గేట్ల బరువు మొత్తం మోటార్లపై పడకుండా వాటికి దన్నుగా 48-50 టన్నుల బరువు ఉండే కాంక్రీట్ దిమ్మెను బిగిస్తారు. దీని ఎత్తు ఐదు మీటర్లు, వెడల్పు ఆరు మీటర్లు ఉంటుంది. వాటిని గేటుకు వెనుక వైపు భాగాన ఉండేలా అమర్చుతారు. ఈ కాంక్రీట్ దిమ్మలనే కౌంటర్ వెయిట్ అని వ్యవహరిస్తారు. ఈ కౌంటర్ వెయిట్లకు హుక్కులు బిగించి భారీ ఇనుప గొలుసులతో వేలాడదీస్తారు. గేటు, ఈ కౌంటర్ వెయిట్ల కదలికల వ్యతిరేక దిశలో ఉంటుంది. గేటు కిందికి దిగినప్పుడు కౌంటర్ వెయిట్ పైకి లేస్తుంది. అదే గేటు పైకి లేచినప్పుడు కౌంటర్ వెయిట్ కిందికి దిగుతుంది.

ఆ బోటు ఏమైంది?

- కొట్టుకొచ్చిన బోట్లు ఐదు
- ఓ గేటు కింద ప్రవాహంలో ఇంకో బోటు ఆనవాలు?

ఇనుప బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజీలో మూడు గేట్లకు వెనుక వైపున ఉండే కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన నాలుగు బోట్లు ఢీ కొనడంతో 64, 69వ నంబరు ఖానాల వద్ద ఉన్న కౌంటర్ వెయిట్లకు నష్టం కలిగిందని అధికారులు తొలుత భావించారు. ఇందులో రెండు బోట్లు 69 వద్ద, మరో బోటు 64వ నంబరు ఖానా వద్ద ఉండిపోయాయని, ఇంకొకటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయిందనుకున్నారు. మంగళవారం అధికారులు ఈ ఖానాలను పరిశీలించారు. తొలుత ఒక బోటు వచ్చి బలంగా ఢీ కొనడంతో 69వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్ విరిగిపోయింది. తర్వాత రెండు బోట్లు కొట్టుకొచ్చి మొదటి బోటు వద్ద నిలిచిపోయాయి. వీటిలో ఒకటి ఢీ కొట్టడంతో 64వ నంబరు వద్ద ఉన్న కౌంటర్ వెయిట్ స్వల్పంగా దెబ్బతింది. తర్వాత 69వ నంబరు ఖానా వద్ద ఉన్న బోట్లలో ఒకటి ప్రవాహ ఉధృతికి కదిలి 67వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో అది విరిగిపోయింది. సలహాదారు కన్నయ్యనాయుడి బృందం మంగళవారం పరిశీలించినప్పుడు ఇది బయటపడింది. అయితే అదే సందర్భంలో అదే 67వ నంబరు ఖానా వద్ద గేటు కింద ఇంకో బోటు ఆనవాళ్లు లీలగా కనిపిస్తున్నాయి. కౌంటర్ వెయిట్‌ను ఇది బలంగా ఢీకొని గేటు గుండా ప్రవాహంలో కొట్టుకుపోయే క్రమంలో ఇరుక్కుపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మొత్తం 5 బోట్లు కొట్టుకొచ్చాయని నిర్ధారించుకున్నారు. అయితే వరద మరింత తగ్గితే గానీ అది బోటో, మరొకటో స్పష్టంగా తెలియదని అధికారులు చెబుతున్నారు.

'69'కి వరద ఎఫెక్ట్

ప్రకాశం బ్యారేజీకి భారీ వరద వచ్చినప్పుడల్లా 69వ నంబరు ఖానా వద్ద ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. 2019లో కూడా భారీ వరద ఉధృతికి ఎగువ నుంచి కొట్టుకు వచ్చిన ఇనుప బోటు సరిగ్గా 69వ నంబరు ఖానా వద్ద గేటుకు మధ్యలో ఇరుక్కుపోయింది. దీంతో వరద తగ్గినా బ్యారేజీక వెనుక ఉన్న నీరు వృథాగా పోయింది. కాకినాడకు చెందిన ధర్మారావు బృందం నాలుగు రోజులపాటు తీవ్రంగా శ్రమించి బోటును తొలగించింది. ఇప్పుడు తాజాగా 69వ నంబరు ఖానా వద్ద ఇనుప బోటు కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టింది.

విద్యుత్ పునరుద్ధరణ పనులకు ఈపీడీసీఎల్ ఉద్యోగులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముంపునకు గురైన కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సారథ్యంలో 600 మంది ఉద్యోగులు అక్కడకు తరలివెళ్లారు. సోమవారం ఉదయమే చేరుకుని కూలీలతో కలిసి 64 బృందాలుగా ఏర్పడి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. చీఫ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లు, లైన్ స్టాఫ్‌తో సీఎండీ తుళ్లూరు తదితర ప్రాంతాల్లో సమీక్షలు, సర్వేలు నిర్వహించారు.



కరకట్ట పటిష్టతలో భాగంగా పెదపులివర్రు కరకట్టకు ఇసుక బస్తాల ఊతం

కృష్ణా కరకట్ట క్షేమం!

- కలిసొచ్చిన సమన్వయం.. గండ్లు పడకుండా చర్యలు
- యుద్ధ ప్రాతిపదికన కదిలిన అధికారులు, నేతలు, గ్రామస్థులు
- రేపల్లెకు తప్పిన పెనుముప్పు.. అర్ధరాత్రి దాటాక మంత్రులు అనగాని, గొట్టిపాటి పరిశీలన

బాపట్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోటెత్తిన వరద నీటితో కృష్ణానది కుడి కరకట్టకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్న హెచ్చరికలు.. గుంటూరు జిల్లా రేపల్లె సహా 30 గ్రామాల ప్రజలకు కంటిపై కునుకులేకుండా చేశాయి. అయితే.. సోమవారం రాత్రికిరాత్రి అటు అధికారులు, ఇటు నాయకులు మరోవైపు గ్రామస్థులు కరకట్టను పటిష్ఠ పరిచేందుకు యుద్ధ ప్రాతిపదికన ముందుకు కదిలారు. దీంతో రేపల్లె పట్టణంతో పాటు మెరకన ఉన్న గ్రామాలకు పెనుముప్పు తప్పినట్లయింది. సోమవారం అర్ధరాత్రి దాటే వరకు కూడా కరకట్టల వద్దే అధికారులు తిష్టవేశారు. మంత్రులు అనగాని, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు కూడా కరకట్టల పరిస్థితిని పరిశీలించారు. ప్రకాశం బ్యారేజీ నీటి ప్రవాహం కూడా మంగళవారం ఉదయానికి తగ్గుముఖం పట్టడంతో అధికారులతో పాటు ప్రజలు పెను గండం తప్పినట్లయిందని ఊపిరి పీల్చుకున్నారు.

సోమవారం ఉదయం నుంచి టెన్షన్

వరదల కారణంగా లంక గ్రామాలు ముంపులో ఉండడంతో వారిని రక్షించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. ఈ లోగానే భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు, ఓలేరు కరకట్టలతో పాటు రేపల్లె మండల పరిధిలోని రావి అనంతవరం కరకట్టకు కూడా ప్రమాదం పొంచి ఉందని గుర్తించారు. హుటాహుటిన యంత్రాంగం అక్కడకు తరలివచ్చి యుద్ధ ప్రాతిపదికన కరకట్టల పటిష్టానికి చర్యలు చేపట్టింది. ముందస్తు చర్యల్లో భాగంగా రేపల్లె పట్టణ ప్రజానీకాన్ని జిల్లా కలెక్టర్ వెంకటమురళి అప్రమత్తం చేశారు. కలెక్టర్‌తో పాటు టీడీపీ నేతలూ అక్కడే తిష్ట వేశారు. కరకట్టల పటిష్టానికి రైతుల సహకారం కూడా తీసుకున్నారు. విభాగాలను సమన్వయ పరచి ఇసుక బస్తాలు, కంకరను గంటల వ్యవధిలో తరలించి పనులను చేపట్టారు. అయినప్పటికీ రావి అనంతవరం కరకట్టతో పాటు పెదపులివర్రుకు లీకులు కనిపించడంతో అప్పటికప్పుడే వాటిని పూడ్చే ప్రయత్నం చేశారు. ప్రమాదకరంగా ఉన్న కరకట్టల వద్ద డివిజన్ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు

పెనుముప్పు తప్పింది!

లీకులు ఏర్పడిన ఏ ఒక్క కరకట్టకు గండి పడినా రేపల్లె పట్టణంతో పాటు మెరకన ఉన్న మరికొన్ని గ్రామాలు వరద నీటిలో మునిగిపోయేవి. అయితే, శక్తివంచన లేకుండా అందరూ సమన్వయంతో పనిచేయడంతో పెనుముప్పు తప్పినట్లయింది. ఓ దశలో ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటమురళి సూచించారు. అయితే.. కృష్ణమ్మ శాంతించడంతో పెను ప్రమాదం తప్పింది. కానీ, ఓ దశలో కరకట్టకు సమానంగా నీళ్ల ప్రవహిస్తుండడంతో వాటి ఎత్తును కూడా పెంచారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 4 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

మౌలానా ఆజాద్ వర్సిటీలో
డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) మోడ్‌లో నిర్వహిస్తున్న పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. డిగ్రీ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. సర్టిఫికెట్ కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఒక సెమిస్టర్ ఉంటుంది. డిప్లొమా(టీచ్ ఇంగ్లీష్/ఎంప్లాయిబిలిటీ స్కిల్స్), ఎంఏ(ఇంగ్లీష్), సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో మిగిలినవాటిని ఉర్దూ మాధ్యమంలో బోధిస్తారు.



ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, ఇంగ్లీష్, హిస్టరీ, అరబిక్, హిందీ
- **డిగ్రీ ప్రోగ్రామ్‌లు:** బీఏ, బీకాం, బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్), బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)
- **డిప్లొమా:** టీచ్ ఇంగ్లీష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్
- **సర్టిఫికెట్ కోర్సులు:** ఫంక్షనల్ ఇంగ్లీష్, ప్రొఫిషియెన్సీ ఇన్ ఉర్దూ త్రూ ఇంగ్లీష్

అర్హత: సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత; డిప్లొమా, డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఇంటర్ ఉత్తీర్ణత చాలు. డిప్లొమా(టీచ్ ఇంగ్లీష్)కు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీలో ప్రవేశానికి సంబంధిత స్పెషలైజేషన్‌తో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గాగానీ, ఉర్దూ మాధ్యమంలో గానీ చదివి ఉండాలి. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **ఆన్‌లైన్ ఇండక్షన్ ప్రోగ్రామ్ తేదీ:** నవంబరు 1
- **ఆఫ్‌లైన్ ఇండక్షన్ ప్రోగ్రామ్ తేదీ:** నవంబరు 3
- **వెబ్‌సైట్:** manuu.edu.in/dde

బెంగళూరు ఐఐఎంలో
పీజీపీఈఎం

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్(పీజీపీఈఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఎంబీఏ డిగ్రీని ప్రదానం చేస్తారు.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2025 మార్చి 31 నాటికి కనీసం నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. క్యాట్ 2024/జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ఐఐఎంబీ ఎంట్రెన్స్ టెస్ట్: ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్, వెర్బల్, లాజికల్, డేటా ఇంటర్‌ప్రిటేటివ్ ఎబిలిటీస్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 జనవరి 22
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** రౌండ్ 1 టెస్ట్ తేదీ-నవంబరు 17న; రౌండ్ 2 టెస్ట్ తేదీ-2025 ఫిబ్రవరి 2న
- **ఇంటర్వ్యూ సెంటర్:** బెంగళూరు
- **ఇంటర్వ్యూలు:** 2025 ఫిబ్రవరి 15, 16
- **వెబ్‌సైట్:** iimb.ac.in





నీలిట్‌లో
ఎంటెక్ ప్రోగ్రామ్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గేట్ 2022/2023/2024 స్కోర్ లేదా సీయూఈటీ పీజీ 2024 స్కోర్ లేదా ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు సంస్థ నెలకు రూ.9,000ల అసిస్టెంట్‌షిప్/స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో(బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ 2022/2023/2024 స్కోర్ లేదా సీయూఈటీ పీజీ 2024 స్కోర్ ఉన్నవారికి నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు. మిగిలినవారు ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **అభ్యర్థులు గోరఖ్‌పూర్ క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** సెప్టెంబరు 5
- **ఇన్‌స్టిట్యూట్ లెవెల్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 5
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఎన్‌పీటీఐలో
పోస్ట్ డిప్లొమా

దుర్గాపూర్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)- పోస్ట్ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైమ్ కోర్సు. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ వ్యవధి 26 వారాలు. ప్రోగ్రామ్‌లో భాగంగా థర్మల్ పవర్ స్టేషన్లు, హైడ్రో పవర్ స్టేషన్లు, సోలార్ పవర్ ప్లాంట్స్, ఈహెచ్‌వీ సబ్‌స్టేషన్స్, లోడ్ డిస్పాచ్ సెంటర్లు, మాన్యుఫాక్చరింగ్ యూనిట్లను విజిట్ చేసే అవకాశం కల్పిస్తారు. అకడమిక్ ప్రతిభ, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీట్ల వివరాలు: ఈ కోర్సులో మొత్తం 72 సీట్లు ఉన్నాయి. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన టెక్నికల్ బోర్డు నుంచి మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్) పూర్తిచేసి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు. ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,77,140
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 23
- **మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** సెప్టెంబరు 26, 27
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 30 నుంచి
- **వెబ్‌సైట్:** nptidurgapur.co.in



SCHOLARSHIP ALERT

OakNorth STEM Scholarship and Mentorship Programme

Description: OakNorth STEM Scholarship and Mentorship Programme aims to provide financial support to meritorious and underprivileged female students belonging to Uttarakhand, Bihar and Haryana pursuing graduation in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects from government colleges/universities.

Eligibility: Female students from Haryana, Uttarakhand and Bihar who have passed Class 12 and are currently pursuing graduation (any year) in STEM-related subjects from government universities/colleges are eligible. The annual family income of the applicants must be less than INR 3.5 lakh from all sources. Aggregate marks secured by candidates in the Class 12 (or equivalent) examination must be 80% or above (with the exception of children with single parents or orphans) and 65% in the previous class/semester/year (if applicable).

Prizes & Rewards: INR 30,000 (fixed amount)

Last Date to Apply: 18-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ONSS3

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

Nikon Scholarship Program 2024-25

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/NIKON12

U-Go Scholarship Program

Description: U-Go Scholarship Program 2024-25 is a CSR initiative by U-Go to financially support young women pursuing professional graduation courses.

Eligibility: Open to young women pursuing the first year of professional graduation courses such as teaching, nursing, pharmacy, medicine, engineering, architecture, law, etc., in India. Applicants must have secured at least 70% marks in Classes 10 and 12. The annual family income of the applicant from all sources must be less than INR 5 lakh.

Prizes & Rewards: Up to INR 60,000 per year for the length of the program

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/UGO3



Intuit Rise Girl Child Education Program 2024-25

Description: Intuit India is dedicated to empowering underprivileged girl students from Class 8 through graduation by providing comprehensive educational support. This support will help these students achieve their full potential, paving the way for a brighter future!

Eligibility: Female students from Class 8 up to the graduation are eligible to apply.

- To quality, applicants must have secured over 60% in their previous academic year
- The annual family income of applicants must be less than INR 3.5 lakh.
- Children of employees of Intuit India and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of up to INR 46,305

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/IRGC3



buddy4study.com


చిట్టి

దాన ఫలం



అవంతీపురాన్ని పరిపాలించే రాజు ప్రసేనుడికి తన గురువు ఆనందుడు అంటే అమితమైన భక్తి, గౌరవం. తనకు పాలనలో ముఖ్యమైన సలహాలనిచ్చి, తనకు సాయం చేసినందుకు కృతజ్ఞతగా గురువుకు ఒకరోజు మంచి పట్టు బట్టలు కానుకగా సమర్పించాడు రాజు. గురువుగారు తన ఆశ్రమానికి తిరిగి వెళుతూ ఆ బట్టలను దారిలో చలికి వణికిపోతున్న ఒక బిచ్చగాడికి ఇచ్చేసాడు. తాను గురువు గారికి కానుక ఇచ్చిన కొత్త పట్టు బట్టలు ఒక బిచ్చగాడి వద్ద ఉన్నట్టు భటుల ద్వారా తెలుసుకున్న రాజుకు చాలా కోపం వచ్చింది. తన గురువు తనను అవమానించాడని భావించి, వెంటనే గురువు గారికి ఎందుకిలా చేసారని ప్రశ్నిస్తూ, ఒక లేఖ పంపాడు. ఆ లేఖ చదువుకుని రాజు ఆగ్రహాన్ని అర్థం చేసుకున్న ఆనందుడు ఇలా ప్రత్యుత్తరం పంపాడు. 'రాజా.. ఒకరికి మనం ఏదైనా ఇచ్చాము అంటే దాని మీద హక్కును పూర్తిగా వదులుకున్నట్టే, అది ఇకపై మనది కాదు. పట్టుబట్టల విషయం మీరు ఇంకా గుర్తుంచుకుని నన్ను అడుగుతున్నారంటే, ఇంకా మీరు వాటిని మీవిగా భావిస్తూనే ఉన్నారు అన్నమాట. వాటి మీద హక్కును కలిగి ఉంటూ మీరు ఎన్ని దానాలు చేసినా మీకు దాన ఫలం రాదు, తృప్తి కూడా కలగదు.. ఆ పట్టు బట్టల అవసరం ఆ సమయానికి నాకంటే ఆ బిచ్చగాడికే ఎక్కువ ఉందని నేను అతనికి ఇచ్చేసాను మీరొకసారి నాకు ఇచ్చివేసాక నేను వాటిని ఎలా ఉపయోగించుకుంటాను అనేది పూర్తిగా నా ఇష్టం కదా' అని. గురువు గారి ప్రత్యుత్తరం చదువుకున్న రాజు అందులో ఉన్న పాఠం అర్థం చేసుకున్నాడు మరెప్పుడూ ఎవరికి ఏమి దానమిచ్చినా మనస్ఫూర్తిగా ఇచ్చివేసి, మరల దాని గురించిన ఆలోచనే మరచిపోయాడు.

10 తేడాలను కనిపెట్టండి






జంతువులు ఎన్ని ఉన్నాయి?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 401

				7	
9		4			
5	2		4		
	8				5
	1	7	3		8
			1		

సుడోకు - 400 సమాధానం

2	8	6	7	3	9
1	4	9	6	8	5
7	3	5	4	2	1
8	9	3	5	6	7
6	7	1	2	4	3
5	2	4	9	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.